నవంబర్
2020

175

సంపుటి : 15 సంచిక : 6 వెల రు. 10/-

## ఈ సంచికలో........

జాతీయోద్యమం, దేశాభివృద్ధిలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర
మోడి విధానాలకు వ్యతిరేకంగా నవంబరు 26న సార్వత్రిక సమ్మె
హత్రాస్ ఘటన: వాస్తవాలు-కట్టుకథలు
బడా పెట్టుబడిదారుల కోసమే వ్యవసాయ చట్ట సవరణలు
హరప్పా ప్రజలే భారతీయుల మూలవాసులు
కమ్యూనిస్టు ఉద్యమం: మహిళల్లో వర్గ చైతన్యం
తెలంగాణ సాయుధ ప్రజా పోరాటం -2 : పోలీసు చర్యలు

## తెలంగాణ సాయుధ ప్రజా పోరాటం -2

# పోలిసు చర్యలు

పోరాట విరమణ 1948 సెప్టెంబర్ 13న యూనియన్ ప్రభుత్వం 'పోలిసు చర్యలు' ప్రారంభించింది. నిజాం హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయమని బలవంత పెట్టేందుకు, తెలంగాణా రైతాంగ ఉద్యమం విస్తఅతంగా వ్యాపించకుండా ఆపేందుకు సైన్యాన్ని హైదరాబాద్‌కి పంపించింది. ఎక్కడో కొన్ని చోట్ల తప్పితే యూనియన్ సైనాయన్ని నిజాం సైన్యం ఎదిరించ లేదు, లొంగిపోయింది. అయిదు రోజుల్లోగా, అంటే 1948 సెప్టెంబర్18 నాటికి నిజాం తనంతట తానే లొంగి పోయాడు.

ప్రజా సాయుధ దళాలు ఈ 'పోలీసు చర్యలను' అవకాశంగా తీసుకుని రజాకార్లపై పోలిసు కాంపులపై దాడి చేసాయి. వాటిని నాశనం చేసాయి, కొల్లగొట్టాయి, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాయి. రోడ్లపై, పొలాలలోను పారిపోతున్న సైనికులను పట్టుకుని తగిన బుద్ధి చెప్పాయి. శత్రువుల భవనాలను, ఆస్తులను ధ్వంసం చేయడం ఈ ప్రచారంలో ప్రత్యేకత. భూస్వాముల గడులున్న చోటల్లా ప్రజలు వందలలో, వేలల్లో అక్కడికి చేరుకొని వాటిని చుట్టుముట్టారు.

'పోలీసు చర్యలు' కొనసాగుతున్నంతకాలం, భారత సైన్యం, రజాకార్లను, నిజాం సైన్యాన్ని మట్టుపెడుతున్నంతకాలం, పార్టీ ప్రాంతీయ దళాలను, గొరిల్లా దళాలను అందులో జోక్యం చేసుకోవద్దని ఆదేశించింది. రజాకార్లపై నిజాం సైనిక శక్తిపై, స్వతంత్రంగా దాడులు చేసి, వారి కాంపులను ధ్వంసం చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకుని, వాటితో తమ ఆయుధ శక్తిలోని ఆధునిక ఆయుధాల కొరతను పూడ్చుకోవాలని ఆదేశించింది. కొన్ని వారాలు ఆగితే చాలు, భారత సైనిక శక్తి, భూస్వాముల, దేష్ ముఖ్‌ల గ్యాంగులు తెలంగాణా రైతాంగం పట్ల ఎలా ప్రవర్తిస్తారో ప్రజలకు తెలిసిపోతుందని, అప్పుడు ప్రజలలో వారి పట్ల ఉన్న భ్రమలు తొలగిపోతాయని, వాళ్లలో ఏర్పడ్డ ఆశలు అడుగంటుతాయని పార్టీ భావించింది.

భారత సైన్యం అడుగు పెట్టిన వారం రోజులకు పార్టీపై దాడులు మొదల య్యాయి. సైన్యం పార్టీని, గొరిల్లా దళాలను ధ్వంసం చేయను నిశ్చయించుకున్నది. పార్టీ నాయకత్వం, గొరిల్లా సాయుధ సైన్యాన్ని, గొరిల్లా దళాలను ఉపసంహరించుకోవద్దని హెచ్చరిస్తూనే వచ్చింది. ఆయుధాలను విడిచిపెట్ట వద్దని, భారత యూనియన్ సైన్యం, స్థానిక భూస్వాములు దేశముఖ్లు, పొలిసులు వాళ్ళను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తారని హెచ్చరిస్తూ వచ్చింది. కానీ దురదఅష్ట వశాత్తు పార్టీ దళాలలో, రాజకీయ నిర్మాణ బాధ్యులలో ఉన్న వారిలో ఎక్కువ మంది ఇటువంటి దాడులను ఎదుర్కోడానికి సిద్ధంగా లేరు. ఇండియన్ యూనియన్ పట్ల వారికున్న భ్రమలే ఇందుకు ప్రధాన కారణం. భారత సైన్యం ప్రవేశించిన రెండు వారాలకే గ్రామాల నుండి పారిపోయిన భూస్వాములు, దేశ్ ముఖ్లు గ్రామాలకు తిరిగి చేరుకున్నారు. అధికారుల అండదండలతో తాము కోల్పోయిన భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. వారి వద్దనున్న వేలాది కార్యకర్తలతో, జోనల్, ప్రాంతీయ నాయకులను ఖైదు చేయించారు. మిగిలిన దళాలను నిర్దాక్షిణ్యంగా వెంటాడారు, పట్టుబడినవారిని హింసించారు, కాల్చి చంపారు. వందలాది గ్రామాలలో ప్రజలను అరెస్టులు చేయడం, హింసించడం సర్వసాధారణమైంది.


తెలంగాణా సాయుధపోరాటంలో శిక్షణ పొందుతున్న మహిళా దళం

నిజాం దురాగతాలను ఎదిరించి నిలిచిన సాధారణ ముస్లింలపై కూడా దాడులు జరిగాయి. అనేకరకాలుగా, చెప్పుకోలేని విధంగా కూడా హింసించారు. అటువంటి వారికి హిందువులు గ్రామంలోని తమ ఇళ్లలో ఆశ్రయం కల్పించారు. హైదరాబాద్ సంస్థానంలో ప్రజాతంత్ర ఉద్యమం బలహీనంగా ఉన్న ప్రాంతాలలో ముస్లింల పట్ల ఏహ్యత, వారిపై దాడులు విస్తఅతంగా ఉండేవి గాని, ఉద్యమం బలంగా ఉన్న ప్రాంతాలలో – హిందూ ముస్లిం ఐక్యత ఉండేది. అందుకే తెలంగాణ ఉద్యమం సాధించిన విజయాలలో హిందూ ముస్లిం ఐక్యత ఒకటని గర్వంగా చెప్పుకోవచ్చు. సంస్థానాలను పూర్తిగా రద్దు చేసి పక్కనున్న అదే భాష మాట్లాడే ప్రాంతాలలో కలిపి నిజమైన ప్రజాతంత్ర ఫెడరల్ వ్యవస్థ ఏర్పాటు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అంతగా ఇష్టం లేదు. భారత రాజ్యాంగం ఆమోదించబడిన 1950 జనవరి 26న, నిజాంని రాజ ప్రముఖుడిగానే ప్రకటించడం జరిగింది. నిజాం పాలనలోని అధికారులెవరూ వారు జరిపిన అరాచకాలకు శిక్షించబడ లేదు. పైగా పోరాట యోధులపై తప్పుడు కేసులు బనాయించి శిక్షలు వేశారు. కొందరికయితే ఉరి శిక్ష కూడా పడింది. చాలామంది కామ్రేడ్స్‌ని జైళ్ళ నుండి బయటికి తీసుకొచ్చి అడవులలోకి, గుట్టలలోకి తీసుకెళ్లి కాల్చి చంపారు. భారత ప్రభుత్వం, నూతన రాజ్యాంగం అమలులోకి రాక మునుపే పోరాట యోధుల శిక్షలు అమలు చేయాలనే అత్యుత్సాహాన్ని ప్రదర్శించి, వెను వెంటనే రహస్యంగా ఉరి శిక్షలు అమలుచేసింది. ఇలా 12 మంది యోధులు హతులయ్యారు. పాల్ రోబ్సన్ లాంటి ఎంతో మంచి పేరెన్నికగన్నవారు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజాతంత్ర సంస్థలు ఇటువంటి శిక్షలను ఖండించాయి. తెలంగాణ యోధుల రక్షణ కమిటీ ఏర్పాటు చేయబడింది. ఇటువంటి నిరసనలు, ఖండనలు ప్రభుతాన్ని మరణ శిక్షలను ఎవజ్జీవ కారాగార శిక్షగా మార్చేట్టు చేసాయి.

**ఈ దశలో పార్టీ ఎదుర్కొన్న కొన్ని సమస్యలు:** భారత యూనిన్‌కి వ్యతిరేకంగా, రైతులు పొందిన భూములను కాపాడుకోడానికి, ప్రజాతంత్ర ప్రయోజనాలు కాపాడుకోడానికి, గొరిల్లా ప్రతిఘటన కొనసాగించాలా వద్దా, కాంగ్రెస్ ప్రభుత్వ సైన్యానికి ఆయుధాలను అప్పచెప్పాలా లేక తెలంగాణా ప్రజలు వీరోచితంగా పోరాడి, పార్టీ పై పెట్టుకున్న

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. తెలంగాణ సాయుధ ప్రజా పోరాటం -2 : పోలీసు చర్యలు .................... 2

2. జాతీయోద్యమం, దేశాభివృద్ధిలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర
బివి రాఘవులు .......... 4

3. మోడి విధానాలకు వ్యతిరేకంగా నవంబరు 26న సార్వత్రిక సమ్మె
సిహెచ్ నర్సింగరావు .... 10

4. హత్రాస్ ఘటన: వాస్తవాలు-కట్టుకథలు
జె జగదీష్ ............... 12

5. బడా పెట్టుబడిదారుల కోసమే వ్యవసాయ చట్ట సవరణలు
ప్రీతమ్ సింగ్ ........... 18

6. హరప్పాప్రజలే భారతీయుల మూలవాసులు
ప్రొ. డేవిడ్ రీచ్.......... 22

7. కమ్యూనిస్టు ఉద్యమం: మహిళల్లో వర్గ చైతన్యం
ప్రొ. అర్చనా ప్రసాద్..... 28



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**

**బి.వి. రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్. వీరయ్య**

**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)



**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్:కె.హరికిషోర్:9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# నిరుద్యోగం

ఒక మనిషి మరో మనిషిపై దాడి చేసినప్పుడు గాయాలతో ఆ వ్యక్తి మరణిస్తే దాన్ని మనం మారణకాండ అంటాం, చంపాలనే ఉద్దేశంతోనే గాయపరిచి చంపితే దాన్ని హత్యాకాండ అంటాం, కానీ సమాజమే వేలాది మంది శ్రామికులను నిరుద్యోగులను చేసి చనిపోవడం మినహా మరోమార్గం లేని పరిస్థితి కల్పిస్తే, వేలాది మంది చనిపోతారని తెలిసికూడా అటువంటి పరిస్థితులు కొనసాగడానికి అనుమతిస్తే దాన్ని కూడా హత్యాకాండే అనాలి, అని కామ్రేడ్ ఫ్రెడరిక్ ఏంగెల్స్ నూట డెబ్బయ్యయిదేళ్ల క్రితం ఇంగ్లండ్‌లో కార్మికుల పరిస్థితుల గురించి రాస్తూ పేర్కొన్నాడు. అంటే నిరుద్యోగం అనేది సమాజం చేసే హత్యాకాండ మినహా మరేమీ కాదు. నిరుద్యోగం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించిన ఉత్పత్తి అనీ, పెట్టుబడిదారుల చేతుల్లో ఆధునిక టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ నిరుద్యోగం మరింతగా పెరుగుతుందని మార్క్స్ నిరూపించాడు. ఈ రోజున పెట్టుబడిదారీ ప్రపంచంలో హద్దులు లేకుండా పెరుగుతున్న నిరుద్యోగాన్నీ, నిష్టదారిద్ర్యాన్ని పరిశీలిస్తే ఇదెంత నిజమో అర్థమవుతుంది.

ఆర్థిక మాంద్యం, దానికి తోడు కరోనా మహమ్మారి వల్ల ప్రపంచంలో పనిచేస్తున్న వారిలో సగం మంది ఉద్యోగాలు కోల్పోతారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) అంచనా వేసింది. అసంఘటిత రంగంలో ఇప్పటికే ప్రపంచ వ్యాపితంగా 160 కోట్ల మంది జీవనోపాధి కోల్పోయారని అది తెలిపింది. మొత్తంగా 15.8 కోట్ల నుండి 24.2 కోట్ల ఉద్యోగాలు పోతాయని ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనా వేసింది. వీటిలో 70 శాతం ఆసియా-పసిఫిక్‌లో పోతాయి. ప్రపంచ కార్మికుల ఆదాయాలు 1.2 లక్షల కోట్ల నుండి 1.8 లక్షల కోట్ల డాలర్ల మధ్య పడిపోతాయి. అదే సమయంలో ప్రపంచలోని మహా ధనవంతులు 2020 మార్చి, మే నెలల మధ్య మరింత ధనవంతులైనారు. మార్చి 23 నుండి మే 23 మధ్య ప్రపంచంలోని 25 మంది అత్యధిక ధనవంతుల ఆస్తులు మరో 25,500 కోట్ల డాలర్లు (సుమారు 20 లక్షల కోట్ల రూపాయలు) పెరిగిపోయాయని ఫోర్బ్స్ పత్రిక అంచనా వేసింది. నిరుద్యోగం వల్ల ప్రపంచ వ్యాపితంగా 3.5 నుండి 6 కోట్ల మంది ప్రజలు నిష్టదారిద్ర్యంలోకి దిగజారిపోతారని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

నిరుద్యోగం, దారిద్ర్యం కేవలం కరోనా వల్ల వచ్చినవే కావు. ఇవి పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పత్తులు. నిజానికి కరోనా మహమ్మారిని కూడా నిలువరించి, ప్రజల బ్రతుకులు బాగుచేసే సాధన సంపత్తులు ప్రపంచంలో ఉన్నాయి. అయితే అవి ఎవరి చేతుల్లో ఉంటే వారికే ఉపయోగపడుతున్నాయి. ప్రజల చేతుల్లో ఈ సాధన సంపత్తులు ఉన్న సోషలిస్టు దేశాల్లో అవి ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. అక్కడ కరోనానూ నివారించారు, ఆర్థిక సంక్షోభమూ ప్రజలకు తాకకుండా నిలువరించారు. కానీ పెట్టుబడిదారీ దేశాల్లో ప్రభుత్వాలు కార్పొరేట్, పాలక వర్గాల చేతుల్లో సాధనాలుగా ఉన్నాయి గనుకనే అక్కడ ప్రజలు నిరుద్యోగం, నిష్ట దారిద్ర్యంలో కునారిల్లుతుంటే ఈ కాలంలోనూ కార్పొరేట్లు కోటాను కోట్ల లాభాలు దండుకుంటున్నారు.

ఇదంతా కూడా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నాయకత్వంలోని నయా-ఉదారవాద ప్రపంచీకరణ వైఫల్యాన్ని సూచిస్తున్నదని సిపిఐ(ఎం) 22వ మహాసభ విశ్లేషించింది. నయా-ఉదారవాద ఆర్థిక విధానాలు అనుసరించిన పెట్టుబడిదారీ దేశాలేవీ ఆర్థిక సంక్షోభాన్ని, నిరుద్యోగాన్ని, దారిద్ర్యాన్ని నివారించలేకపోయాయి. నివారించలేవు కూడా. ఈ విధానాలను కూకటి వేళ్లతో పెకిలించి ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలవైపు మళ్లినప్పుడే ప్రజలకు నిరుద్యోగం, దారిద్ర్యం నుండి విముక్తి లభిస్తుంది.


**చందా వివరాలు**


విడిప్రతిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

ఈ మాసం ముఖ్యాంశం

# జాతీయోద్యమం, దేశాభివృద్ధిలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్ బ్యూరో సభ్యులు

**బివి రాఘవులు**

**(భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అక్టోబరు 17న ఆన్‌లైన్ సభలో సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి వి రాఘవులు ఆన్‌లైన్‌లో చేసిన ప్రసంగ పాఠాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం - సంపాదకుడు.)**

కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏడాది కాలంగా దేశవ్యాపితంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. కరోనా వలన ఆన్‌లైన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కార్యక్రమాల ముగింపు సభ జరుపుకుంటున్నాం. 100 సంవత్సరాల చరిత్రను సింహావలోకనం చేసుకుంటే భారత జాతీయోద్యమ అభివృద్ధికి, స్వాతంత్ర్యానంతరం దేశపురోభివృద్ధికి కమ్యూనిస్టులు చేసిన సేవలు గర్వించదగినవని స్పష్టమౌతున్నది. అనేక దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడి విప్లవాలను జయప్రదం చేశాయి. అన్ని దేశాలలోని కార్మికవర్గానికి, శ్రామికులకు రష్యాలో విప్లవం విజయం సాధించటం ఉత్తేజాన్నిచ్చింది. దురదృష్టవశాత్తు 1989లో దెబ్బతిన్నది. 1949లో విప్లవం జయప్రదం చేసుకున్న చైనా మనదేశం లాంటిదే. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన తర్వాత 29 సంవత్సరాల్లో విప్లవాన్ని విజయవంతం చేసుకొని ముందుకు పోతున్నది. 1959లో క్యూబాలో విప్లవం విజయం సాధించింది. అమెరికా పక్కనే ఉండి విప్లవాన్ని కాపాడుకొంటూ ముందుకు సాగుతున్నది. వియత్నాం, ఉత్తరకొరియాలు విప్లవాలను జయప్రదం చేసుకొని అభివృద్ధిని సాధిస్తూ ముందుకుసాగుతున్నాయి.

భారతదేశంలో విప్లవాన్ని జయప్రదం చేయలేకపోయాం. అయినప్పటికీ దేశాభివృద్ధికి కమ్యూనిస్టు పార్టీ చేసిన సేవలు చెరిపి వేయటానికి సాధ్యంకానివి. ఏ పార్టీకి, రాజకీయ శక్తికి తీసిపోని సేవలు కమ్యూనిస్టు పార్టీ చేసింది. కమ్యూనిస్టు ఉద్యమ వారసత్వం యొక్క గొప్పతనాన్ని మనం ఆకళింపు చేసుకొంటే మరింత ద్విగుణీకృతోత్సాహంతో కర్తవ్యాలను సాధించటానికి ముందుకుపోతాం.

**జాతీయోద్యమంలో వివిధ శక్తుల పాత్ర**

1920లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటైంది. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. పార్టీ ఏర్పడినప్పటి నుండి స్వాతంత్ర్య సాధనవరకు ఒకదశ, స్వాతంత్ర్యానంతరం రెండవ దశ. ఈ రెండు దశలలోనూ మనం చేసిన కృషిని మననం చేసుకోవాలి. రెండు దశల్లోనూ గుణాత్మకమైన మార్పులున్నాయి. జాతీయోద్యమంలో సమకాలీన ప్రాధాన్యత కలిగిన నాలుగురకాల రాజకీయ శక్తులు సమాజంలో ఉండటం గమనించవచ్చు. ఈ శక్తులన్నీ 1930వ దశకంలో ప్రధానమైన కృషి చేశాయి. మొదటిది కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ 1885లో ఏర్పడింది. అయితే 1915లో గాంధి దక్షిణాఫ్రికా నుండి వచ్చిన తర్వాత సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించిన తర్వాతే కాంగ్రెస్ నిజమైన రాజకీయశక్తిగా మారింది. మతం ప్రాతిపదికన రాజకీయాలను నిర్వహించే పార్టీలు కూడా అప్పుడే ఏర్పాటైనాయి. 1925లో ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడింది. అంతకుముందే మతం ప్రాతిపదికన హిందువులను సమీకరించటం కోసం హిందుమహాసభ ఏర్పడింది. 1906-07 ప్రాంతంలోనే ముస్లింలీగు కూడా ఏర్పాటైంది. ఈ కాలంలోనే బాబాసాహెబ్ అంబేద్కర్ రంగంలోకి వచ్చాడు. 1924లో బహిష్కృత్ హితకారిణి సభను ఏర్పాటుచేశాడు. మూక్‌నాయక్ పత్రికను ప్రారంభించాడు. 1927లో మహద్ చెరువు పోరాటాన్ని సాగించాడు. ఆ విధంగా మూడో రాజకీయ శక్తిగా బాబాసాహెబ్ అంబేద్కర్ రంగంలోకి వచ్చాడు. ఆ విధంగా ఒకవైపున బ్రిటిష్‌వారి పరిపాలన కొనసాగుతుండగా, మరోవైపున మతోన్మాదులు మత సంస్థలను ఏర్పాటు చేసిరంగంలోకి రావటం, వేరొకవైపున బాబాసాహెబ్ అంబేద్కర్ సామాజిక న్యాయం, అంటరానితనం, కులనిర్మూలన కోసం పోరాటం ప్రారంభించారు. 1920లో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టి దేశాన్ని బ్రిటీష్ వారి నుండి విముక్తి చేయటం కోసం కృషిచేయటం, సోషలిజం సాధించటం లక్ష్యంగా పనిచేసింది. ఈ నాలుగు రాజకీయ శక్తులు బ్రిటీష్ వారిపట్ల ఎటువంటి వైఖరి తీసుకున్నాయనేది పరిశీలించాలి. ఆర్‌ఎస్‌ఎస్ బ్రిటీష్ వారు దేశం నుండి పోవాలని కోరుకోలేదు. దేశంలోని ఉన్న రాజరికాలు, సంస్థానాలు, ఫ్యూడల్ వ్యవస్థ కొనసాగాలని కోరుకున్నది. అది ఏర్పడిన తర్వాత 22 సంవత్సరాలు జాతీయోద్యమం జరిగినా, ఇన్ని సంవత్సరాల స్వాతంత్ర్య పోరాటంలో ఒక్కరోజు కూడా ఆ పార్టీ పాల్గొనలేదు. అనేక ఉద్యమాలు, పోరాటాలు జరిగినా వాటిలో పాల్గొనకుండా దూరంగా ఉన్నది. ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యులుగా, కార్యకర్తలుగా ఉన్నవారు ఆ సంస్థలో చేరకముందు కొందరు ఇతరసంస్థలలో ఉన్నపుడు అడపాదడపా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. అటువంటి వారిలో సావర్కర్ ఒకడు. ఆయన హిందుమహాసభలో చేరకముందు, విప్లవసంస్థలలో ఉన్నపుడు కొన్ని కార్యక్రమాలలో పాల్గొని జైలుపాలయ్యాడు. ఆ తర్వాత మతోన్మాదానికి లొంగిపోయాడు. బ్రిటటిష్‌వారికి లొంగిపోయి, క్షమాభిక్ష పొంది జైలు నుండి విడుదలయాడు.

ఆయన మతోన్మాదిగా మారకముందు చేసిన కొన్ని కార్యక్రమాలను ఆసరాగా చేసుకొని, ఆయన జాతీయోద్యమంలో పాల్గొన్నట్లుగా భ్రమలు కల్పించేందుకు సంఘ్ పరివార్ ఇప్పటికీ ప్రచారం చేస్తున్నది. ఆర్ఎస్ఎస్, దానితో ఉన్న మతోన్మాదశక్తులు జాతీయోద్యమానికి వ్యతిరేకంగా పనిచేశాయి. మతోన్మాదశక్తులు అభివృద్ధి నిరోధక, దేశప్రజలకు వ్యతిరేకమైన పాత్రను నిర్వహించాయి.

### కాంగ్రెస్ పార్టీ

జాతీయోద్యమంలో రెండోశక్తిగా ఉన్న భారతజాతీయ కాంగ్రెస్ గాంధీజీ నాయకత్వంలో ప్రధానశక్తిగా ముందుకొచ్చింది. అంతకు ముందువరకు మేధావులు, మధ్యతరగతి ప్రజల ప్రతినిధిగా ఉండి, బ్రిటీష్ వారిని బ్రతిమిలాడుకోవటం, విజ్ఞప్తులు చేసేశక్తిగా ఉన్న కాంగ్రెస్‌ను ఉద్యమశక్తిగా, ప్రజలకు దగ్గరగా చేర్చటంలో గాంధి ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు. జాతీయోద్యమకాలంలో సహాయ నిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా, అస్పృశ్యత నివారణ ఉద్యమం తదితర అనేక ఉద్యమాలను కాంగ్రెస్ చేపట్టింది. వాటికి గాంధిజీ నాయకత్వం వహించాడు. ఆ విధంగా జాతీయోద్యమాన్ని విస్తృత ప్రజా ఉద్యమంగా చేయటంలో గాంధి నాయకత్వంలో భారత జాతీయ కాంగ్రెస్ ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. స్వాతంత్ర్యం సాధించటంలో కీలకభూమిక నిర్వహించింది.

ఒకవైపున జాతీయోద్యమంలో నిర్మాణాత్మకమైన, అభ్యుదయ పాత్ర నిర్వహించినా భారత సమాజానికి హానికరమైన, నష్టకరమైన విధానాలను కూడా కాంగ్రెస్ అనుసరించింది. ఫ్యూడల్ శక్తులతో రాజీపడింది. జమిందారీ వ్యవస్థను ముట్టుకోకుండా, సంస్థానాధీశులు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేయకుండా రైతులను, ప్రజలను దూరంగా ఉంచటానికి ప్రయత్నించింది. సంస్థానాలను విచ్ఛిన్నం చేయటానికి జరుగుతున్న ప్రజాపోరాటాలను నిరుత్సాహపరిచింది. మతోన్మాదశక్తులతో కరకుగా, నిశితంగా వ్యవహరించి వారిని విచ్ఛిన్నం చేయటానికి ప్రయత్నించలేదు. వారితో దృఢంగా వ్యవహరించటం కాకుండా వారిని బుజ్జగించటానికి, రాజీపడి వారిని కాంగ్రెస్‌లో భాగంగా చేసుకోవటానికి ప్రయత్నించింది. సామాజిక న్యాయం విషయంలో కూడా కులవ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని కాంగ్రెస్ అనుకోలేదు. దానిలో మరీ అమానవీయంగా, దుర్మార్గంగా ఉన్న కొన్ని లక్షణాలను సంస్కరించాలని ప్రయత్నించింది.

**“ ఒకవైపున జాతీయోద్యమంలో నిర్మాణాత్మ కమైన, అభ్యుదయ పాత్ర నిర్వహించినా భారత సమాజానికి హానికరమైన, నష్టకరమైన విధానాలను కూడా కాంగ్రెస్ అనుసరించింది. ఫ్యూడల్ శక్తులతో రాజీపడింది. జమిందారీ వ్యవస్థను ముట్టుకోకుండా, సంస్థానాధీశులు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేయకుండా రైతులను, ప్రజలను దూరంగా ఉంచటానికి ప్రయత్నించింది. ”**



బిఆర్ అంబేద్కర్

చాతుర్వర్ణ వ్యవస్థ మంచిదని, వృత్తి విభజనను కొనసాగించాలని భావించింది. భారతదేశంలో ఫ్యూడల్ వ్యవస్థకు పట్టుగొమ్మగా ఉన్న కులవ్యవస్థను సంపూర్ణంగా నిర్మూలించాలనే దృక్పథంతో వ్యవహరించలేదు. ఉద్యమంలోకి ప్రజలను సమీకరించి బ్రిటీష్ వారిని తరిమేయాలనే దానికన్నా ఉద్యమాలలోకి ప్రజలను సమీకరించటం, ప్రజల సమరశీలత ఒక హద్దు దాటకుండా ఆ ఉద్యమాలపై నీరుచల్లే విధంగా వ్యవహరించింది. దేశం నుండి బ్రిటీష్ వారిని వెళ్ళగొట్టటంలో ముఖ్యపాత్ర నిర్వహించినా స్వాతంత్ర్యానంతరం పాత సమాజపు అవశేషాలను సంపూర్ణంగా నిర్మూలించకుండా దేశాభివృద్ధి కుంటుపడటానికి కారణమైంది.

### బాబాసాహెబ్ అంబేద్కర్ పాత్ర

మూడవది బాబాసాహెబ్ అంబేద్కర్ అనుసరించిన రాజకీయ వైఖరి. ఆయన బ్రిటీష్ వారిని నేరుగా ఎదుర్కొని, వారిని దేశం నుండి వెళ్ళగొట్టే రాజకీయ కర్తవ్యాన్ని తీసుకోలేదు. స్వాతంత్ర్యం రావటం అవసరమని, బ్రిటీష్ వారు దేశాన్ని దోచుకుంటున్నారని, వారు వెళితే దేశానికి మేలు జరుగుతుందని భావించాడు. కాని వారు వెళ్ళి అగ్రవర్ణాలు అధికారంలోకి వస్తే ఏ మేలూ జరగదని కూడా భావించాడు. కాబట్టి బ్రిటీష్ వారితో సహకరిస్తూ, వత్తిళ్ళు తెస్తూ తమ కోర్కెలు పరిష్కరించుకోవాలని భావించాడు. బ్రిటీష్‌వారి సహకారం తీసుకొని కులవ్యవస్థను పరిష్కరించవచ్చని ఆయన భావించాడు. అందుకోసం ప్రత్యేక నియోజక వర్గాలు, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం తదితర రాయితీలపై ఆయన కేంద్రీకరించాడు. గాంధీకి, ఆయనకు విభేధాలు వచ్చినపుడు పూనా ఒప్పందం ద్వారా షెడ్యూల్డ్ కాస్ట్స్ నియోజకవర్గాలను పెంచుకోవటానికి ప్రయత్నం చేశాడు. ఆయన అనుసరించిన వైఖరి చాలా మందిని నిరుత్సాహపరిచింది. ఆయన స్వాతంత్ర్యాభిలాష ఎవరూ విమర్శించటానికి వీలులేనిది. కాని ఆయన వ్యవహరించిన తీరును అనేకమంది విమర్శించారు. కొన్ని సందర్భాలలో కమ్యూనిస్టులకు ఆయనకు మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. సామాజిక సమస్యలు , కులవ్యవస్థను నాశనం చేయటం గురించి బాబా సాహెబ్ అంబేద్కర్ అందరికన్నా రాడికల్‌గా ఆలోచించించాడు. కమ్యూనిస్టులు ఎంత రాడికల్‌గా ఆలోచించారో అంబేద్కర్ కూడా అదే విధంగా ఆలోచించాడు. కులవ్యవస్థ ఉన్నంత కాలం సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, సమానత్వం రాదని అంబేద్కర్ భావించాడు. ఆఖరికి భారత రాజ్యాంగం తయారైన తర్వాత కూడా కులవ్యవస్థ ఈ విధంగా ఉన్నంతకాలం రాజ్యాంగం నిరుపయోగంగా ఉంటుందని విమర్శించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కాబట్టి కులవ్యవస్థ, దాని నిర్మూలన గురించిన ఏకైకదృష్టితో చాలా ఆధునికంగా, రాడికల్‌గా ఆలోచించాడు. దానినే ప్రధానంగా తీసుకొని కులవ్యవస్థను కూకటివేళ్ళతో పెళ్ళగించాలని భావించాడు. దురదృష్టవశాత్తు కుల నిర్మూలన గురించి ఎంతతీవ్రంగా ఆలోచించినా, దాని పరిష్కారం విషయానికి వచ్చేసరికి ఆయన సూచించిన పరిష్కారాలు సంస్కరణవాద దృక్పథంతో ఉన్నాయి. కులవ్యవస్థను సంపూర్ణంగా నిర్మూలించాలనే దృక్పధం ఆయనకు ఉన్నప్పటికీ సూచించిన పరిష్కారాలు మూలాల

> **"దేశానికి స్వాతంత్ర్యం కావాలని మొదట పిలుపునిచ్చింది కమ్యూనిస్టులే. ఏడాదికోసారి జరిపే కాంగ్రెస్ మహాసభల్లో కమ్యూనిస్టులు పాల్గొని సంపూర్ణ స్వరాజ్యం కావాలని పిలుపునిచ్చేవారు. 1921, 22 ల్లోనే కాంగ్రెస్ మహాసభల్లో సంపూర్ణ స్వరాజ్యం కోసం కమ్యూనిస్టులు పిలుపునిచ్చారు. కాని కాంగ్రెస్ తిరస్కరించింది. కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చిన ఎనిమిది సంవత్సరాల తర్వాత 1929 లో జరిగిన మహాసభలోనే మాత్రమే కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్య సాధన లక్ష్యమని ప్రకటిం చింది."**



మీరట్ కుట్రకేసు నిందుతులైన కమ్యూనిస్టు యోధులు: జైలు బయట తీసిన ఫోటో

లోకి పోలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా రిజర్వేషన్లు, రాజకీయ పదవులు, ప్రాతినిధ్యాలు సరైన పరిష్కారాలు కావని, పరిమితమని ఆయనకు తెలుసు. కాని కుల నిర్మూలనకు పరిష్కారం ఏమిటన్నది వచ్చినపుడు అందుకు సరైన పరిష్కారాన్ని ఆయన సూచించలేకపోయాడు. ఫ్యూడల్ వ్యవస్థ, భూకేంద్రీకరణను బద్దలు కొట్టటం అనే పరిష్కారాలు ఆయన దృష్టిలో ఉన్నప్పటికీ అంతిమంగా ఆయన ఎంచుకున్న పరిష్కారం బౌద్ధమతంలోకి మారటంగా భావించాడు. ఆయన చనిపోయిన ఇన్నిరోజుల తర్వాత చూసినపుడు ఆయన మార్గం కులనిర్మూలనకు తోడ్పడలేదు. మారిన మతంలోకి కూడా కులవ్యవస్థ చొచ్చుకొచ్చింది. అయినప్పటికి కులనిర్మూలన కావాలనే భావాలను ముందుపెట్టిన రాడికల్ ఆలోచనా పరునిగానే ఆయనను మనం చూడాలి.

### కమ్యూనిస్టులు

నాలుగో రాజకీయ ధోరణి కమ్యూనిస్టులు. ఈ అన్ని రాజకీయ ధోరణులున్న వారిలోనూ కమ్యూనిస్టులు అత్యధికంగా నిర్బంధాలను ఎదుర్కొన్నారని సగర్వంగా చెప్పుకోవచ్చు. జాతీయోద్యమంలో చాలా రాడికల్ ఆలోచనలను కమ్యూనిస్టులే ముందుకుతెచ్చారు. 1920లో కమ్యూనిస్టుపార్టీ ఏర్పడింది. పట్టణాలలో కార్మికుల సమస్యలపై పనిచేసింది. కమ్యూనిస్టులు చిన్న చిన్న బృందాలుగా ఉన్నప్పటికీ కమ్యూనిస్టుల ప్రమాదాన్ని ముందే గమనించిన బ్రిటిష్‌వారు వారిపై కుట్రకేసులు బనాయించి అరెస్టు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం కావాలని మొదట పిలుపునిచ్చింది కాంగ్రెస్ కాదు. కమ్యూనిస్టులే మొదట ఆ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కన్నా చిన్నశక్తిగా ఉన్నా కమ్యూనిస్టు పార్టీయే సరైన రాజకీయ దృక్పథాన్ని, డైరెక్షన్‌ను ఇచ్చిందని సగర్వంగా చెప్పుకోవచ్చు. సంవత్సరానికి ఒకసారి జరిపే కాంగ్రెస్ మహాసభల్లో కమ్యూనిస్టులు పాల్గొని, ఒక ప్రణాళికను తయారుచేసి పంపిణి చేసేవారు. సంపూర్ణ స్వరాజ్యం కావాలని ఉపన్యాసాలు ఇచ్చేవారు. 1921, 22 ల్లోనే కాంగ్రెస్ మహాసభల్లో సంపూర్ణ స్వరాజ్యం కోసం కమ్యూనిస్టులు పిలుపునిచ్చారు. కాని కాంగ్రెస్ తిరస్కరించింది. మొదట కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చిన ఎనిమిది సంవత్సరాల తర్వాత 1929 లో జరిగిన మహాసభలోనే మాత్రమే కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్య సాధన లక్ష్యమని ప్రకటించింది. జాతీయోద్యమంలో కమ్యూనిస్టు పార్టీ శక్తితో పోల్చుకుంటే కాంగ్రెస్ శక్తి పెద్దది. 1930లో రూపొందించిన కార్యక్రమం, మీరట్ కుట్రకేసు ఖైదీల ప్రకటనలలో మతసామరస్యం, లౌకికవాదం కావాలని కమ్యూనిస్టులే మొదటగా చెప్పారు. మతోన్మాదుల ప్రమాదం గురించి హెచ్చరించింది కూడా కమ్యూనిస్టులే. గ్రామాలలో ఫ్యూడల్ వ్యవస్థను బద్దలు చేయకపోతే ప్రజల ఐక్యత సాధించటం, మతసామరస్యాన్ని కాపాడటం సాధ్యం కాదనిచెప్పారు. సైద్ధాంతికంగానూ, ఆలోచనలలోనూ ముందుండటంలోనే కాక ఆచరణలో పోరాటాలలో కూడా అగ్రభాగాన ఉన్నారు. భూస్వామ్య వ్యవస్థను బద్దలు కొట్టటం ద్వారానే కులవ్యవస్థను అంతం చేయగలమని పేర్కొన్నారు. ఆశ్చర్యమేమంటే ఆ రోజుల్లోని పార్టీ నివేదికలలో గ్రామాలలో అగ్రకులాలు ఏ విధంగా పెత్తనం చేస్తున్నారో, కులవ్యవస్థ ఏ విధంగా వేళ్ళూనుకున్నదో, దానిని ఏ విధంగా బద్దలు కొట్టాలో కూడా పేర్కొన్నారు. భూస్వామ్య విధానం, కులవ్యవస్థలను బద్దలు కొట్టకుండా స్వాతంత్ర్యం సాధించటం ఏ విధంగా సాధ్యం కాదో వాటిలో పేర్కొన్నారు. జాతీయోద్యమంలో అరెస్టై జైళ్ళలో ఉన్నవారిలో, అండమాన్ జైళ్ళలో ఉన్నవారిలో ఎక్కువమంది కమ్యూనిస్టులు, లేదా కమ్యూనిస్టులకు దగ్గరగా ఉండేవారేనని మనం సగర్వంగా చెప్పుకోవచ్చు. భగత్‌సింగ్, ఇతర విప్లవకారుల అనుయాయులు అనేకమంది జైలులో కమ్యూనిస్టు పార్టీ అనుయాయులుగా మారారు. వేలమంది కమ్యూనిస్టులు ప్రాణ త్యాగం చేశారు. జాతీయోద్యమంలో ప్రాణ త్యాగం చేసినవారిలో అత్యధికులు కమ్యూనిస్టులు. త్యాగాలతో ఉద్యమానికి సమరశీల స్వభావం ఇచ్చింది కమ్యూనిస్టులే. 1920కి ముందు జాతీయోద్యమానికి ప్రజాపునాది లేదు. ప్రజాపునాదిని కల్పించటంలో గాంధి, గాంధి కన్నా కూడా మించి కమ్యూనిస్టుల కృషి ప్రధానమైనది. జాతీయోద్యమానికి, తమ బతుకులకు సంబంధం లేదని దూరంగా ఉన్న రైతాంగానికి వ్యవసాయ విప్లవానికి, తమ బతుకులకు ఉన్న సంబంధాన్ని వివరించి, వారిని ఉద్యమంలో భాగస్వాములుగా చేశారు. ఉద్యమంలోకి వచ్చిన రైతులు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడితేనే తమను దోచుకుంటున్న ఫ్యూడల్ భ్యూస్వాములను ఓడించవచ్చునని అర్థం చేసుకున్నారు.

తెలుగు ప్రజలకు ఒక విషయం గుర్తుచేయాలి. 1937లో ఆంధ్రరాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన రైతుయాత్ర జరిగింది. వందల గ్రామాలలో వేలాది కిలో మీటర్ల దూరం యాత్రసాగింది. వేలసంఖ్యలో పిటీషన్లు తీసుకున్నారు. లక్షల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అదేకాలంలో దేశంలోని అనేక ప్రాంతాలలో జమీందారీ వ్యతిరేక పోరాటాలు జరిగాయి. ఫ్యూడల్ సంస్థానాలలో పోరాటాలు నిర్వహించారు. 1940వ దశకంలో తెభాగా,

వీర తెలంగాణా విప్లవ పోరాటం, పున్నప్రా వాయలార్, వర్లి, పంజాబ్, అస్సాం తదితర ప్రాంతాలలో పోరాటాలు నిర్వహించింది. విద్యార్థి సంఘాన్ని ఏర్పాటు చేసి వారిని సమీకరించింది. ఈ విధమైన ప్రజాసమీకరణలో భాగంగా సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించటం, ప్రజా కళాకారుల సంఘం ఇప్టా, అభ్యుదయ రచయితల సంఘం తదితరాలను ఏర్పాటు చేసింది. ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాన్ని నిర్మించటంలో కూడా కమ్యూనిస్టులు ప్రధాన పాత్ర నిర్వహించారు. జాతీయోద్యమాన్ని ప్రజలు స్వంతం చేసుకోవటానికి, అది ప్రజా ఉద్యమంగా మారటానికి ఇవన్నీ దోహదం చేశాయి. ఈ విధంగా జరిగిన ప్రజా పోరాటాలు, ఇతరంగా జరిగిన ఉద్యమాలు బ్రిటిష్ వారిని దేశం నుండి పంపివేయటంలో ప్రధాన పాత్ర వహించాయి. వీటన్నింటినీ చూసినపుడు సామాన్యప్రజలను బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటాలలోకి తీసుకురావటంలో కమ్యూనిస్టు పార్టీ ముఖ్యపాత్ర నిర్వహించిందని స్పష్టమౌ తున్నది.

"ఆంధ్రప్రదేశ్‌లో సంస్కరణ ఉద్యమాలు ఉవ్వెత్తున జరిగాయి. సహపంక్తి భోజనాలు, కులాంతర వివాహాలు, కులంతో సంబంధం లేకుండా కుటుంబాల మధ్య సంబంధాలు, రాత్రిబడులు, గ్రంథాలయాలు, దళితుల విద్య తదితరాలపై కేంద్రీకరించింది. ఏ విధంగా చూసినా ఈ 27 సంవత్సరాలు కమ్యూనిస్టు పార్టికి గొప్ప చరిత్రను ఇచ్చింది."


తెలంగాణా సాయుధ పోరాటంలో శిక్షణ పొందుతున్న రైతాంగ గెరిల్లాలు

కులవ్యవస్థకు వ్యతిరేకంగా మొదట్లో అంబేద్కర్ ఒకటి, రెండు పోరాటాలు చేసినప్పటికీ 1927లో మహద్ చెరువు పోరాటం తర్వాత పోరాటమార్గాన్ని వదిలివేశాడు. రాజ్యాంగబద్ధ, చట్టబద్ధమైన పోరాటాలు, బ్రిటిష్ ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేయటం, చర్చలు, వాదవివాదాలు తదితరాల ద్వారా కోర్కెలను పరిష్కరించుకోవటానికి పరిమితమైనాడు. ఎక్కడైనా ఆయన అనుయాయులు పోరాటాలు చేస్తుంటే మద్దతు తెలిపాడు మినహా ఆయనగా పోరాటాలకు పిలుపు ఇవ్వలేదు. కాని కమ్యూనిస్టులు ఆనాటి నుండి ఈనాటి వరకు కులవ్యవస్థకు వ్యతిరేకంగా, మహిళల సమస్యలు, పురుషాధిక్యతకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. గిరిజనులు, ఆదివాసులపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా సమరశీలంగా సామాజిక ఉద్యమాలు నిర్వహించారు. ఇంతకుముందు చెప్పినట్లుగా 30, 40 దశకాలలో చేసిన తీర్మానాలను చూసినపుడు సామాజిక సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ ఎంత స్పష్టమైన దృక్పథంతో ఉన్నదో స్పష్టమౌతుంది.

1940 దశకంలో దేశవ్యాపితంగా ఉవ్వెత్తున సంఘ సంస్కరణ ఉద్యమాలు జరిగాయి. కులవ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు, పోరాటాలు జరిగాయి. చెరువులు, బావుల్లో నీరు తోడుకోవటం, చెప్పులు, బట్టలు వేసుకొని అగ్రకులాల ముందు తిరగటం, పెళ్ళి ఊరేగింపుల కోసం, రెండుగ్లాసుల విధానానికి వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగాయి. 1931–32 సంవత్సరాలకు ముందు కేరళలోని గురువాయూరు దేవాలయంలోకి దళితులు, వెనుకబడిన తరగతులను రానిచ్చేవారు కాదు. దానికి వ్యతిరేకంగా ఎ కె గోపాలన్, క్రిష్ణపిళ్ళై, కేలప్పన్, దామోదరన్ లాంటివారి ఆధ్వర్యాన ఉద్యమాలు జరిగాయి. ఫలితంగా 1936లో కేరళలోని అన్ని దేవాలయాలలోకి దళితులు, వెనుకబడిన తరగతుల వారికి ప్రవేశం లభించింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇటువంటివి అనేక ప్రాంతాలలో జరిగాయి.

ఆంధ్రప్రదేశ్‌లో సంస్కరణ ఉద్యమాలు ఉవ్వెత్తున జరిగాయి. సహపంక్తి భోజనాలు, కులాంతర వివాహాలు, కులంతో సంబంధం లేకుండా కుటుంబాల మధ్య సంబంధాలు, రాత్రిబడులు, గ్రంథాలయాలు, దళితుల విద్య తదితరాలపై కేంద్రీకరించింది. ఏ విధంగా చూసినా ఈ 27 సంవత్సరాలు కమ్యూనిస్టు పార్టికి గొప్ప చరిత్రను ఇచ్చింది. 1952 ఎన్నికలలో ఉద్యమాలు నిర్వహించిన ప్రాంతాలలో కాంగ్రెస్, జాతీయోద్యమంలో పాల్గొన్న ఇతరులను పక్కన పెట్టి ప్రజలు కమ్యూనిస్టులను గెలిపించారు. ఈ పోరాటాలను ఎవరూ చెరిపివేయటం సాధ్యం కాదు. ఇపుడు వీటిని చెరిపివేయాలని బిజెపి ప్రయత్నం చేస్తున్నది. కేరళలో జరిగిన మోప్లా తిరుగుబాటును, అండమాన్ జైలులో ఉన్నవారిని గురించిన చరిత్రను తుడిచివేయాలని చూస్తునారు. ఎందుకంటే అది వారికి చీకటి చరిత్ర. కమ్యూనిస్టుల చరిత్రను కప్పిపెడితే పోయేది కాదు. కప్పెట్టాలని చూసినకొద్దీ చీకట్లను చీలుకొంటూ మరింతగా వెలుగులను విరజిమ్ముతూ బయటికొస్తూనే ఉంటుంది.

### స్వాతంత్ర్యనంతర పోరాటాలు

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 73 సంవత్సరాల పాటు నూతన పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీ పని చేయాల్సివచ్చింది. దీనికి అనుగుణంగా మార్పులు చేసుకోవటానికి ప్రయత్నం చేసింది. ఇది అంత సులభంగా జరగలేదు. గతంలో బ్రిటిష్‌వారు కమ్యూనిస్టులపై నిర్బంధం, హత్యలు అణచివేత కొనసాగించారు. కమ్యూనిస్టు వ్యతిరేకత, అణచివేయటంలో నూతన పాలకులు వారికి ఏ మాత్రం తీసిపోలేదు. నూతన పాలకులు కూడా పార్టీపై అణచివేత, హత్యలు కొనసాగించారు. దీనితో పాటు అంతర్గతంగా కూడా పార్టీలో విభేధాలు

> **" భారతదేశం ఐక్యంగా ఉండటానికి భాషాప్రయుక్తరాష్ట్రాల ఏర్పాటు, ఫెడరల్ విధానాన్ని అమలుచేయటం ప్రధానకారణం. దీనిని అమలుచేయటానికి మొదట అంగీకరించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వెనక్కుపోయింది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం కమ్యూనిస్టు పార్టి పోరాటాలు నిర్వహించింది. కమ్యూనిస్టులు ముందుండి నిర్వహించిన పోరాటాల వలన ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితులలో భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేసింది. "**

వచ్చాయి. అయినప్పటికీ ఈ కాలంలో కూడా పార్టి చాలా పోరాటాలు సాగిం చింది.

మొదటిది. భారతదేశం ఒకపెద్ద ఉపఖండంగా ఉంది. స్వాతంత్ర్యానంతరం ఇంత పెద్దదేశం ఒకటిగా ఉంటుందా, ముక్కలైపోతుందా అని చాలామంది సందేహించారు. మనదేశంలో ఒక చిన్నరాష్ట్రం అంతకూడా లేని దేశాలు కూడా ఇపుడు ముక్కలైపోతున్నాయి. భారతదేశం ఐక్యంగా ఉండటానికి భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, ఫెడరల్ విధానాన్ని అమలుచేయటం ప్రధానకారణం. దీనిని అమలుచేయటానికి మొదట అంగీకరించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వెనక్కుపోయింది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం కమ్యూనిస్టు పార్టి పోరాటాలు నిర్వహించింది. కమ్యూనిస్టులు ముందుండి నిర్వహించిన పోరాటాల వలన ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితులలో భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేసింది.

రెండవది, భారతదేశం ఆధునిక దేశంగా అభివృద్ధి కావాలంటే ఫ్యూడల్ వ్యవస్థను బద్దలు చేయాలి. భూపంపకం చేయాలి. దున్నేవానికే భూమిని ఇవ్వాలి. ఈ నాలుగుశక్తులలో కమ్యూనిస్టులు మాత్రమే ఈ మాట చెప్పారు. చెప్పటమే కాక అందుకోసం పోరాటాలు నిర్వహించారు. 1957లో కేరళలో కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. 1967 లో బెంగాల్‌లో ఐక్యసంఘటన ప్రభుత్వం ఏర్పడింది. తర్వాత 1978లో బెంగాల్‌లో పార్టి నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడి 35 సంవత్స రాలు అధికారంలో ఉంది. త్రిపురలో రెండు సార్లుగా 30 సంవత్సరాల పాటు అధికారంలో ఉంది. కేరళలో ప్రతి ఐదు సంవత్సరాలకు అధికారంలోకి వస్తున్నది. ఈ మూడు రాష్ట్రాల లోని ప్రభుత్వాలు భూసంబంధాలను సమూ లంగా మార్చటం, పేదలు, దళితులకు భూములు, ఇళ్లస్థలాలు, ఇళ్ళు ఇచ్చాయి. దేశంలో అనేకప్రాంతాలలో ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్, బిజెపి తదితర పార్టీలు అధికారంలోకి వచ్చాయి. కాని ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి చర్యలు తీసుకోలేదు. అయితే ఈ చర్యల వలన అక్కడ భూస్వామ్య విధానం, కులవ్యవస్థ అంతమైపోయాయని కాదు. కొంతవరకు బలహీనమయ్యాయి. అంతకుమించి వాటిని ప్రశ్నించగల శక్తి ప్రజలకు వచ్చింది.

ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వం భావాలను రాజ్యాంగంలో చేర్చిన బూర్జువావర్గం ఇపుడు వాటిని రద్దుచేయటానికి ప్రయత్ని స్తున్నది. అటువంటపుడు ఉన్నవాటిని రక్షించు కోవటానికి పోరాటాలు చేస్తూ, అదనపు ప్రజాస్వామిక హక్కులను సాధించుకోవాలని పోరాటాలు చేస్తున్నాం. 1959లో కేరళలో ప్రభుత్వాన్ని రద్దుచేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనిచేస్తూ 1975లో ఇందిరాగాంధి విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకపోరాటం చేశాం. బెంగాల్‌లో అర్ధఫాసిస్టు నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాటం చేశాం. బెంగాల్‌లో 1400 మందిని, త్రిపుర, కేరళలో వందలాది మందిని హత్య చేశారు. ఇపుడు ప్రశ్నించేవారిని దేశద్రోహు లుగా ముద్రవేసి జైళ్ళలో పెడుతున్నారు.

అంబేద్కర్ కుల వ్యవస్థ నిర్మూలనకు విస్తృతంగా ప్రచారం చేశారు. దానికి మతం మార్పిడి మినహా మార్గం లేదని చెప్పారు. ఈరోజు అంబేద్కర్ అనుయాయులమని చెప్పుకొనేవారిలో కొద్దిమంది మినహా మిగతా వారు ఆయన వారసత్వాన్ని పూర్తిగా వదిలివేశారు. అంబేద్కర్ ప్రదర్శించిన రాడికలిజాన్ని కూడా వదిలివేశారు. కుల నిర్మూలనను వదిలివేసి, మతశక్తులు, బూర్జువాశక్తులతో కలిసి వ్యవహరిస్తూ, తమకు కొన్ని మెరుగైన సౌకర్యాలు, రిజర్వేషన్లు, ప్రాతినిధ్యాలు, రాజకీయ ప్రయోజనాలు సాధించుకొంటేచాలని భావిస్తున్నారు.

సమాజంలో సంపూర్ణ మార్పుకోసం ప్రయత్నం చేస్తున్నది కమ్యూనిస్టులే. దళితులపై దాడులు, అత్యాచారాలు, ఇతర ఘటనలు జరిగినపుడు స్పందించేవారిలో ఇతరులు కూడా ఉండవచ్చు. కాని కమ్యూనిస్టులు స్పందించటమే కాకుండా ప్రజలు సంఘటితమై తమ హక్కులను సాధించుకొనే విధంగా, కులాన్ని ధ్వంసం చేసే విధంగా కృషిచేస్తున్నారు. అంబేద్కర్ అనుయాయులు అది మా మార్గం కాదని చెబుతున్నారు. ఇపుడు తమిళనాడు, కర్నాటక, ఆంధ్ర, తెలంగాణా, హిందిరాష్ట్రాలు తదితర ప్రాంతాలలో పోరాటాలు జరుగు తున్నాయి. దళితనాయకులు ఇది మా పద్ధతి కాదనను కోవటం దురదృష్టకరం.

సామాజిక న్యాయం సమస్యకు ఫ్యూడల్ వ్యవస్థ విధ్వంసంతో పాటు పెట్టుబడిదారీ విధానాన్ని కూడా రద్దుచేయటం మినహా చిట్కాలతో పరిష్కారం కాదు. ఇతర మార్గాలన్నీ పరీక్షించాం. అవి విఫలమైనాయి. ఇక పరీక్షించా ల్సింది కమ్యూనిస్టుల విధానాన్నే. ఫ్యూడల్ అవశేషాలను, పెట్టుబడిదారీ విధానాలను బద్దలు చేసి, సంపదను ప్రజల చేతుల్లో పెడితే అపుడు కులవ్యవస్థకున్న పునాది ధ్వంసం అవుతుంది. కులవ్యవస్థను మనసుల్లో నుంచి తొలగించటానికి భూమిక ఏర్పడుతుంది. అపుడు సంఘ సంస్కరణోద్యమాలు, సాంస్కృతి

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్ధిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

కోద్యమాలు చేస్తే మనసుల్లో నుంచి కూడా కులాన్ని తొలగించటానికి వీలవు తుంది. ఇవి చేయకుండా కులవ్యవస్థను తొలగించటానికి ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ అది సాధ్యం కాదు.

బ్రిటిష్ వారు మతాల మధ్య చిచ్చుపెట్టి తమ అధికారాన్ని కొనసాగించుకోవటానికి ప్రయత్నం చేశారు. దేశాన్ని విడగొట్టారు. అయినా తమ పాలనను కొనసాగించుకోలేక పోయారు. తర్వాత వచ్చిన పాలకులు కూడా మత సామరస్యాన్ని కాపాడలేకపోయారు. అందుకు వారు అనుసరించిన లోపభూయిష్ట మైన విధానమే కారణం. అన్ని మతాలకు సమానమైన అవకాశాలని పాలకులు చెప్పి, అదే లౌకికవాదమని చెప్పారు. అన్ని మతాలకు సమాన అవకాశాలంటే పెద్ద మతానికి ఎక్కువ అవకాశాలు, చిన్న మతాలకు తక్కువ అవకాశాలు ఉంటాయి. మైనారిటీ మతాలకు రక్షణ అన్నది దానిలో లేదు. కమ్యూనిస్టులు మొదటి నుండి లౌకికవాదం అంటే రాజ్యం, రాజకీయాలు మతాలకు, మతజోక్యానికి వ్యతిరేకంగా ఉండాలని ప్రచారం చేశారు. అటువంటి లౌకికవాదం మాత్రమే మతసామ రస్యాన్ని, మైనారిటీలను కాపాడగలుగుతుంది.

పాలకవర్గాలు ప్రజలను చీల్చి తమ ప్రయోజనాల కోసం వినియోగించుకొంటున్నారు. అందువలననే జాతీయోద్యమంతో సంబంధంలేని మతోన్మాదులకు ఆ తర్వాత కూడా నాలుగు దశాబ్దాల పాటు ప్రజల ఆదరరణ లభించలేదు. ఇపుడు బూర్జువా పార్టీలు, ప్రాంతీయపార్టీలు మతోన్మాదానికి లొంగిపోయి వ్యవహరిస్తున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో తెలుగుదేశం పార్టి బిజెపికి మత కార్యక్రమాలకు మద్దతుగా ప్రచారం చేస్తున్నది. జనసేన గువేరా చొక్కాలతో తిరిగి ఇపుడు బిజెపికి లొంగిపోయింది. తమది లౌకికపార్టి అని, మైనారిటీలకు రక్షణ కల్పిస్తామని ప్రచారం చేసుకున్న వైసిపి కూడా బిజెపికి లొంగి వ్యవహరిస్తున్నది. అందువలన లౌకికవాదాన్ని కాపాడుకోవలసిన కర్తవ్యం కూడా మనపైనే ఉన్నది.

దానితో పాటు శాస్త్రీయ పరిజ్ఞానంలో భారతదేశం ఇతర దేశాల కన్నా ముందుండాలని కోరుకున్నాం. ప్రస్తుత పాలకులు శాస్త్రీయాభివృద్ధిని వెనక్కునెడుతున్నారు. మూఢ నమ్మకాలను, అశాస్త్రీయ భావాలను ప్రోత్సహిస్తున్నారు. కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోవటానికి అన్ని దేశాలు మందులను కనిపెట్టటం కోసం ప్రయత్నం చేస్తుంటే సంఘ్ పరివార్ మాత్రం, పేడలను వాడమని, మంత్రాలను జపించమని అశాస్త్రీయ ప్రచారం చేస్తున్నది. ఈ విధమైన మూఢభావాలను ప్రచారం చేయడాన్ని కూడా ఖండించలేని స్థితిలో చాలా మంది ఉన్నారు. అందువలన శాస్త్రీయ దృక్పధాన్ని కాపాడుకోవలసిన బాధ్యత కూడా కమ్యూనిస్టులపైనే ఉంది.

> **“ సంఘ్ పరివార్‌ను ఎదుర్కోవటంలో కమ్యూనిస్టులు ముందున్నారు కాబట్టి వారిని నాశనం చేయటానికి సంఘ్ పరివార్, పెట్టుబడిదారులు పూనుకున్నారు. బెంగాల్, త్రిపురలలో పార్టీని ఓడించారు. కేరళలో కాంగ్రెస్, బిజెపితో కలిసి అక్కడి వామపక్ష ప్రభుత్వం, పార్టిపై దాడులు చేస్తున్నది. హిట్లర్, ముస్సోలినీలు ఏర్పాటు చేసిన ఫాసిస్టు ప్రభుత్వాల మొదటి లక్ష్యం కమ్యూనిస్టులను నాశనం చేయటం, కాని ఆ శక్తులనే కమ్యూనిస్టులు తుదముట్టించారు. ”**



సిపిఐ(ఎం) ర్యాలీ

**కమ్యూనిస్టులను నాశనం చేయటమే సంఘ్ పరివార్ లక్ష్యం**

సంఘ్ పరివార్‌ను ఎదుర్కోవటంలో కమ్యూనిస్టులు ముందున్నారు కాబట్టి వారిని నాశనం చేయటానికి సంఘ్ పరివార్, పెట్టుబడిదారులు పూనుకున్నారు. బెంగాల్, త్రిపురలలో పార్టిని ఓడించారు. కేరళలో కోవిడ్‌ను అరికట్టటంలో, ప్రజల సంక్షేమాన్ని కాపాడటంలో అక్కడి ప్రభుత్వం జయప్రద మైంది. కాంగ్రెస్, బిజెపితో కలిసి అక్కడి వామపక్ష ప్రభుత్వం, పార్టిపై దాడులు చేస్తున్నది. హిట్లర్, ముస్సోలినీలు ఏర్పాటు చేసిన ఫాసిస్టు ప్రభుత్వాల మొదటి లక్ష్యం కమ్యూనిస్టులను నాశనం చేయటం, కాని ఆ శక్తులనే కమ్యూనిస్టులు తుదముట్టించారు. కార్మికహక్కులకు, ప్రజల సంక్షేమానికి కృషిచేస్తున్న సోవియట్ యూనియన్‌ను నాశనం చేస్తే పెట్టుబడిదారీ శక్తులకు ఎదురుండదని భావించారు. కాని సోవియట్ యూనియన్‌ను దెబ్బతీసినా పెట్టుబడిదారీ విధానాన్ని సంక్షోభం నుండి కాపాడుకోలేకపోతున్నారు. 2008, తర్వాత 2020లో వచ్చిన సంక్షోభాలు పెట్టుబడిదారీ విధానాన్ని కూకటివేళ్ళతో పూపివేస్తున్నాయి. సోషలిజం మినహా మరో పరిష్కార మార్గం లేదని ప్రజలు ఆలోచించాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నాయి.

ప్రస్తుత లక్ష్యాలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, పౌరహక్కులను కాపాడుకొంటూ, దీర్ఘకాలిక లక్ష్యమైన సోషలిజాన్ని సాధించుకోవటానికి ముందుకుసాగాలి. మనం ముందుకుసాగుతుంటే కొన్ని ఊగిసలాడే శక్తులు కూడా మనతో కలిసి వస్తాయి. మనం జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేయటానికి కృషిచేయాలి. మనం 100 సంవత్సరాల ఉద్యమాన్ని సింహావలోకనం చేసుకొంటున్నామంటే ద్విగుణీకృతంగా ముందుకుపోవటానికి ప్రయత్నించాలి. ఇప్పటికీ సాధించిన విజయాలను కాపాడుకొంటూ సాధించాల్సిన వాటి కోసం ముందుకుసాగాలి.

❄

ఈ మాసం ప్రత్యేకం

# మోడి విధానాలకు వ్యతిరేకంగా నవంబరు 26న సార్వత్రిక సమ్మె



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**సిహెచ్ నర్సింగరావు**

న్యూఢిల్లీలో గాంధీ జయంతి రోజున 10 కార్మిక సంఘాల జాతీయ సదస్సు జరిగింది. మోడీ కార్మిక విధానాలకు వ్యతిరేకం గా నవంబర్ 26న దేశవ్యాప్త సమ్మెకు ఈ సదస్సు పిలుపునిచ్చింది. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా అక్టోబర్ ఆరు నుంచి ఎనిమిది వరకు ఇండోనేషియాలో జరిగిన దేశవ్యాప్త దిగ్బంధనం తరహాలో భవిష్యత్ పోరాటానికి ఈ సమ్మె నాందికావాలని సదస్సు ప్రతిన బూనింది. దేశవ్యాపితంగా ఉన్న కిసాన్ సంఘాలన్నీ ఈ పోరాటానికి సంఘీభావం ప్రకటించాయి. 2019 ఎన్నికల్లో సాధించిన మెజార్టీతో ఆర్ఎస్ఎస్ వ్యూహాత్మక విధా నాలను బిజెపి దూకుడుగా అమలు చేస్తోంది. మతోన్మాద అజెండాతో పాటు కార్పొరేట్లకు రాయితీలిచ్చి, సామాన్య ప్రజలపై భారాలు మోపే ఆర్థిక విధానాల దూకుడుపెంచింది. కరోనా సమయాన్ని అదునుగా చూసి ప్రజల చేతులూ, కాళ్లు కట్టేసి ముప్పేట దాడి సాగిస్తున్నది.

గోబెల్స్ ప్రచారంతో తమ తప్పుడు విధానాలపై ప్రజల్లో విశ్వసనీయత పెంచుకొనే ఎత్తుగడను మోడీ ప్రభుత్వం అనుసరిస్తోంది. ఒక అబద్ధం పదేపదే చెబితే ప్రజలు నిజమని నమ్ముతారని భావిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో హిట్లర్ అనుసరించిన ఈ విధానాన్నే మోడీ అనుసరిస్తున్నారు. కార్పొ రేట్లకు పెట్టుబడులు సమకూర్చి, రాయితీలిస్తే 2024 నాటికి ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించడం సులభమేనని ప్రధాని మోడీ ఇటీవల ప్రకటించారు. కరోనా సమయంలో చైనా నుంచి వెళ్లిపోతున్న పెట్టుబడిదారులను ఆకర్షించగలిగితే మన దేశానికి విదేశీ పెట్టుబడులు బాగా వస్తాయని, విదేశీ పెట్టు బడులు రావడానికి పెద్ద ఆటంకంగా కార్మిక చట్టాలున్నాయని చెబుతున్నారు. అందుకే కార్మిక చట్టాలను మార్చుతున్నట్లు ప్రచారం సాగిస్తు న్నారు. దేశంలోని 44 కార్మికచట్టాల్లో నిరుపయోగమైన అంశాలను తొలగించి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం వల్ల 30 నుంచి 100 శాతం కార్మికులకు మేలు కలుగుతుందని ప్రధాని చేస్తున్న ప్రచారం పూర్తి అవాస్తవం.

సంపదను సృష్టించేది కష్టంచేయని పెట్టు బడుదారులు, కార్పొరేట్లు కాదు. సంపద సృష్టికర్తలు కార్మికవర్గమని 1847లో కారల్ మార్క్స్ 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో రాశారు. పెట్టుబడి గ్రంథంలో సమగ్రంగా వివరించారు. కరోనా కాలంలో సామాన్య ప్రజలకు ఆదాయం లేక కొనుగోలుశక్తి పడిపోయింది. వీరికి ఆదాయం కల్పించడం ద్వారా కొనుగోలు శక్తి పెంచాలి. అప్పుడే మార్కెట్‌లో సరుకు డిమాండ్ పెరిగి ఉత్పత్తి అవసరం పెరుగుతుంది. ఉ త్పత్తి చేసిన సరుకులకు డిమాండ్‌లేకపోవడం వల్ల పెట్టుబడులు రావడంలేదు. పెట్టుబడిదారులు రాకపోవడానికి కారణమిదైతే 'రోగం ఒకటైతే, మందు మరొకటి ఇచ్చినట్లు' ప్రభుత్వం ప్రజల కొనుగోలుశక్తిని పెంచే చర్యలు చేపట్టకుండా, పెట్టుబడిదారులకు రాయితీలిచ్చి వారిని ప్రోత్సహించే పద్ధతిని అనుసరిస్తోంది. గుర్రాన్ని బండి వెనక కట్టి పరిగెత్తించినట్లుగా మోడీ, నిర్మలా సీతారామన్ ఆర్థిక వ్యవస్థను పరిగెత్తిస్తున్నారు. ఫలితంగానే మైనస్ 10 శాతమున్న జిడిపి మైనస్ 23శాతానికి చేరు కుంది. కార్పొరేట్లకు అత్యంత రాయితీలిచ్చి ప్రపంచ కుబేరుని జాబితాలో ముఖేష్ అంబానిని మూడో వ్యక్తిగా అందలమెక్కించారు. ఆయన ఆదాయం 33 శాతం పెరిగింది. మరోవైపు ఈ కాలంలోనే ఆకలి మంటలతో మలమల లాడే ప్రజల సంఖ్య పెరిగింది.

కార్పొరేట్ల డిమాండ్లకు తలొగ్గి కార్మిక హక్కులను కాలరాయడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం పూనుకున్నది. కార్మికులు త మ ఆదాయాలు కోల్పోయినా పెట్టుబడిదారులు మాత్రం అత్యధిక లాభాలు గడించేందుకే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో కార్మిక చట్టాలపై వేటు వేసింది. కరోనా కాలంలో పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు లేని సమయంలో మూజువాణి పేరుతో కార్మిక కోడ్‌లను పార్లమెంట్ ఆమోదించింది. ఇప్పటి వరకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చింది. 'చట్టం' పేరుకూడా ఉండడానికి బిజెపి ప్రభుత్వానికి ససేమిరా ఇష్టంలేదు. జీతాలు కూడా కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, వృత్తి భద్రత, పని పరిస్థితుల కోడ్, సామాజిక సంక్షేమ కోడ్ అని నాలుగు కోడ్ లుగా మార్చారు. కార్మిక చట్టాలేవీ ఏ ప్రభుత్వ దయాదాక్షిణ్యాలతో వచ్చినవి కావు. ప్రతి చట్టమూ పోరాడి సాధించుకున్నదే. ఇప్పుడున్న కార్మిక చట్టాల్లో అనేక లొసుగు లున్నాయి. ఆ లోపాలను సరిదిద్దాలని కార్మిక సంఘాలు పోరాడుతున్నాయి. కానీ కార్మిక చట్టాలే లేకుండా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రచేశాయి. కార్మిక కోడ్‌లతో యావత్ కార్మికులకు మేలు జరుగుతుందనే ప్రధాని ప్రచారం వాస్తవం కాదు. కోడ్‌లుగా మార్చడమంటే కార్మిక చట్టాల్లో ఉన్న శక్తిని బలహీనపర్చడమే.

పారిశ్రామిక వివాద చట్టం 1947

> కార్మికవర్గం రక్తతర్పణతో 8 గంటల పని హక్కును సాధించుకుంది. 140 సంవత్సరాల తరువాత ఫ్యాక్టరీ చట్టం 1948ని పూర్తిగా మార్చేశారు. పనిగంటలకు పరిమితి లేకుండా చేశారు. రాష్ట్రాలకు పూర్తి అధికారాలు అప్ప గించారు. అదనపు పనిగంటల పేరుతో మహి ళలను సైతం 24 గంటలు పనిలో నిర్బంధించే అవకాశం నేడు కార్మిక కోడ్‌లు కల్పించాయి.



నవంబర్ 26 సమ్మెకు అన్ని యూనియన్లు సిద్ధం

ప్రకారం లాకౌట్, లే ఆఫ్, మూసివేతలు వంటి చర్యలకు యాజమాన్యం దిగితే, 100 మందికిపైగా పనిచేసే ప్రతి పరిశ్రమలోనూ ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ నేడు వంద సంఖ్యను 300కు పెంచడంతో 70శాతం మంది కార్మికులు ఈ పరిధి నుంచి మినహాయించబడతారు. యాజమాన్యం కోరుకున్నట్లు హైర్ అండ్ ఫైర్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. ఈ చట్టం లోని మార్పుతో యాజమాన్యాలు కార్మికులను యధేచ్ఛగా తొలగించడానికి అవకాశం ఏర్పడింది. ఇది యాజమాన్యానికి బ్రహ్మా స్త్రంలా ఉపయోగపడుతుంది. భవిష్యత్‌లో కార్మికుల పర్మినెంట్ రిక్రూట్‌మెంట్ వుండదు. ఫిక్స్‌డ్ టెర్మ్ ఎంప్లాయ్‌మెంట్ పేరుతో తాత్కాలిక నియమాకాలు చేపడతారు. పర్మినెంట్ చేయాలని అడిగే హక్కు కార్మికవర్గం కోల్పోతుంది. కార్మిక పోరాటాలను అణిచేందుకు ప్రభుత్వాలు యాజమాన్యాలకు అన్ని అవకాశాలు కల్పించాయి. గతంలో విద్యుత్, ఇంధనం వంటి అత్యవసర పరిశ్రమలలో పనిచేసే కార్మిక సంఘాలు మాత్రమే 14 రోజుల ముందు సమ్మె నోటీసులు ఇవ్వాలి. కాని నేడు ప్రతి కార్మిక సంఘం, ప్రతి యజమాని కింద పనిచేసే కార్మికులంతా రెండు నెలల ముందుగా సమ్మె నోటీసు ఇవ్వడం తప్పనిసరి చేసింది. సమ్మె నోటీసు ఇచ్చిన తరువాత కూడా కన్సీలియేషన్ పేరుతో సమ్మె చేయడానికి లేదు. కన్సీలియేషన్ ముగిసిన తరువాత కూడా సమ్మె చేసే అవకాశం లేకుండా చేశారు. సమ్మె కార్మికుల హక్కు. కార్మికులు తమ పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకున్నారు. సమ్మె హక్కు లేకుండా చేసి కార్మికులను బానిసత్వంలోకి నెట్టాలని కార్పొరేట్లు భావిస్తున్నారు. ఏ హక్కులు లేనికాలంలోనే కార్మికులు పోరాడి హక్కులు, చట్టాలు సాధించుకున్నారు. ట్రేడ్ యూనియన్ చట్టం 1926లో కార్మిక సంఘాలు ఏర్పడే హక్కును కల్పించింది. బ్రిటీష్‌వారి కాలంలో పోరాడి సాధించుకున్న హక్కు. ట్రేడ్ యూనియన్ చట్ట ప్రకారం బయటి నాయకులు ప్రతి కార్మిక సంఘంలో 50 శాతం మంది ఉండవచ్చు. స్వాతంత్రోద్యమకాలం నుంచి సుభాష్ చంద్రబోస్, బాలగంగాధర్ తిలక్, వి వి గిరి, జ్యోతిబసు వంటి మహానాయకులంతా ఆనాడు ట్రేడ్ యూనియన్ నాయకులుగా పనిచేశారు. బ్రిటీష్ ప్రభుత్వాన్ని కేసరి పత్రికలో విమర్శించినందుకు బ్రిటీష్ ప్రభుత్వం తిలక్‌కు మూడు సంవత్సరాలు శిక్ష విధించింది. తిలక్‌పై శిక్షకు నిరసనగా నేవీతో సహా బొంబాయి కార్మికులంతా మూడు రోజులు సమ్మె చేశారు. బయటి నాయకులు లేకపోతే ట్రేడ్ కక్ష సాధింపులు, వేధింపులు, బెదిరింపులతో యూని యన్‌లో లోపల కార్మికులను అణచివేస్తారు. ఇటీవల పోరాటాల వల్ల మూడో వంతు బయట నాయకులు వుండవచ్చని కోడ్‌లో పొందుపర్చారు.

మేడే స్ఫూర్తిగా 8 గంటల పనిదినం సాధించుకున్నాం. రోజులో 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల దినచర్య శాస్త్రీయ విధానం. ప్రపంచ వ్యాపితంగా చికాగోలో 1886లో ప్రారంభమైన ఉద్యమం ప్రపంచమంతా 8 గంటలు పని హక్కు సాధించే వరకు వందలాది మంది ప్రాణాలు ఫణంగా పెట్టారు. కార్మికవర్గం రక్తతర్పణతో 8 గంటల పని హక్కును సాధించుకుంది. 140 సంవత్స రాల తరువాత ఫ్యాక్టరీ చట్టం 1948ని పూర్తిగా మార్చేశారు. పనిగంటలకు పరిమితి లేకుండా చేశారు. రాష్ట్రాలకు పూర్తి అధికారాలు అప్ప గించారు. అదనపు పనిగంటల పేరుతో మహిళలను సైతం24 గంటలు పనిలో నిర్బంధించే అవకాశం నేడు కార్మిక కోడ్‌లు కల్పించాయి. ఇప్పటికే డ్యూటీల నుంచి ఆలస్యంగా ఇళ్లకు వెళ్ళే మహిళలపై అత్యాచారాలు, మానభంగాలు జరుగుతు న్నాయి. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. మహిళలకు సమాన వేతనాలు అమలుకావడం లేదు. పురుషులతో సమానంగా పనిపేరుతో రాత్రులు కూడా విధులు కొనసాగించడానికి లేబర్ కోడ్ అవకాశం కల్పించింది.

సామాజిక సంక్షేమ నిధి పేరుతో ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐ, బిల్డింగ్ నిధులు మొత్తం లక్షల కోట్లకు ప్రధాని ఛైర్మన్‌గా నియమించుకున్నారు. అయితే కార్మికసంఘాల పోరాటాల ఫలితంగా పిఎఫ్, ఇఎస్ఐ, బిల్డింగ్ నిధులను మినహాయించారు. మిగిలిన సుమారు అనేక సంస్థల నిధులను ప్రధాన మంత్రి ఆధ్వర్యంలో ఖర్చుపెడతారు. దీనిని బట్టి ప్రాధాన్యతలు పెట్టుబడిదారులకు అనుకూలంగా వుంటాయని అర్థమవుతుంది. ప్రధానమంత్రి కార్మికుల సంక్షేమం ఏ మాత్రం కాపాడ తారోచూడాలి.

మోడీ ప్రభుత్వ చర్యలు వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి.

(మిగతా 34వ పేజీలో)

అధ్యయనం

# హత్రాస్ ఘటన: వాస్తవాలు-కట్టుకథలు



రచయిత న్యూఢిల్లీలో ప్రజాశక్తి ప్రతినిధి

**జె. జగదీష్**

ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లా భోల్‌గరీ గ్రామంలో 19 ఏళ్ల దళిత యువతిపై అత్యాచారం, హత్య ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయమైంది. దేశంలో అత్యంత క్రూరమైన సామూహిక అత్యాచారాల సంఘటనలలో హత్రాస్ ఒకటి. అగ్రకుల నేరస్తులను రక్షించడంలోనూ, బాధితులపై తప్పుడు ప్రచారాన్ని చేయడంలోనూ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ముఖ్య పాత్ర పోషించాయి. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాలైన చట్ట ఉల్లంఘనలకు పాల్పడింది. అంబులెన్స్‌లో ఇంటికొచ్చిన మృతదేహాన్ని ఆపండంటూ ఇంటి ముందే గుమిగూడిన జనం అడ్డం పడినా... పట్టించుకోకుండా నేరుగా శ్మశానానికి పంపించి అర్ధరాత్రి దాటాక పోలీసులే దహన సంస్కారాలు జరిపించారు.

దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తే తప్ప బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి భరోసా కల్పించే అవకాశం లభించని ప్రజాస్వామ్య వ్యవస్థ అక్కడ అమలులో ఉంది. రాజ్యాంగ మూలస్థంభాల్లో ఒకటైన మీడియాకు కూడా బాధితుల గోడు వినేందుకు అనుమతి ఇవ్వలేదు. 2017లో ఉన్నావో (ఉత్తరప్రదేశ్), 2018 కథువా (జమ్మూ కాశ్మీర్) ఘటనలు దేశంలో చర్చకు దారి తీశాయి. ఆ తరువాత ఆ స్థాయిలో ప్రస్తుత హత్రాస్ (ఉత్తరప్రదేశ్) ఘటన నిలిచింది.

### అసలేం జరిగింది..?

ఆ కుటుంబంలో బాధితురాలు నాలుగో సంతానం. ఆమెకు చదువు పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాల ఊరికి దూరంగా ఉండటంతో బస్సు ఛార్జీలు కూడా భరించలేని స్థితిలో ఉండటంతోనూ, అలాఅని నడుచుకుంటూ వెళ్తే ఠాకూర్ వర్గానికి చెందిన యువకులు అల్లరి చేస్తారనే భయంతోనూ తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఆమె చదువుకు మధ్యలోనే స్వస్తి పలికింది. బిక్కు బిక్కు మంటూ ఇంటివద్దే ఉంటూ తల్లిదండ్రులకు పనిలో సాయపడేది. సెప్టెంబర్ 14న ఉదయం 9:00-9:30 గంటల మధ్య ఎప్పటి లాగే బాధితురాలు, ఆమె తల్లి, సోదరుడు పశుగ్రాసం కోసం పొలానికి వెళ్లారు. అయితే వారికి పొలం కూడా ఏమీ లేదు. ఒక భూస్వామి పొలంలో వారు కూలీ పని చేసేవారు. అందులోని పశు గ్రాసం కోసుకొని తీసుకొచ్చేందుకు వెళ్లారు. పెద్దమోపు కట్టుకుని సోదరుడు ఇంటికి వెళ్లాడు. అయితే గడ్డంతా ఏపుగా పెరగడంతో బాధితరాలు, ఆమె తల్లి దానిని కోసే పనిలో పడ్డారు. పొలంలో బాధితురాలు ఒకవైపు, మరోవైపు ఆమె తల్లి పని చేసుకుంటున్నారు. ఆమె తన కుమార్తెను గడ్డి కట్టగా కట్టమని చెప్పింది. ఆమె ఒకే కట్ట కట్టింది. ఆ తరువాత ఆమె కనిపించలేదు. అప్పటికి అక్కడికి చేరుకున్న అగ్రకుల ఠాకూర్ సామాజిక వర్గానికి చెందిన సందీప్, రవి, రాము, లవకుశులు వెనక నుంచి వెళ్లి బాధితరాలి మెడ చుట్టూ చున్ని బిగించి.. పొలాల గుండా లాక్కెళ్లారు. బాధితరాలిని మానభంగం చేసి, మూకుమ్మడి దాడి, నాలుక కోయడం వంటి చిత్రహింసలకు గురి చేశారు. బాధితురాలు ఎంత ప్రతిఘటించిన వారు వెనక్కి తగ్గలేదు. మరింత రెచ్చిపోయి దాడికి ఒడిగట్టారు. దీంతో ఆమెకు తీవ్రంగా రక్తస్రావం జరిగి అక్కడే జీవశ్ఛవంలా పడి ఉంది. అయితే బాధితురాలి తల్లికి వినికిడి సమస్య ఉండటంతో కుమార్తె అరుపులు, కేకలు ఆమెకు వినిపించలేదు. కుమార్తెను వెతుక్కుంటూ ఓ గంట సేపు తిరిగి..ఎక్కడా కనిపించలేకపోయేసరికి, ఇంటికి వెళ్లిందేమో అనుకుని తల్లి కూడా ఇంటికి వెళ్లింది. అయితే ఇంటికి వెళ్లి చూస్తే తన కుమార్తె కనబడలేదు. కుటుంబ సభ్యులు కూడా రాలేదని చెప్పడంతో కొడుకును వెంట బెట్టుకొని కుమార్తెను వెతకడానికి పొలానికి వెళ్లింది. పొలాల్లో వెతక సాగారు. హత్రాస్‌ను మెయిన్ రోడ్డుతో కలిపే రోడ్డుకు దాదాపు వంద మీటర్ల దూరంలో సజ్జచేనులో స్పృహ లేకుండా బాధితురాలు కింద పడిపోయి ఉంది. ఆమె గొంతు చుట్టూ చున్నీ బిగించి ఉంది. ఒంటిపై బట్టలు లేవు. ఆమె వెన్నెముక విరిగిపోయింది. నాలుక తెగిపోయి ప్రాణాలే లేనట్లుగా ఉంది. రక్తపు మడుగులో, అచేతన స్థితిలో పడి ఉన్న బాధితురాలిని చూసి తల్లి, సోదరుడు తీవ్రంగా విలపించారు.

అక్కడ నుంచి తీసుకెళ్లేటప్పుడు ఆమె పూర్తిగా స్పృహ కోల్పోలేదు. అప్పుడు ఒకరి పేరే చెప్పింది. దారి పొడవునా ఆమె రక్తం కక్కుతూనే ఉంది. ఆమె నాలుక నీలి రంగులోకి మారిపోయింది. ఏం జరిగిందో చెప్పమని ఆమెను తల్లి అడిగింది. అందుకు తన గొంతు నులిమారని మాత్రమే బాధితురాలు చెప్పగలిగింది. ఘటనాస్థలం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో పోలీస్ స్టేషన్ ఉంది. బాధితురాలిని ఆమె కుటుంబం ఆసుపత్రి కన్నా ముందు అక్కడికే తీసుకెళ్లింది. పోలీసులు కేసునమోదు చేయలేదు. ఆమెను ఆసుపత్రిలో చేర్పించటానికి సిద్ధం కాలేదు. ఆమెను తీసుకెళ్లమని కుటుంబ సభ్యులను ఆదేశించారు. అప్పుడు ఆమె ప్రాణంతో ఉంది మినహా మాట్లాడే పరిస్థితుల్లో లేదు. కుటుంబ సభ్యులు గగ్గోలు పెట్టడుతూ చివరికి ఉదయం 11:45 గంటల సమయంలో బాధితురాలిని స్థానిక జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు.ఆ తర్వాత ఓ గంటకు ఆమె స్పృహ కోల్పోయింది. అయితే అందులోని వైద్య సిబ్బంది ఆమెకు చికిత్స అందించలేమని, అందుకు అవసరమైన సౌకర్యాలు తమవద్ద లేవని తెలిపారు. డాక్టర్ కూడా సమయం మించి పోతుంది..12:10 అవుతోంది.. ఆలీఘడ్ ముస్లీం యూనివర్శిటీ (ఏఎంయు) లేదా

జవహర్‌లాల్ నెహ్రూ మెడికల్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని పోలీసులకు చెప్పారు. డాక్టర్ సలహా మేరకు ఎట్టకేలకు సాయంత్రం 4:10 గంటలకు బాధితరాలిని ఎఎంయు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎనిమిది రోజుల తరువాత సెప్టెంబర్ 22న ఎఎంయు ఆసుపత్రిలో ఆమె స్పృహలోకి వచ్చింది.

అప్పుడు మొత్తం విషయం వివరించింది. తనపై నలుగురు యువకులు 'జబర్‌దస్థ్' చేశారని ఆ వీడియోలో నాలుగు సార్లు తెలిపింది. దారుణం గా రేప్ చేశారని చెప్ప డానికి యుపి హిందీ యాసలో 'జబర్‌దస్థ్' అని వాడడం సర్వసాధారణం. అయితే బాధితురాలి పరిస్థితి మరింత విషమం గా మారడంతో ఎఎంయు ఆసుప్రతి డాక్టర్లు ఆమెను ఢిల్లీలోని ఎయిమ్స్‌కు రిఫర్ చేస్తూ రిపోర్టులో చాలా స్పష్టంగా పేర్కొన్నారు. అయితే పోలీసులు మాత్రం ఉన్నతాధికారుల సూచన మేరకు ఎఎంయు నుంచి 15 రోజుల తరువాత సెప్టెంబర్ 28న ఎయిమ్స్‌కు తీసుకెళ్లకుండా పోలీసులు, అధికారులు వారి కంట్రోల్‌లో ఉన్న సఫ్థర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు. సెప్టెంబర్ 29న ఉదయం 8.30 గంటలకు ఆమె ప్రాణాలు విడిచినట్లు డాక్టర్లు వెల్లడించారు. ఆసుప్రతి మార్చురీ వద్ద ఏం జరగబోతుందో అర్థంకాక కుటుంబ సభ్యులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు వ్యవహరించారు. ఆ దళిత యువతి మృత దేహాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించలేదు. తన కుమార్తెను కడసారి చూపించాలని తల్లిదండ్రులు కోరినప్పటికీ పోలీసులు ససేమీరా అన్నారు. కుటుంబ సభ్యుల ఆవేదన, రోదనలు వినిపించుకోకుండా రాత్రికి రాత్రి ఎస్కార్ట్ పెట్టుకొని పోలీసులు మృత దేహాన్ని ఢిల్లీ నుంచి భోల్‌గరీ గ్రామానికి తీసుకెళ్లారు. అప్పటికే గ్రామంలో కాచుకొని ఉన్న పోలీసులు, అధికారులు దహనానికి ఏర్పాట్లు చేశారు. బాధితురాలి ఇంటి మీదుగా వెళుతున్న అంబులెన్స్‌ను ఆపాలని, తమ కుమార్తెను కడసారి చూసుకునేందుకు అవకాశం ఇవ్వాలని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల చివరి కోరిక నిరాకరణకు గురైంది. మృతదేహాన్ని కాల్చేందుకు అధికారులు, పోలీసులు చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుతగిలిన రక్త సంబంధీకులను పక్కకు నెట్టేసి, వారివద్ద నున్న ఫోన్లు లాక్కొన్నారు. కనీసం సాంప్రదాయాలను కూడా పాటించకుండా పెట్రోల్ పోసి మృతదేహాన్ని సెప్టెంబర్ 30 తెల్లవారు జామున 3.30 గంటలకు కాల్చి వేశారు. ఆమెతో పాటే సాక్ష్యాలను కూడా కాల్చివేసేందుకు జరిగిన కుట్రలో భాగమే అర్ధరాత్రి దహనం.

> **"పోలీసులు కేసును నిర్వీర్యం చేసేందుకే రాత్రికి రాత్రే మృత దేహాన్ని దహనం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అత్యాచార కేసుల్లో బాధితుల మృతదేహాలను తప్పనిసరిగా కుటుంబ సభ్యులకే అప్పగించాలి. అలా చేయకపోగా కూతురు మృతదేహాన్ని అప్పగించమని కోరడానికి వెళ్లిన కుటుంబ సభ్యులను పోలీసులు నిర్బంధించి వేధించారు."**



మానభంగానికి గురైన యువతిని అర్ధరాత్రి దహనం చేస్తున్న యుపి పోలీసులు

### కేసును నిర్వీర్యం చేసేందుకే అర్ధరాత్రి అంత్యక్రియలు

పోలీసులు కేసును నిర్వీర్యం చేసేందుకే ఈ విధంగా వ్యవహరించి సాక్ష్యాధారాలు లేకుండా చేశారు. రాత్రికి రాత్రే మృత దేహాన్ని దహనం చేయడానికి ఇదే కారణం. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అత్యాచార కేసుల్లో బాధితుల మృతదేహాలను తప్పనిసరిగా కుటుంబ సభ్యులకే అప్పగించాలి. అలా చేయకపోగా కూతురు మృతదేహాన్ని అప్పగించమని కోరడానికి వెళ్లిన కుటుంబ సభ్యులను పోలీసులు నిర్బంధించి వేధించారు. భౌతిక కాయాన్ని అర్ధరాత్రి దహనం చేయడం మానవ హక్కుల ఉల్లంఘనగా ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు విమర్శిస్తే...పోలీసులు వారిపై ప్రతి విమర్శలు చేశారు. అయితే సుమోటోగా కేసును స్వీకరించిన అలహాబాద్ హైకోర్టు కూడా అక్టోబర్ 13న అదే స్పష్టం చేసింది. దీంతో యుపి పోలీసులకు నోరు మూగబోయింది. అయితే దేశంలో కరోనాతో చనిపోయిన వారి మృతదేహాన్ని ముట్టకూడదనే మార్గదర్శకాలు ఉన్నప్పటికీ కరోనాతో సెలబ్రిటీలు చనిపోతే, వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. వారే దహన సంస్కారాలు చేస్తున్నారు. కానీ ఇక్కడ కొంతమంది కుల ఆధిపత్య రాక్షసుల చేతుల్లో అతి కిరాతికంగా చిత్ర హింసలకు గురై తిరిగిరాని లోకాలకెళ్లిన 19 ఏళ్ల దళిత యువతి మృతదేహాన్ని మాత్రం ఆ కుటుంబానికి అప్పగించలేదు. అందువల్ల ఇప్పుడు మళ్లీ వైద్య పరీక్షలు నిర్వహించే పరిస్థితి

> **❝ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో అనేక అనుమానాలు వ్యక్తం అవుతు న్నాయి. అత్యాచారం జరిగిన చాలా రోజుల వరకు పోలీసులు కేసు దాఖలు చేయక పోవడం, కనీసం నిందితులను అదుపులోకి తీసుకోక పోవడం, అలాగే బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్ళినప్పటికీ పోలీసులు అలసత్వం ప్రదర్శించడం అనుమానాలను రేకెత్తిస్తోంది. ❞**

లేకుండా పోయింది. ఇంత దారుణానికి ఒడిగట్టిన పోలీసులు బాధితురాలి బంధువులే దహన సంస్కారాలు నిర్వహించారని అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. హత్రాస్ జిల్లా ఎస్పీ విక్రాంత్ కూడా మీడియాతో అదే పేర్కొన్నారు. ఈ రకంగా వారు చేసిన తప్పులను ఒప్పులుగా ప్రచారం చేసేందుకు యుపి పోలీస్ యంత్రాంగం పథకం ప్రకారం పనిచేస్తున్నది.

**వేధింపులు..బెదిరింపులు..ఆంక్షలు**

జరిగిన ఘటన బయట ప్రపంచానికి తెలిసిన రోజు నుంచి కుటుంబ సభ్యులపై బెదిరింపులు, వేధింపులు పెరిగాయి. మీడియాతో మాట్లాడొద్దని, ప్రతిపక్ష నేతలతో మాట్లాడొద్దని హుకుం జారీ చేశారు. వేలాది మంది పోలీసు వలయంలో ఉన్న ఆ గ్రామాన్ని చూస్తే..ఏదో డేంజర్ జోన్ ప్రాంతాన్ని గుర్తు చేస్తోంది. అక్కడ ప్రజల కంటే పోలీసులే ఎక్కువ మంది ఉన్నారు. కిలోమీటర్ల పొడువునా పోలీసుల గస్తీ ఏర్పాటు చేశారు. గ్రామానికి వచ్చే అన్ని దారుల్లో పోలీసులు బారికేడ్లు, సిసిటీవిలు ఏర్పాటు చేశారు. పోలీసులు తొలుత మీడియాతో పాటు ఎవరినీ గ్రామంలోకి రానివ్వలేదు. అయినప్పటికీ కొంత మంది జర్నలిస్టులు ఆ గ్రామానికి చేరుకొనే ప్రయత్నం చేశారు. వారిని కూడా అరెస్టు చేశారు. దీంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. అంతర్జాతీయ సమాజం సంఘీభావం తెలపటంతో పాటు అనేక ప్రాంతాలలో ఆందోళనలు జరిగాయి. మరోపక్క జరిగిన ఘటనపై బిజెపిలోనే కొంత మంది విమర్శలు ఎక్కుపెట్టారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బాధిత కుటుంబాన్ని కలుసుకునేందుకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చారు. ఆ తరువాత కూడా బారికేడ్లు ఉండటంతో జర్నలిస్టులు గ్రామంలోకి నడిచే వెళ్లాల్సి వస్తోంది. ఆంక్షలతో కూడిన అనుమతి వల్ల చాలా మంది నేతలు కుటుంబాన్ని కలుసుకొని సంఘీభావం తెలియజేయలేకపోయారు. ఈ ఘటనను కవరు చేసేందుకు వెళ్లిన ఢిల్లీలో పని చేస్తోన్న కేరళకు చెందిన జర్నలిస్టు సిద్దికీ కప్పన్‌ను అక్టోబర్ 5 రాత్రి యుపిలోని మథుర వద్ద అరెస్టు చేసి, ఉగ్రవాద వ్యతిరేక (యుఎపిఎ) చట్టం కింద కేసు నమోదు చేశారు.

**అనుమానాలెన్నో..!**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అత్యాచారం జరిగిన చాలా రోజుల వరకు పోలీసులు కేసు దాఖలు చేయకపోవడం, కనీసం నిందితులను అదుపులోకి తీసుకోక పోవడం అనుమానాలను రేకెత్తిస్తోంది. అలాగే బాధితుల/ స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్ళినప్పటికీ పోలీసులు అలసత్వం ప్రదర్శించారు. కేసు నమోదు చేసి, నిందితులను వెంటనే అరెస్టు చేసేందుకు సిద్ధపడలేదు. ఘటన జరిగిన ఆరు రోజుల తరువాత సెప్టెంబర్ 19న ఎ1 నిందితుడు సందీప్ ఠాకూర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సెప్టెంబర్ 22న బాధితురాలు మేజిస్ట్రేట్‌కు వాగ్మూలం ఇవ్వడంతో మరో ఐదు రోజుల తరువాత సెప్టెంబర్ 26న మిగిలిన ముగ్గురును నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

**పోలీస్ వ్యవస్థ తీరుపై అనేక ప్రశ్నలు**

ఈ ఘటనపై పోలీసుల తీరు తొలినుంచి అనేక ప్రశ్నలు, సందేశాలకు తావిస్తోంది. తొలుత బాధితురాలిపై అత్యాచారం జరిగిన కోణంలో ఎందుకు విచారణ జరపలేదు? వైద్య రిపోర్టులు, పోస్ట్‌మార్టం రిపోర్టు కుటుంబ సభ్యులకు ఎందుకు ఇవ్వలేదు? ఘటనా స్థలాన్ని పోలీసులు ఎందుకు సీల్ చేయలేదు? ఆరంభంలోనే అక్కడ సాక్ష్యాలు ఎందుకు సేకరించలేదు? రాత్రిపూట బలవంతంగా అంత్యక్రియలు ఎందుకు చేశారు? సాంకేతిక ఆధారాలు ఎందుకు సేకరించలేదు? నిందితుల అరెస్టులో ఆలస్యం ఎందుకు చేశారు? అనే ప్రశ్నలకు సమాధానాలు లేవు.

**మేజిస్ట్రేట్ బెదిరింపులు**

వాస్తవానికి ఈ సంఘటన జరిగిన ఎనిమిది రోజుల తరువాత ఆమె చేసిన అత్యాచార ఆరోపణను పోలీసులు పరిగణనలోకి తీసుకున్నారు. బాధితురాలు తనపై జరిగిన లైంగిక వేధింపుల గురించి మొదట పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడినప్పుడు జిల్లా మేజిస్ట్రేట్ బెదిరింపులకు దిగారు. కుటుంబ సభ్యులు చేస్తున్న ఆరోపణలను ఉపసంహరించుకోమని కోరుతూ కెమెరాలో చిక్కడంతో మళ్లీ మాట మార్చారు. సెప్టెంబర్ 22న ఎఎంయు ఆసుపత్రిలో స్పృహలోకి వచ్చిన తరువాత లైంగిక వేధింపుల వివరాలను అందించగలిగారు. మేజిస్ట్రేట్ ఆమె స్టేట్‌మెంట్‌ను ముందు నమోదు చేసిన తరువాత, అత్యాచారానికి సంబంధించిన అంశాలతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

**అత్యాచారం జరగలేదా..?**

బాధితురాలి శరీరంపై వీర్యం లేదని ఫోరెన్సిక్ నివేదిక వెల్లడించటం ఆధారంగా 'అత్యాచారం జరగలేదు' అని యోగి సర్కార్ ప్రచారం చేసింది. అయితే బలవంతంగా అంగ ప్రవేశం కోసం నిందితులు ప్రయత్నించినట్లు కూడా ఈ నివేదికలో ఉంది. దీని గురించి మాత్రం పోలీసులు ప్రస్తావించలేదు. బాధితురాలిపై అత్యాచారం చేశారని చెప్పడానికి ఎఎంయు ఆస్పత్రి వైద్యులు 'కంప్లీట్ పెనట్రేషన్ ఆఫ్ వజీనా' అంటూ తమ ప్రాథమిక నివేదికలో వెల్లడించారు. కానీ దాన్ని ఎక్కడా బయట పెట్టకుండా తొక్కి పెట్టారు. అత్యాచార నిర్ధారణ కోసం బాధితురాలి నుంచి సెప్టెంబర్ 22 (సంఘటన జరిగిన 9 రోజుల తరువాత)న శాంపిల్స్ తీసుకున్నారు. ఆగ్రాలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు సెప్టెంబర్ 25 (సంఘటన జరిగిన 11 రోజుల తరువాత)న శాంపిల్స్ అందాయి. సంఘటన జరిగిన 96 గంటల లోపు మాత్రమే ఫోరెన్సిక్ ఆధారాలు కనుగొనవచ్చుని ఎఎంయు జవహర్ లాల్ నెహ్రూ మెడికల్ కాలేజీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సిఎంఒ) డాక్టర్ అజీమ్ మాలిక్ తెలిపారు. కానీ 11 రోజుల తరువాత నమూనాలు సేకరించడం వల్ల ఫలితాల్లో వాస్తవాలు స్పష్టం కాలేదు. యోగి ప్రభుత్వం కాలం గడిచిన తర్వాత నమూనాలను సేకరించి, ఆ రిపోర్టులతో అత్యాచారమే జరగలేదని బాధితరాలిని అవమాన పర్చేందుకు ప్రచారం చేస్తున్నది.

**ప్రైవేట్ పిఆర్ సంస్థతో తప్పుడు ప్రచారం**


బాధితురాలిపై అత్యాచారం జరగలేదని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న

ప్రైవేట్ పిఆర్ సంస్థతో తప్పుడు ప్రచారానికి ఒడిగట్టింది. హత్రాస్‌లో దళిత మహిళపై సామూహిక అత్యాచారం, హత్యకేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరపున ముంబాయికి చెందిన కాన్సెప్ట్ పబ్లిక్ రిలేషన్ (పిఆర్) సంస్థ సోషల్ మీడియా ద్వారా విస్తృత విష ప్రచారం మొదలెట్టింది. ఈ సంస్థ బాధితురాలి మృత దేహాన్ని పోలీసులు 'బలవంతంగా' దహనం చేసిన తరువాత ఒక నోట్ విడుదల చేసింది. ఆ నోట్ ప్రభుత్వ వాదనలను పునరుద్ఘాటించింది. హత్రాస్ కేసులో బాలికపై అత్యాచారం జరగలేదని, దీని వెనుక రాష్ట్రాన్ని కుల తగాదాలలోకి నెట్టే కుట్ర ఉందని పేర్కొంది. దీన్నిబట్టి యోగి సర్కార్ కట్టుకథలు స్పష్టం అవుతున్నాయి. ఆశిష్ జలన్ చేత నిర్వహించబడుతున్న ఈ కాన్సెప్ట్ పిఆర్ సంస్థ చేస్తున్న ప్రచారానికి యోగి ప్రభుత్వం డబ్బు చెల్లిస్తోంది.

### ప్రేమ వివాదంగా మార్చేందుకు కుట్ర

తమ తప్పులను ఇంకొకరిపై నెట్టేయడంలో సంఘ్ పరివార్‌కు ఇంకెవరూ సరిరారు. సరిగ్గా ఇక్కడ కూడా అదే జరిగింది. బాధితురాలిపై నిందితులే ఆరోపణలు చేస్తున్నారు. పోలీసులు, దర్యాప్తు సంస్థలు కూడా ఆ రకంగానే వ్యవహరిస్తున్నాయి. బాధిత కుటుంబ సభ్యులే దాడి చేశారని ఆరోపణలు చేయడాన్ని బట్టి ఈ కేసును ఎలా మార్చాలని చూస్తున్నారో స్పష్టం అవుతుంది. అందుకు పోలీసులు కూడా వత్తాసు పలుకుతున్నారు. దీనిని ఒక ప్రేమ వివాదానికి సంబంధించిన కేసులా మార్చే కుట్ర జరుగుతోంది. అందుకు యుపి పోలీసులు ఒక పథకాన్ని రూపొందించారు. నిందితుడు, బాధితురాలి మధ్య ఫోన్ సంభాషణలు ముందుకు తీసుకొచ్చారు. ప్రధాన నిందితుడు సందీప్ ఠాకూర్ కూడా తామిద్దరం ప్రేమించుకుంటున్నామని, కుటుంబ సభ్యులే దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ పోలీసులకు లేఖ రాశాడు. కేసును తప్పుదోవ పట్టించే ప్రక్రియను ఈ పరిణామాలు వెల్లడిస్తున్నాయి. అలాగే ఆధిపత్య వర్గానికి చెందిన నిందితుల సామాజిక వర్గం వారి తరపున ఓ లాయర్‌ను నియమించడం, ఆ తరువాత బాధితురాలికి, నిందితుడికి మధ్య ఫోన్ సంభాషణ కాల్ డేటా లభించినట్లు పోలీసులు చెప్పడం, అనంతరం కుటుంబ సభ్యులే బాధితురాలిని చంపేశారంటూ ఠాకూర్ సామాజిక వర్గానికి చెందిన గ్రామ పెద్ద ఆరోపిస్తూ పోలీసులకు లేఖ రాయడం, నిందితుడు సైతం అదే రకమైన ఆరోపణలు చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**“ తమ తప్పులను ఇంకొకరిపై నెట్టేయడంలో సంఘ్ పరివార్‌కు ఇంకెవరూ సరిరారు. సరిగ్గా ఇక్కడ కూడా అదే జరిగింది. బాధితురాలిపై నిందితులే ఆరోపణలు చేస్తున్నారు. పోలీసులు, దర్యాప్తు సంస్థలు కూడా ఆ రకంగానే వ్యవహరిస్తున్నాయి. బాధిత కుటుంబ సభ్యులే దాడి చేశారని ఆరోపణలు చేయడాన్ని బట్టి ఈ కేసును ఎలా మార్చాలని చూస్తున్నారో స్పష్టం అవుతుంది. ”**



**ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆధిత్యనాథ్ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళలపై అత్యాచారాలు 55 శాతం పెరిగాయి**

### సిబిఐ విచారణపై అనుమానాలు

ఈ కేసుపై విచారణ జరిపేందుకు యోగి ప్రభుత్వం రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి భగవాన్ స్వరూప్ నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ని నియమించింది. సిట్ ప్రాథమిక నివేదిక తరువాత ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అక్టోబర్ 2 రాత్రి తూతూ మంత్రంగా జిల్లా ఎస్పీ, డిఎస్పీ, ఇద్దరు సిఐలు, ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌లను సస్పెండ్ చేసింది. అయితే సిట్ తన పూర్తిస్థాయి రిపోర్టు ఇవ్వకముందే, దేశంలో ఆందోళనలు పెరగడంతో అక్టోబర్ 4న యోగి సర్కార్ ఈ కేసును సిబిఐకి అప్పగించింది. అక్టోబర్ 11న సిబిఐ దర్యాప్తు చేపట్టింది. దాదాపు నెల రోజుల తరువాత ఘటనా స్థలం వద్దకు కుటుంబ సభ్యులు వెళ్లారు. నేరం జరిగిన ప్రాంతాన్ని సిబిఐ అధికారులు పరిశీలించిన నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని తీసుకెళ్లారు. తొలి రోజే దర్యాప్తు సందర్భంగా నిందితుడిపై సిబిఐ కేసు నమోదు చేసింది. అంతలోనే సిబిఐ తన వెబ్‌సైట్ నుంచి కేసు నమోదు వివరాలను తొలగించింది. దీంతో సిబిఐ విచారణపై అనుమానాలు పెరిగాయి. అందుకనే తమకు సిబిఐపై నమ్మకం లేదని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో న్యాయ విచారణ జరగాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఆ డిమాండ్‌కు ప్రతిపక్షాలు మద్దతు తెలుపుతున్నాయి.

### బాధితులకు నార్కో పాలిగ్రాఫ్ పరీక్షలా..?

అందరికి నార్కో, పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించాలని ప్రత్యేక విచారణ బృందం (సిట్) సిఫార్స్ చేసింది. అందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇదెక్కడి న్యాయం..? ఎక్కడైన నిందితులకు నార్కో పరీక్షలు నిర్వహిస్తారు. కానీ ఇక్కడ నిందితులతో పాటు బాధితులకు, వారి బంధువులకు కూడా నార్కో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించడం బాధితు లను మరింత వేధించేందుకే. ఇప్పటికే అవమానం,

> **"ఈ గ్రామంలో దళితల పట్ల వివక్షకు అంతూ.. పంతూలేదు. దశబ్దాల నుంచి కుల రక్కసి వెంటాడుతునే ఉంది. ఎందుకంటే ఎవరైనా దళిత కుటుంబానికి చెందిన వారు దుకాణాలకు వెళ్తే ఆమడ దూరంలోనే ఉంచి వస్తువులను విసురుతారు. అలాగే పెళ్లి వయస్సుకు వచ్చిన యువతులకు వస్తువులు విక్రయించేం దుకు కూడా నిరాకరించేవారు."**

హత్య, వేదన, బెదిరింపులకు గురైన బాధిత కుటుంబం ఇప్పుడు మరో భయానక పరిస్థితిని ఎదుర్కొంటున్నది. హత్రాస్ కేసులోని బాధిత కుటుంబానికి బలవంతంగా పరీక్షలు నిర్వహించకూడదు. ఏదో జాతీయ భద్రతకు సంబంధించిన అంశంలోనే తప్ప మరే విష యాల్లో బలవంతంగా పరీక్షలు నిర్వహించ కూడదని కోర్టులు గతంలోనే స్పష్టం చేశాయి. అయితే హత్రాస్ కేసులో జాతీయ భద్రతకు సంబంధించిన అంశమేమీ లేదు. కానీ యోగి ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘించి, నిందితులతో పాటు బాధితులకు కూడా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించడంలో మతలబు ఏమిటీ..? నిందితులను కాపాడే పనిలో ఈ కేసులోకి బాధితులను లాగుతున్నారనేది స్పష్టం. అలాగే పాలిగ్రాఫ్ పరీక్షల కోసం జాతీయ మానవ హక్కుల కమిషన్ మార్గదర్శకాలకు సమానమైన పూర్తి స్థాయి విధానాన్ని "ఖచ్చితంగా పాటించాలి" అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. కనుక నార్కో పాలిగ్రాఫ్ పరీక్షలు బాధితులకు చేయకూడని నిబంధనలు స్పష్టం చేస్తోన్నాయి. కానీ యుపి ప్రభుత్వం మొండిగా వ్యవహ రిస్తోంది.

### అంతర్జాతీయ కుట్ర ప్రచారం

ఎఫ్ఎస్ఎల్ రిపోర్టుల్లో వీర్యం ఆనవాళు ్ల కనిపించలేదని, దీన్ని బట్టి కొందరు కావాలనే రాష్ట్ర ప్రభుత్వంపై అంతర్జాతీయ కుట్రకు పూనుకున్నారని ఎడిజి (లా అండ్ ఆర్డర్) ప్రశాంత్ కుమార్ ప్రచారం చేస్తున్నాడు. అలాగే కుల కల్లోలాలను సృష్టించేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని మీడియా ఎదుట పేర్కొ న్నారు. అంతటితో ఆగకుండా అంతర్జాతీయ కుట్ర...కుల అల్లర్లు ప్రేరేపించ డం, మత వివక్ష, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను మార్చుడం, రాష్ట్రానికి వ్యతిరేకంగా కుట్ర పేరుతో అక్టోబర్ 4న హత్రాస్‌లోని చందప పోలీస్ స్టేషన్‌లో ఐపిసిలోని పలు కఠినమైన సెక్షన్ల కింద దేశద్రోహంతో సహా 19 ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. నిందితులపై కేసులు నమోదు చేయడంలో జాప్యం చేసిన పోలీసులు, ఈ ఘటనను తప్పుదోవ పట్టించేందుకు కేసులు నమోదు చేయడంలో మాత్రం అత్యుత్సాహం చూపించారు.

### గ్రామంలో కుల రక్కసి

ఈ గ్రామంలో దళితల పట్ల వివక్షకు అంతూ..పంతూలేదు. దశబ్దాల నుంచి కుల రక్కసి వెంటాడుతునే ఉంది. ఎందుకంటే ఎవరైనా దళిత కుటుంబానికి చెందిన వారు దుకాణాలకు వెళ్తే ఆమడ దూరంలోనే ఉంచి వస్తువులను విసురుతారు. అలాగే పెళ్లి వయస్సుకు వచ్చిన యువతులకు వస్తువులు విక్రయించేం దుకు కూడా నిరాకరించేవారు. ఆ గ్రామంలో 500 నుంచి 600 కుటుంబాలు నివసిస్తున్నాయి. అందులో దళిత వర్గానికి చెందినవి కేవలం 10 నుంచి 15 కుటుంబాలే ఉన్నాయి. మిగతా వారు ఠాకూర్, బ్రహ్మణ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలే. ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్న ఈ సామాజిక తరగతులు ఆధిపత్యం చెలాయిస్తూ వస్తున్నారు. ఠాకూర్లు, బ్రహ్మణ కుటుంబాలకు చెందిన ఇళ్లకు దూరంలో దళితుల ఇళ్లు ఉ ంటాయి. ఇవన్నీ దగ్గర దగ్గరే ఉన్నాయి. ఊరిలోని దళితులకు, మిగతావారికి మధ్య ప్రత్యక్ష సంబంధాలు పెద్దగా కనిపించవు. దళితులు దారిలో కనిపిస్తే ఠాకూర్లు దూరంగా జరుగుతారు. ఈ ఘటన తరువాత అగ్రవ ర్ణాలుగా పిలిచే వర్గాలకు చెందినవారు ఎవరూ బాధితురాలి ఇంటికి వచ్చి, ఓదార్చే ప్రయత్నాలు చేయలేదు. దళితులపై ఇలాంటి దాడి జరగడం ఇది మొదటిసారి కాదు. దళిత ఆడపిల్లలు, కోడళ్లు ఒంటరిగా పొలానికి వెళ్లాలంటే భయపడతారు. తల్లి, సోదరుడితో కలిసి వెళ్లినా, ఆ అమ్మాయి అలా బలైపోయింది. తమ జీవితాలను ఠాకూర్లు నరకంగా మార్చారని, గ్రామంలో ఎలా ఉండాలో తమకు పాలుపోవ డం లేదని దళితులు ఆందోళన పడుతున్నారు. దళితులకు దూరంగా ఉంటామని, అలాంటిది వాళ్లను ఎందుకు ముట్టుకుంటాం? వాళ్ల దగ్గరికి ఎందుకు వెళ్తాం?" అని ఠాకూర్ మహిళ చెప్పడంలో కులవివక్ష స్పష్టం అవుతున్నది.

### భయం గుప్పెట్లో బాధిత కుటుంబం

బాధితురాలి కుటుంబ సభ్యులు ఊరు విడిచి వెళ్ళే దయనీయమైన పరిస్థితి ఏర్పడింది. ఆ దళిత బిడ్డకు ఈ దారుణం జరిగిన తరువాత వారంతా భయం గుప్పిట్లో బతుకు తున్నారు. ఇక ఇక్కడ బతికేందుకు అవకాశ మేలేదని భావిస్తున్నారు. ఊరు విడిచి ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోయి, ఎవరైనా తమ బంధు వుల ఇంట్లో తలదాచుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ఘటన తరువాత ఆ కుటుం బానికి సాయం చేసేందుకు గ్రామంలోని ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. గ్రామంలోని ఎవ్వరూ పట్టించుకోకపోవడం ఆ కుటుంబాన్ని కుంగదీసింది. ఆ కుటుంబాన్ని గ్రామస్తులు పదే పదే నిందిస్తున్నారు. అందుకే గ్రామాన్ని వీడి వెళ్లిపోవాలని ఆ కుటుంబం నిర్ణయం తీసుకుంది.

### గతం నుంచే ప్రతీకార చర్యలు

బాధిత కుటుంబంపై గతం నుంచే ప్రతీకార చర్యలు కొనసాగుతున్నాయి. బాధితురాలి తాతయ్యకు, నిందితుడు సందీప్ కుటుంబానికి గతంలోనే వివిధ సందర్భాల్లో గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కింద సందీప్ తాతయ్య 2012లో జైలుకు కూడా వెళ్లాడు. దాన్ని మనసులో పెట్టుకొని, ఊరిలో ఆకతాయిగా పేరొందిన సందీప్ బాధితురాలిని టార్గెట్ చేస్తూ అల్లరి చేసేవాడు. అడ్డొచ్చిన ఆమె సోదరులను ఇబ్బంది పెట్టేవాడు. వీటిపై బాధితురాలి కుటుంబం గతంలో పలుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2015లో ఈ వ్యవహారాన్ని కోర్టు వరకు తీసుకెళ్లారు. అయితే ఆకతాయి సందీప్ ఏదో ఒక వంకతో బయటకొచ్చి, ప్రతీకార చర్యలు చేస్తుండేవాడు. సందీప్, లవ్‌కుశ్ బాధితురాలిని నెలల తరబడి వేధిస్తూ వచ్చారు. ఈ కేసులో ముగ్గురు నిందితుల కుటుంబాలు ఒకే పెద్ద ఉమ్మడి ఇంట్లో ఉ ంటున్నాయి. బాధితురాలి ఇంటికి ఇది కొద్దిగా దగ్గర్లోనే ఉంది. నిందితుడు సందీప్ ఇది వరకు కూడా అమ్మాయిలను వేధిస్తుండేవాడని ఠాకూర్ కుటుంబాలకు చెందిన మహిళలే జాతీయ మీడియాతో అన్నారు. "ఆ కుటుంబం అలాం టిదే. ఎప్పుడూ గొడవలు పెట్టుకుంటుంటారు. వారిది చాలా పెద్ద కుటుంబం. వాళ్లంతా కలిసే ఉంటారు. ఊరిలో వాళ్ల పెత్తనమే నడుస్తుంది. వారికి ఎవరూ ఎదురు మాట్లాడరు"

అని ఠాకూర్ కుటుంబాలకు చెందిన కొందరు యువకులు మీడియాతో అన్నారంటే..నిందితుల చరిత్ర స్పష్టం అవుతోంది.

**అంతర్జాతీయ సంఘీభావం**

హత్రాస్ బాధితురాలికి అంతర్జాతీయ సంఘీభావం లభించింది. దళిత యువతి అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ దేశ, విదేశాల్లో ఆందోళనలు జరిగాయి. హత్రాస్‌లో అమానుష ఘటనను ఖండిస్తూ అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, హాంకాంగ్, జపాన్, నెదర్లాండ్స్, స్వీడన్, స్లోవేనియా వంటి దేశాల్లోనూ నిరసన ప్రదర్శనలు జరిగాయి.

**రెచ్చిపోయిన బిజెపి ఐటీ సెల్**

హత్రాస్ ఘటనపై బిజెపి ఐటీ సెల్ రెచ్చిపోయింది. బిజెపి అధికారిక పేజీలలోనే కాకుండా, అనధికారిక పేజీల్లో బిజెపి ఐటి సెల్‌కు చెందిన వారు తప్పుడు రాతలు, వీడియోలతో నానాయాగీ చేశారు. బిజెపి ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ ట్వీట్‌పై జాతీయ మహిళా కమిషన్ దర్యాప్తు చేసేందుకు నిర్ణయించింది. ఆయన కొన్ని రోజులు పాటు హత్రాస్ ఘటనపైనే ట్వీట్లు చేస్తూ వచ్చారు. అయితే అందులో ఒక ట్వీట్ ఆధారంగా ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అక్టోబర్ 2న అమిత్ పోస్ట్ చేసిన వీడియో అందుకు కారణమైంది. సాధారణంగా లైంగిక హింస కేసుల్లో బాధితురాలి ముఖం, మిగతా వివరాలను గోప్యంగా ఉంచుతారు. కానీ ఈ వీడియోలో బాధితురాలి ముఖం స్పష్టంగా కనిపిస్తోంది. వీడియోను ఇలా షేర్ చెయ్యడం చట్టవిరుద్ధమని, దురదృష్టకరమని నేషనల్ ఉమెన్స్ కమిషన్ పేర్కొంది. భారతీయ శిక్షాస్మృతి ప్రకారం లైంగిక హింస కేసుల్లో బాధితుల గుర్తింపును ఎవరైనా బహిరంగ పరిస్తే వారికి రెండేళ్ల వరకూ జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. 2018లో సుప్రీంకోర్టు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది.

**వక్రీకరణలతో కూడిన విష ప్రచారం**

సోషల్ మీడియా వేదికగా బాధిత కుటుంబం చుట్టూ వక్రీకరణలతో కూడిన విష ప్రచారం జరుగుతున్నది. నిందితుల తరపున సోషల్ మీడియా పోకిరీలు రెచ్చిపోయి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియా, వార్తా ఛానెళ్లలో బాధిత యువతి మాట్లాడిన వీడియో ఒకటి బాగా ప్రచారమైంది. ఘటన జరిగిన తరువాత బాధితురాలిని వారి కుటుంబ

> **"హత్రాస్ ఘటనపై బిజెపి ఐటీ సెల్ రెచ్చిపోయింది. బిజెపి అధికారిక పేజీలలోనే కాకుండా, అనధికారిక పేజీల్లో బిజెపి ఐటి సెల్‌కు చెందిన వారు తప్పుడు రాతలు, వీడియోలతో నానాయాగీ చేశారు. హత్రాస్ కేసును తల్లకిందులు చేయటానికి ప్రభుత్వం, సంఘ్ పరివార్, అగ్రకులాలకు చెందినవారిని కూడగట్టి ప్రచారం చేస్తున్నాయి."**



హత్రాస్ ఘటనకు నిరసనగా ఢిల్లీలో భారీ ర్యాలీ

సభ్యులు పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లినప్పుడు ఆ వీడియో తీశారు. "సందీప్ నా గొంతు నొక్కాడు" అని బాధితురాలు ఆ వీడియోలో చెప్పింది. "బలవంతం చేస్తుంటే, నేను అంగీకరించ లేదు" అని ఆమె అన్నారు. బాధితురాలి తమ్ముడు పేరు కూడా సందీప్ కావడంతో నిందితుల తరపున సోషల్ మీడియా పోకిరీలు ఆమె తమ్ముడే హత్య చేశాడని వక్రీకరణలతో కూడిన విష ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ఘటన జరిగినప్పుడు బాధితురాలి తమ్ముడు సందీప్ నోయిడాలో ఉన్నాడు. ఘటన జరిగిందని తెలుసుకొని ఆసుపత్రికి వెళ్లాడు. ఈ కనీస సమాచారాన్ని కూడా తెలుసుకోకుండా కొంత మంది బాధితురాలి కుటుంబంపై అభాండాలు వేస్తున్నారు.

**భయంతో స్థానిక మీడియా మౌనం**

ఈ ఘటనను కవరు చేసేందుకు స్థానిక మీడియా ప్రతినిధులు కూడా పెద్దగా సాహసం చేయలేకపోయారు. ఎందుకంటే బలమైన సామాజిక వర్గానికి చెందిన ఠాకూర్లు ఏమైనా చేస్తారేమోనని భయంతో, రిస్క్ తీసుకోవడం ఎందుకని మౌనం దాల్చారు. అయితే ఢిల్లీ నుంచి జాతీయ మీడియా అక్కడికి చేరుకోవడంతో ఈ ఘటన బట్టబయలయింది. లేకపోతే దీన్ని పోలీసులు, అధికారులు, అగ్రకుల నాయకులు తొక్కిపెట్టేవారు.

**నిందితులకు మద్దతుగా బిజెపి**


ఒకవైపు బాధితురాలికి జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ నిరసన ప్రదర్శనలు జరుగుతుంటే, మరోవైపు నిందితులకు మద్దతు తెలుపుతూ కొన్ని అగ్రవర్ణ సంఘాలు ఆ గ్రామానికి చేరుకున్నాయి. కర్ణిసేన తమ బృందాన్ని ఆ గ్రామానికి పంపించింది. సవర్ణ సమాజ్‌కు చెందిన కొన్ని బృందాలు నిందితులకు అండగా గ్రామంలో బైఠాయించాయి. మాజీ బిజెపి ఎమ్మెల్యే రాజ్‌వీర్ సింగ్ పేహల్వాన్ నివాసంలో అగ్రవర్ణ సంఘాలతో సమావేశం అయింది. బాధితురాలి గ్రామానికి 8-9 కిలో మీటర్ల దూరంలో వందలాది మంది పోలీసులు భద్రత నడుమ ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బాధిత కుటుంబంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధంగా హత్రాస్ కేసును తల్లకిందులు చేయటానికి ప్రభుత్వం, సంఘ్ పరివార్, అగ్రకులాలకు చెందినవారిని కూడగట్టి ప్రచారం చేస్తున్నాయి.

❋

ఈ మాసం ప్రత్యేకం

# బడా పెట్టుబడిదారుల కోసమే వ్యవసాయ చట్ట సవరణలు

ప్రీతమ్ సింగ్



రచయిత బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ ఉల్ఫ్‌సన్ కాలేజీ విజిటింగ్ స్కాలర్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వ్యవసాయ మార్కెట్ సంస్కరణలు వ్యవసాయంలో కేంద్రీకృత విధానాలను అమలు జరపాలనే భారతీయ జనతా పార్టీ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయి. రైతులు, అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు, ప్రాంతీయ రాజకీయ పార్టీలు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వైఖరిని వ్యతిరేకిస్తున్నాయి. ఈ విధానాలను వ్యవసాయరంగానికి పెనువవాలుగా భావిస్తున్నాయి. ఈ సంస్కరణల కారణంగా పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందనే అంశాన్ని పూర్తిగా విస్మరించారు.

భారత ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ సంస్కరణల పేరుతో 2020 జూన్ 5న మూడు ఆర్డినెన్సులను తీసుకు వచ్చింది. రైతు (సాధికార, రక్షణ) లకు మద్దతుధరలు, వ్యవసాయ సేవల ఆర్డినెన్సు 2020, రైతుల ఉత్పత్తి వర్తక వాణిజ్య (అభివృద్ధి, సానుకూలత) ఆర్డినెన్సు 2020, నిత్యావసర వస్తువుల (సవరణ) ఆర్డినెన్సు 2020లను ప్రభుత్వం జారీచేసింది. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన ధరలు, వ్యాపారానికి చెందిన ఈ ఆర్డినెన్సులను భారత పార్లమెంటు ఆమోదం లభించాక, రాష్ట్రపతి ఆమోదించారు. ఇటువంటి విధానాలతో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వ వ్యవసాయ రంగాన్ని నియంత్రించాలనుకుంటోంది. ఈ విధానాలకు మూడు వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమౌతున్నది. వ్యవసాయ వ్యాపారంలో కార్పొరేట్లు అడుగు పెడితే రైతు ఉత్పత్తులకు, వారి మనుగడకు భంగం కలుగుతుందనే భయంతో రైతులు వ్యతిరేకించారు. వ్యవసాయంలో కేంద్రం పెత్తనం పెరిగి రాష్ట్రాల హక్కులకు భంగం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ప్రాంతీయ ప్రజల ఆలోచనలను, ఆశలను దెబ్బతీయడంతో పాటు ఈ చట్టాల ద్వారా కేంద్రానికి సంక్రమించే అధికారంతో తమకు నష్టం జరుగుతుందని ప్రాంతీయ పార్టీలు అభిప్రాయపడ్డాయి.

తొలుత హడావిడిగా ఆర్డినెన్సులు, అనంతరం బిల్లులు తీసుకురావడంలో ఈ సమస్యపై ప్రభుత్వ ఆర్థిక, రాజకీయ ఎజెండా ఏమిటో తేటతెల్లమవుతోంది. కోవిడ్-19 కారణంగా ఏర్పడిన పరిస్థితులను అసరాగా చేసుకుని ఈ చట్టాలు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం హడావిడి పడిందని అర్థమవుతున్నది. ఈ చర్యల కారణంగా రైతాంగంలో ఇంతటి తీవ్ర వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వం ముందుగా ఊహించలేదు.

పార్లమెంటరీయేతర పద్ధతులలో వ్యక్తమౌతున్న వ్యతిరేకత, దానికి ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందన్నది వ్యవసాయార్థిక వ్యవస్థపై మాత్రమే కాక, దేశంలోని ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, బహుళత్వాలపై నిర్ణయాత్మక ప్రభావం చూపుతుంది. బిల్లుల ఆమోదం పొందిన అనంతరం ప్రతిపక్షాలు, రైతాంగం చురుకుగా తమ వ్యతిరేకత తెలియజేసి ప్రతిఘటించాయి. కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్ లోని రాష్ట్ర ప్రభుత్వాలు చట్టపరంగా సుప్రీం కోర్టులో సవాలు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. వ్యవసాయం రాష్ట్రాలకు సంబంధించిన అంశమని, ఆ అంశంపై చట్టాలు చేయటానికి కేంద్రానికి ఎలాంటి హక్కు లేదని ఈ చట్టాలు భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నాయని కోర్టు స్పష్టం చేస్తే సమస్య మరోరకమైన ప్రాధాన్యతను సంతరించుకుం టుంది.

## రైతులు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

రైతులకు (సాధికార, రక్షణ) మద్దతు ధరలు, వ్యవసాయ సేవల ఆర్డినెన్సు 2020, రైతుల ఉత్పత్తి వర్తక వాణిజ్య (అభివృద్ధి, సానుకూలత) ఆర్డినెన్సు 2020, నిత్యావసర వస్తువుల (సవరణ) ఆర్డినెన్సు 2020లను తీసుకురావడం ద్వారా వ్యవసాయ వ్యాపారంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించి, స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థల ప్రమేయాన్ని పెంచడం కేంద్రం లక్ష్యంగా ఉంది. వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, దేశంలో, విదేశాల్లో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌లలో ప్రైవేటు వారిని ప్రోత్సహించడాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కొద్దికాలంగా వ్యవసాయ వ్యాపారంలో బహుళజాతి సంస్థలు, కార్పొరేట్ల ప్రవేశం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) కోసం ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇప్పటికే భారత వ్యవసాయ రంగంలో, ప్రత్యేకించి కొన్ని ఉత్పత్తులకు సంబంధించి కాంట్రాక్టు వ్యవసాయంలో కొంతమేరకు ఎఫ్‌డిఐలు అడుగుపెట్టాయి. అయితే ఈ చట్టాలు చేయడంతో వ్యవసాయంలో విదేశీ పెట్టుబడులకు పెద్ద ప్రోత్సాహం లభించింది. ఈ చట్టాలలో మార్కెటింగ్ సంస్కరణలు చాలా కీలకమైన అంశాలుగా ఉన్నాయి.

ఈ ప్రయత్నాలకు ప్రభుత్వం చెబుతున్న అర్థం భిన్నంగా ఉంది. రైతులు తమ ఉత్పత్తులను నోటిఫై చేసిన ఎపిఎంసి (వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ)ల వద్ద మాత్రమే కాకుండా స్వేచ్ఛగా అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెబుతున్నది. రైతాంగం చేత ఈ విధానాన్ని ఆమోదింపచేయటం కోసం ప్రచారం సాగిస్తున్నది. ఈ చట్టాల వల్ల దేశంలోని, విదేశాల్లో ఉన్న వ్యవసాయ వ్యాపారం సాగించే కార్పొరేట్లకు మాత్రమే నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది. చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతాంగం తీవ్రంగా నష్టపోతారు. వారికి బేరసారాలు సాగించే శక్తి పూర్తిగా సన్నగిల్లిపోతుంది. తాము కోరుకున్న ధరను పొందడం కన్నా పెద్ద కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తే ఆర్థిక బానిసలుగా మారే స్థితి ఏర్పడుతుంది.

వ్యవసాయ ఉత్పత్తుల వర్తక, వాణిజ్య (అభివృద్ధి, సానుకూలత) చట్టం 2020 ప్రకారం గోధుమలు, బియ్యం, చెరకు, పత్తితో

పాటు ఇతర ఉత్పత్తులు ఈ పరిధిలోకి వస్తాయి. దేశంలో పెద్ద ఎత్తున ఆహారాన్ని ఉత్పత్తిచేసే రెండు ప్రధాన రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాల్లో ఇవే ప్రధాన వ్యవసాయ ఉత్పత్తులు. ఈ చట్టంలో రైతుకు (ప్రత్యేకించి సన్నకారు, చిన్న, మధ్యతరగతి రైతు) , వ్యాపారికి మధ్య "వివాద పరిష్కారం" చాలా తీవ్రమైనది. ఈ వివాద పరిష్కారాలకు పరిపాలనాపరమైన / న్యాయ ప్రకియ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ స్థాయిలోనే ఆరంభమవుతుంది.

పరిమితమైన వనరులు, పరిజ్ఞానం, తగినంత సమయం ఉండని రైతుకు అన్యాయం జరిగినప్పటికీ ఖరీదైన లాయర్లను పెట్టుకునే శక్తిగల బలమైన కార్పొరేట్ వ్యాపార సంస్థలను న్యాయపరంగా సవాలు చేయలేడు. చట్టంలో పేర్కొన్న అపరాధ రుసుం కూడా మరో సవాలుగా రైతుకు కనిపిస్తుంది. బలమైన ఆర్థిక పుష్టిగల కార్పొరేట్ సంస్థలను ఎదుర్కొనేందుకు రైతు తీవ్రంగా భయపడడమే కాక అపరాధ రుసుంను కూడా చెల్లించలేడు. అపరాధరుసుం 25,000 నుంచి 10,00,000 రూపాయల వరకు ఉంటుంది. అది చెల్లించలేని పరిస్థితుల్లో రోజుకు 5,000 నుంచి 10,000 రూపాయల వరకు దానిపై పెనాల్టీ చెల్లించాలి. కాబట్టి చిన్న రైతుల సంగతి అలా ఉంచితే పెద్ద రైతులు కూడా పెద్ద కార్పొరేట్ కంపెనీలతో వివాదాలకు దిగే సాహసం చేయరు.

**కనీస మద్దతు ధర**

ఈ చట్టాలలో ఎక్కడా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ప్రస్తావన లేదు. ప్రధానంగా గోధుమ, బియ్యం పండించే పంజాబ్, హర్యానాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా పండిస్తారు. వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారంలోని సంస్థలు, ప్రాసెసర్లు, హోల్‌సేల్ అమ్మకం, ఎగుమతిదారులు, పెద్ద రిటైల్ వ్యాపారులు, రైతులకు మధ్య జరిగే ఒప్పందం "గిట్టుబాటు ధర"కు సంబంధించి మాత్రమే ఉంది. ఆ ఒప్పందంలో రైతులు అమ్మే తమ ఉత్పత్తుల "నాణ్యత, అంతరాలు, నిర్దిష్టత" గురించి మాత్రం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఒప్పందంలో మార్పులు, రద్దు చేసుకోవడానికి సంబంధించిన అంశాలపై వాడిన పదాలు రైతుల భయాలను మరింతగా పెంచేవిగా ఉన్నాయి. సెక్షన్ 11 ప్రకారం "రైతు ఒప్పందంలోకి అడుగిడిన అనంతరం ఏ సమయంలోనైనా, ఏ కారణంతోనైనా ఒప్పందంలోని ఇరు పార్టీల ఆమోదంతో ఒప్పందాన్ని మార్చుకోవచ్చు, రద్దు చేసుకోవచ్చు". రైతు, వ్యవసాయ వ్యాపార సంస్థ ఇద్దరూ సమ ఉజ్జీలు

> **"సెక్షన్ 11 ప్రకారం "రైతు ఒప్పందం లోకి అడుగిడిన అనంతరం ఏ సమయం లోనైనా, ఏ కారణంతోనైనా ఒప్పందంలోని ఇరు పార్టీల ఆమోదంతో ఒప్పందాన్ని మార్చుకోవచ్చు, రద్దు చేసుకోవచ్చు". రైతు, వ్యవసాయ వ్యాపార సంస్థ సమ ఉజ్జీలు కానందువలన ఇలాంటి నిబంధన వల్ల ఒప్పందంలో మార్పు లేదా రద్దు చేసుకోవడంతో ఆర్థికంగా, ఇతర రకాలుగా రైతులు నష్టపోతారు"**



రైతు వ్యతిరేక చట్టాలకు నిరసనగా పంజాబ్ రైతుల భారీ ప్రదర్శన

కానందువలన ఇలాంటి నిబంధన వల్ల ఒప్పందంలో మార్పు లేదా రద్దు చేసుకోవడంలో ఆర్థికంగా, ఇతర రకాలుగా రైతుపై వత్తిడి అధికంగా ఉంటుంది. వివాద పరిష్కార విషయంలో ఒప్పందంలో పేర్కొన్న ఉత్పత్తికి సంబంధించి ధర, నాణ్యత అన్ని వేళలా రైతుకు వ్యతిరేకంగానే ఉంటుంది.

ఒకసారి కనీస మద్దతు ధర రద్దు చేసినట్టు ప్రచారం జరిగితే రైతాంగంలో, ప్రత్యేకించి గోధుమ, వరి పండించే, సేకరించే రాష్ట్రాలు, ప్రభుత్వ సేకరణ లక్ష్యాలు ప్రమాదంలో పడతాయి. ఫలితంగా ఆహారభద్రతకు అవరోధం ఏర్పడుతుంది. ఆహార కొరత ఉన్న రాష్ట్రాల్లో అశాంతి ప్రబలుతుంది. ప్రభుత్వ అధికార ప్రతినిధులు నష్టనివారణ చర్యలు చేపట్టడంలో భాగంగా కనీస మద్దతు ధర కొనసాగుతుందని ప్రకటనలు చేస్తారు. కీలకమైన కారణాల రీత్యా కనీస మద్దతు ధర ఉంటుందని ఈ ప్రకటనలు తాత్కాలికంగా ఉపశమనం కలిగించినా అది కేవలం ప్రభుత్వం తన సేకరణ లక్ష్యాలను పరిపూర్తి చేసుకునేందుకు మాత్రమే పరిమితం చేసుకుంటుందని స్పష్టమౌతున్నది. ఒకసారి ఈ లక్ష్యాలను చేరుకుంటే ప్రభుత్వానికి ధాన్యం సేకరించాల్సిన అవసరం ఉండదు. ఎక్కువ కొనాల్సిన పనిలేదు. దీనివల్ల రైతులకు మద్దతు ధరల కోసం చేసిన ఈ ఏర్పాటు లేకుండా పోతుంది. సేకరణ లక్ష్యాలను మించి ఉన్న వ్యవసాయ ఉత్పత్తుల ధరల్లో తీవ్రమైన వ్యత్యాసం తలెత్తడమే కాకుండా, మార్కెట్ ధరలు దారుణంగా తగ్గిపోయే అవకాశం ఏర్పడుతుంది.

ఇది తక్షణ వాస్తవం కాకపోయినప్పటికీ, ఆరంభంలో కొన్నేళ్ల పాటు రైతులకు ఎపిఎంసి మార్కెట్లలో లభించే ధర కంటే అధికంగా చెల్లించటం కోసం కేంద్ర ప్రభుత్వం పెద్ద వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారులకు ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఒక్కసారి ఎపిఎంసి వ్యాపార నిర్మాణం కుప్పకూలిపోయాక కొనసాగే తీవ్రమైన పోటీ ఫలితంగా రైతులు పూర్తిగా పెద్ద వ్యాపారుల దయపై ఆధారపడి బతకాల్సి వస్తుంది. వారి దోపిడీతో రైతుల నిస్సహాయ స్థితి మరింతగా పెరుగుతుంది.

ప్రభుత్వం తీసుకుంటున్న పలు చర్యల గురించి నేను గమనించిన అధ్యయనంలో వ్యవసాయ రంగానికి సంబంధించి వారి లక్ష్యం సన్న, చిన్నకారు రైతుల ఆర్థిక స్వావలంబనను దెబ్బతీసి, వారి భూములను స్వదేశీ, విదేశీ పెద్ద వ్యవసాయ, వ్యాపార కార్పొరేషన్లకు కట్టబెట్టేందుకు సాగిస్తున్న ప్రయత్నంలా కనిపిస్తున్నది. ఆ రైతులు కాలక్రమంలో తమ

**" 1949లో రాజ్యాంగాన్ని రూపొందించిన నాటి నుంచి అనేక సవరణలు జరిగాయి. వ్యవసాయంపై కేంద్రం నిరంతరం తన దాడిని కొనసాగిస్తునే ఉంది. రాజ్యాంగం వ్యవసా యాన్ని రాష్ట్రాల జాబితాలో చేర్చింది. నిత్యావసర వస్తువుల (సవరణ) చట్టం 2020 వ్యవసాయంపై రాష్ట్రాలకున్న హక్కులపై దాడికి పూనుకున్నది. భారత ప్రభుత్వం చేస్తున్న "ఒకేదేశం, ఒకే వ్యవసాయ మార్కెట్" అనే నినాదంలో కేంద్రీకృత లక్ష్యం అంతర్లీ నంగా దాగి ఉన్నదనే విషయం స్పష్టమవుతున్నది. "**

భూములు కోల్పోయి రోజుకూలీలుగా మారిపో తారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థలో అలా తయారైన అదనపు కార్మికులు తమ ఆర్థికావసరాల కోసం పట్టణ ప్రాంతాలకు ఉపాధిని వెతుక్కుంటూ తరలి వెళతారు. దాంతో పట్టణ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో కార్మికులు అందుబాటులో ఉ ండడంతో కూలీరేట్లు తగ్గిపోతాయి. దాంతో గ్రామీణ, పట్టణ పెట్టుబడిదారులు అధిక లాభాలను పొందుతారు. "వ్యవసాయంలో మార్పులు" తీసుకురావడం కోసం తాజా చొరవ వెనుక దాగిన అసలు సత్యం ఇదే.

ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ రైతులు పెద్ద ఎత్తున ఆందోళన సాగించడమే కాక సెప్టెంబరు 25న భారత్ బంద్ పాటించారు. 2019లో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఎదుర్కొన్న అతి పెద్ద రాజకీయ సవాలు ఇదే. ఈ విషయంలో కూడా ప్రభుత్వం రైతుల ఉ ద్యమాన్ని అణిచివేసేందుకు, రైతు సంఘాలను తొక్కిపెట్టేందుకు ఇతర రాజకీయ ప్రత్యర్థులను అణచడానికి ఉపయోగించిన పద్ధతినే అనుస రించే వీలుంది. తమను వ్యతిరేకించే వామపక్ష వాదులను నక్సలైట్లని, ముస్లింలైతే ''టెర్రరిస్టులని'', పంజాబీలైతే "ఖలిస్తాన్‌వాదులని" అణిచే ప్రయత్నం చేస్తుంది. ఇప్పటికే ప్రభుత్వ అనుకూలురైన వ్యక్తులు రైతు ఉద్యమకారులను నక్సలైట్లు, టెర్రరిస్టులని ప్రచారం సాగిస్తున్నారు. ఇది ప్రభుత్వ వ్యూహాన్ని ప్రతిబింబిస్తున్నది. ఏదిఏమైనప్పటికీ రైతుసంఘాలు చేస్తున్న ఉద్యమానికి అన్ని రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ప్రజల మద్దతు లభించడం వల్ల ప్రభుత్వానికి అలాంటి అవకాశం లభించకపోవచ్చు. కనుక ప్రభుత్వం కేవలం ఎంపిక చేసిన వామపక్ష రైతు ఉ ద్యమకారులను లక్ష్యం చేసుకుని వారిని నక్సలైట్లని, నక్సలైట్ల మద్దతుదారులని ముద్రవేసే ప్రయత్నం చేయవచ్చు. విస్తృతంగా సాగుతున్న రైతు ఉద్యమంపై ప్రభుత్వం సాగించే ఇలాంటి దమన చర్యలు రైతులు, సంఘాల మధ్య సంఘీభావానికి, రాజకీయ పరిణితికి పరీక్షగా నిలుస్తాయి.

### రాష్ట్రాలు ఎందుకు భయపడుతున్నాయి?

1949లో రాజ్యాంగాన్ని రూపొందించిన నాటి నుంచి అనేక సవరణలు జరిగాయి. వ్యవసాయంపై కేంద్రం నిరంతరం తన దాడిని కొనసాగిస్తునే ఉంది. రాజ్యాంగం వ్యవసా యాన్ని రాష్ట్రాల జాబితాలో చేర్చింది. నిత్యావసర వస్తువుల (సవరణ) చట్టం 2020 వ్యవసాయంపై రాష్ట్రాలకున్న హక్కులపై దాడికి పూనుకున్నది. భారత ప్రభుత్వం చేస్తున్న "ఒకేదేశం, ఒకే వ్యవసాయ మార్కెట్" అనే నినాదంలో కేంద్రీకృత లక్ష్యం అంతర్లీనంగా దాగి ఉన్నదనే విషయం స్పష్టమవుతున్నది.

ఇటీవలకాలంలో కొందరు, మేధావులు, జర్నలిస్టులు వెలిబుచ్చుతున్న అభిప్రాయాలు, జరుగుతున్న తప్పుడు ప్రచారం వలన వ్యవసాయ రంగంలో సంస్కరణల పేరిట జరిగే ప్రైవేటీకరణ వల్ల వికేంద్రీకరణ జరిగి రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు దఖలు పడతాయనే తప్పుడు భావాలను వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించ టానికి వ్యూహాత్మకంగా బహుళ జాతీయ వాదానికి వ్యతిరేకంగా ఏకీకృత జాతీయవా దానికి ప్రధాన స్థానం ఇచ్చారని గుర్తించటంలో వైఫల్యం చెందటమే ఈ పొరపాటు అభిప్రాయా నికి కారణం. ఫలితంగా కేంద్రీకృత విధానా లనువ్యతిరేకించకుండా సంస్కరణల పేరిట నియంత్రణలను వదిలేసి ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తారు. ప్రైవేటీకరణ, కేంద్రీకరణ భారతదేశంలో కలిసి పయనిస్తాయని అవి ఒకదానినొకటి బలోపేతం చేసుకుంటాయని నిత్యావసర వస్తువుల (సవరణ) చట్టం 2020 మరింతగా స్పష్టం చేస్తున్నది.

రైతుల ఉత్పత్తి వర్తక వాణిజ్య (అభివృద్ధి, సదుపాయాల) చట్టం 2020లోని సెక్షన్ 12లో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని పరిమితం చేయడమే కాక మొండిగా దాడిచేసేందుకు వీలైన అంశాలను చొప్పించారు. ఈ చట్టంలోని అంశాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం చేసే సూచనలు, ఆదేశాలు లేదా జారీ చేసే మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వంలోని ఏ అధికారి లేదా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఏ అధికారి అయినా తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. పరిమితమైన రాజకీయ దృష్టితో రాష్ట్రాల స్థాయిలో రాజకీయ నాయకత్వం కేంద్ర ఆదేశాలను ఖాతరు చేయకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కొనాల్సి వస్తుంది.

ధరల హామీ రైతు సేవలను ఉద్దేశించిన రైతుల (సాధికార, రక్షణ) ఒప్పంద చట్టం 2020లో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని పణంగా పెట్టే పదాలు అంతర్లీనంగా ఇమిడి ఉన్నాయి. చట్టంలోని అంశాలను మరింత సమర్థ వంతంగా అమలుచేసేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇచ్చే ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.

కేంద్ర ఆదేశాలను అమలుచేయకుండా తప్పించుకునేందుకు ఎలాంటి ఆస్కారం ఇవ్వలేదు.

రాష్ట్రాలకు ఆదాయాన్ని తెచ్చిపెట్టేందుకు ఎలాంటి అవకాశం లేకుండా చేశారు. రాష్ట్ర ఎపిఎంసి చట్ట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం "మార్కెట్ ఫీజు, సెస్, లెవీ" వసూలు చేసేందుకు వీల్లేకుండా రైతుల ఉత్పత్తి వర్తక వాణిజ్య (అభివృద్ధి, రక్షణ) చట్టం 2020 లోని ఆంశాలు దెబ్బతీస్తాయి. రాష్ట్రాలు గతంలో ఆదాయం పొందేందుకు ఉన్న అమ్మకం పన్నుకు బదులుగా కేంద్రం నియంత్రణలో వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) విధించి అమ్మకం పన్ను ద్వారా రావలసి వాటా ఇస్తామని చెప్పింది. ఇప్పుడు రాష్ట్రాలు మరింత బలహీనపడి ఆర్థికంగా కేంద్రంపై ఆధారపడేందుకు ఈ రకమైన ఎత్తుగడ వేశారు.

ఇప్పటికే కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న ఉ ద్రిక్తతలకు తోడుగా వ్యవసాయ సంస్కరణల పేరిట మరింత ప్రమాదకరమైన రీతిలో ఉ ద్రిక్తతలు పెరిగేందుకు అవకాశం ఉంది. వ్యవసాయాధార రాష్ట్రాలైన పంజాబ్, హర్యా నాలు ఎంఎస్‌పి నిర్మాణం బలహీన పడడం వల్ల చాలా ఘోరంగా నష్టపోయే అవకాశా లున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలైన గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల బడా వ్యాపారుల ప్రయోజనాలు (ప్రత్యేకించి వ్యవసాయ వ్యాపారంలో ఉన్నవారు) ఇతర రాష్ట్రాలకు చెందిన ఆహారధాన్యాలు, ఇతర ఉ

త్పత్తులు అందుబాటులో ఉండడం వల్ల లబ్ది పొందుతారు. దీనివల్ల ప్రాంతీయ, వర్గ ఉద్రిక్తతలు పెరుగుతాయి.

> **" బిజెపి, కాంగ్రెస్ పార్టీల మధ్య ఎన్ని రకాల విభేదాలున్నప్పటికీ భారత జాతీయ గుర్తింపు విషయంలో తమ రాజకీయ లక్ష్యాలకు సంబంధించి రెండూ కేంద్రీకృత వైఖరితోనే ఉన్నాయి. రెండూ ప్రాంతీయ అభిలాషలను వ్యతిరేకిస్తాయి. ఏది ఏమైనప్పటికీ కేంద్రీకరణపై కాంగ్రెస్ కంటే బిజెపి దూకుడు వైఖరితో ఉన్నదని స్పష్టమవుతున్నది. "**

### ప్రాంతీయ ఆశలు / గుర్తింపు

వ్యవసాయానికి సంబంధించిన హక్కులలో కేంద్రం జోక్యం చేసుకోవడాన్ని రాష్ట్రాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాలు మాత్రం కేంద్ర ప్రభుత్వ చర్యలను చూస్తూ మౌనం వహిస్తున్నాయి. ప్రాంతీయ ప్రయోజనాలు, ఆశలు, లక్ష్యాలు, గుర్తింపునకు ఈ పెరుగుతున్న కేంద్రీకృత విధానాలు తీవ్ర విఘాతం కలిగి స్తాయని భావిస్తు న్నాయి. బిజెపికి గతం నుంచి మిత్రులుగా ఉన్న శివ సేన, శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఎడి) లతో సంబంధాలు ప్రమాదం లో పడ్డాయి. కేంద్రీకృత హిందూత్వ సైద్ధాంతిక ధోరణులు, ప్రాంతీయ అభిలాషలకు మధ్య వివిధ రకాల ఉద్రిక్తతలు చోటు చేసుకుంటు న్నాయి. ఈ ఉద్రిక్తతల కారణంగానే కేంద్ర క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్న ఎస్ఎడి ప్రతినిధి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ రాజీనామా చేశారు. ఒక విధానపరమైన అంశంపై బిజెపి ప్రభుత్వం నుంచి చేసిన తొలి రాజీనామా ఇది. హర్యానాలోని సంకీర్ణ ప్రభుత్వంలో భాగ స్వామిగా ఉన్న ప్రాంతీయ పార్టీ జననాయక్ జనతా పార్టీ నాయకుడు దుష్యంత్ చౌతాలా సంక్షోభాన్ని ఎదుర్కొనాల్సి వస్తుంది. రైతు సంఘాల వత్తిడి కారణంగా సంకీర్ణంలోని ఉపముఖ్యమంత్రి పదవిని వదులుకోవాల్సి వస్తుంది. చౌతాలా ఇప్పటికే వ్యవసాయ చట్టాలపై రైతులకు అనుకూలంగా ప్రచారం చేస్తున్నారు.



రైతు వ్యతిరేక బిల్లులకు నిరసనగా పార్లమెంటువద్ద ప్రతిపక్ష సభ్యుల ప్రదర్శన

బిజెపి, కాంగ్రెస్ పార్టీల మధ్య ఎన్ని రకాల విభేదాలున్నప్పటికీ భారత జాతీయ గుర్తింపు విషయంలో తమ రాజకీయ లక్ష్యాలకు సంబంధించి రెండూ కేంద్రీకృత వైఖరితోనే ఉన్నాయి. రెండూ ప్రాంతీయ అభిలాషలను వ్యతిరేకిస్తాయి. ఏది ఏమైనప్పటికీ కేంద్రీకరణపై కాంగ్రెస్ కంటే బిజెపి దూకుడు వైఖరితో ఉన్నదని స్పష్టమవుతున్నది.

వ్యవసాయ విధానాలకు సంబంధించి "ఒక దేశం ఒక వ్యవసాయ మార్కెట్" అనే నినాదంతో తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలు, ప్రాంతీయ భాషలపై హిందీ పెత్తనాన్ని రుద్దడం (కాంగ్రెస్ చాలా ముందు తన పాలనాకాలంలో కూడా చేసింది) జమ్ము కాశ్మీర్‌కున్న రాజ్యాంగ హక్కును, రాష్ట్రస్థాయిని రద్దు చేయడం, నూతన విద్యావిధానం తదితర ముఖ్యమైన అంశాల్లో బిజెపి కేంద్రీకరణ వైఖరిపై దూకుడుతో ఉన్నదని తెలుస్తున్నది.

ప్రాంతీయ గుర్తింపును బిజెపి సందేహాస్పదంగా చూడడమే కాక తమ హిందూత్వ ఎజెండాకు హాని కలిగించేదని భావిస్తున్న కారణంగా బిజెపి ప్రాంతీయ గుర్తింపును లేకుండా చేసేందుకు చూస్తున్నదని రాష్ట్రాలు భావిస్తున్నాయి. రాష్ట్రాలతో తలెత్తిన ఉద్రిక్తతలు – విభిన్న ప్రాంతీయ గుర్తింపుల భావనలు – వ్యవసాయ చట్టాలపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరితో పాటు బిజెపి ఏకీకృత హిందూత్వ ఎజెండా పట్ల రాష్ట్రాలకు గల భయాన్ని మరింత పెంచుతున్నది.

### పర్యావరణ ప్రమాదం

మూడు వ్యవసాయ చట్టాల వల్ల కలిగే ప్రధాన సమస్యలను చర్చించాం. అన్నింటికంటే ముఖ్యమైనది ఈ చట్టాల అమలు వల్ల పర్యావరణానికి నష్టం జరుగుతుంది. ప్రస్తుత చర్చలో ఈ వైపు పరిశీలించడం పూర్తిగా విస్మరిస్తున్నారు. స్థానికంగా రాష్ట్రాల్లో వ్యవసాయాన్ని విధ్వంసం చేయడం భారతదేశం, ప్రపంచ వ్యవసాయ మార్కెటింగ్ విధానాలను రూపకల్పన చేయడంతో రవాణా పెరుగుతుంది. రవాణా పెరగడంతో అన్ని చోట్లా కర్బన ఉద్గారాలు, కాలుష్యం, పర్యావరణ విధ్వంసంతో జీవరాసులు, మనుషుల ఆరోగ్యం దెబ్బతింటుంది. స్వయం సమృద్ధి పేరిట ఈ ప్రభుత్వం ప్రకటనలతో చేస్తున్న పిచ్చిపని వల్ల అందుకు వ్యతిరేక ఫలితాలు లభిస్తాయి.


అదే సమయంలో వ్యవసాయాన్ని "అభివృద్ధి" చేసేందుకు విస్తృతస్థాయిలో పునరాలోచన చేయాల్సిన అవసరం ఉంది.

(మిగతా 27వ పేజీలో)

చరిత్ర

# హరప్పా ప్రజలే భారతీయుల మూలవాసులు

ప్రొ. డేవిడ్ రీచ్



**(అమెరికాలోని హార్వర్డ్ యూనివర్శిటీలో స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డేవిడ్ రీచ్‌తో పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా ఛైర్ పర్సన్ జియన్ దేవి ఇటీవల చేసిన ఆన్‌లైన్ ఇంటర్వ్యూను దిగువ ఇస్తున్నాం.... సంపాదకుడు)**

డేవిడ్ రీచ్ ఒక జన్యుశాస్త్ర మేధావి. హార్వర్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. దీర్ఘకాల పరిశోధనల ఫలితంగా అసాధారణమైన రెండు రచనలు చేశారు. అవి. 'హు వుయ్ ఆర్?' (మనం ఎవరు ?), 'హౌ వుయ్ గాట్ హియర్?' (మనం ఇక్కడకు ఎలా చేరాం?). హిందు దినపత్రికలో సీరియల్‌గా వీటిపై సమీక్షలను వెలువరించారు. తద్వారా భారత్‌లో వీటిపై సవివరమైన, ప్రశంసనీయమైన చర్చ జరిగింది. ఆ సమీక్షలు నాలో ఆసక్తిని రేపాయి. వెనువెంటనే ఆ పుస్తకం కాపీని సంపాదించాను. దాన్ని చదివే క్రమంలో, దానిలోని పలు అంశాలు నన్ను ఆశ్చర్య చకితురాలిని చేశాయి. ఇంతవరకూ చదివిన భారతచరిత్రను గురించి తీవ్రమైన ప్రశ్నలను రేకెత్తించటంతో చరిత్ర, సాంస్కృతిక అంశాల్లో ఆసక్తిగల భారతీయ పాఠకుల్లో ఈ రచన ఆసక్తిని పెంచింది.

భారత చరిత్రకు సంబంధించి ఇటు వామపక్ష చరిత్ర రచనలు, అటు మితవాద జాతీయవాద చరిత్రకారుల రచనలు ఒకప్పుడు వుత్తరాది కంటే దక్షిణాది ప్రజలు ఉన్నతస్థానంలో ఉన్నారన్న అంశాన్ని ఏనాడూ గుర్తించ లేదు. ఇపుడు ఈ విషయంలో తీవ్రమైన మార్పులు చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. ప్రొఫెసర్ డేవిడ్ రీచ్ పరిశీలనలు, ఆయన విశ్లేషణా ఫలితాలు, చరిత్ర రచనా విధానంలో సమూల మార్పులు చేసుకోవలసిన అవసరాన్ని తెల్పుతున్నాయి. ఈ విషయం పట్ల గత మూడు దశాబ్దాలుగా భారత మేధావుల్లో తీవ్రస్థాయి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. దేశ చరిత్ర, సంస్కృత భాష పుట్టిన స్థానం, దానిని వినియోగించినవారి చుట్టూ ప్రధానంగా ఈ చర్చలు పరిభ్రమిస్తున్నాయి. చరిత్ర రచనపై మనదేశంలో సాగుతున్న చర్చల సమాచారం డేవిడ్ రీచ్‌కు చేరిందో లేదో తెలియదు. కానీ జర్మనీలో ఫాసిజం కాలంలో పథకం ప్రకారం చరిత్రను వక్రీకరించిన తీరు ఆయన గమనంలో వుంది. హిట్లర్ ప్రవచించిన 'అగ్రజాతి సిద్ధాంతం', దానిపట్ల ఇతర జాతుల్లో నెలకొన్న ధిక్కారాలపట్ల తన అభిప్రాయాలను ఆ పుస్తకం ఆరంభంలోనే స్పష్టంచేశాడు. ఈ శాస్త్రాన్ని నిగూఢ ప్రయోజనాలకు వినియోగిస్తే మారణకాండకు దారి తీయటానికి అవకాశం ఉన్న పరిస్థితుల్లో ఒక జన్యు శాస్త్రవేత్త ఇలాంటి అవగాహనతో ప్రారంభించటం ఎంతో ప్రాధాన్యత గల అంశం. ఈ అంశాలపై లోతైన చర్చ కోసం సమయం కేటాయించాలని రీచ్‌ను కోరాను. 2020 జూన్‌లో ఆయనతో ఆన్‌లైన్ చర్చలు జరిపాను. ఆ చర్చల సారాంశాన్ని అయన అనుమతితో ఇక్కడ అందజేస్తున్నాను.

**– జియన్ దేవి**

**దేవి:** మీ గ్రంథంలో భారత్, తూర్పు ఆసియాతో పాటు పలు ఖండాల సుదీర్ఘమైన , ప్రాచీన కాలపు చరిత్రను వివరించారు. ఉపఖండంలో నివసించిన ఆది మానవులు మొదట 'ఆఫ్రికా' నుండి వచ్చి, అండమాన్ దీవుల్లో ప్రవేశించినట్లు మీరు అభిప్రాయపడ్డారు. అక్కడ నుండి వారు ఇప్పటి దక్షణ భారతదేశంలోకి విస్తరించి, అటు నుంచి ఉత్తర భారతదేశం వైపు కదిలి వుంటారని అంచనా వేశారు. వారితో పాటు వారి భాష కూడా వలస పోయిందని చెప్పారు. సింధు నాగరికతకూ, దక్షిణభారత వాసులకు మధ్యగల సంబంధాన్ని తెల్సుకోవలసి వుందన్నారు. సింధు నాగరికత భాషను తెల్సుకున్నామని కొందరు అన్నప్పటికీ ఇంకా పూర్తిగా అన్వేషించాలని అన్నారు. మీరు పలు మార్లు ప్రస్తావించినట్లు, సింధులోయ నాగరికతకు, దక్షిణాదివాసులకు వున్న సంబంధాన్ని గురించి ఇంకా లోతుగా పరిశీలించవలసి వుంది కదా ? ద్రావిడుల పూర్వీకులు సింధు లోయకు తరలి వెళ్లారని, అక్కడ నుండి వెనక్కు తరిమివేయ బడ్డారన్న ఒక అవగాహన వుంది. ఈ పరిణామానికున్న అవకాశాలపై మీ వ్యాఖ్యానాన్ని తెల్పుకోవాలను కుంటున్నాను. భారత చరిత్రకారులకు ఇప్పటికీ ఊహకు అందని పలు అంశాలున్నాయి. వాటిపై మీఅభిప్రాయాలు వివరించండి.

**డేవిడ్ :** నా గ్రంథం మీకు, మరి కొందరు భారతీయులకు చేరినందుకు సంతోషిస్తున్నాను. ఆ గ్రంథంలోని పలు అంశాలపైన


మీ వ్యాఖ్యానానికి స్వాగతం. మీరు లేవనెత్తిన పలు ప్రశ్నలకు మొదట ఒకటవ భాగానికి, తర్వాత రెండవ భాగానికి సంక్షిప్తంగా వివరణ ఇస్తాను.

భారతదేశంలో ఆది మానవులు ఎవరు? ఇది మీ ప్రశ్నలోని మొదటి భాగం, " యూరేషియాలో 20 లక్షల సంవత్సరాలకు ముందు మానవులు లేరన్నది స్పష్టంగా తెల్సిన విషయమే. 'హోమో' మనజాతికి చెందిన సంయుక్త బీజం. అది ఆఫ్రికా ఖండంలో ఆవిర్భవించిందని "పాలియో –ఆంత్రో పోలాజికల్ " (ప్రాచీన –మానవుని మనస్తత్వ విజ్ఞానం) స్పష్టం చేస్తున్నది. 20 లక్షల సంవత్సరాల క్రితం యూరేషియాకు విస్తరించింది. ఈ విషయం కాకసస్, ఇండోనేషియాల్లో లభించిన అస్థిపంజరాల శిధిలాలు, పురావస్తు ప్రదేశాల ద్వారా తెలిసింది. ఇచటి నుండి భారతదేశంతో సహా యూరేషియాలోని ఇతర ప్రదేశాలు అన్నింటా విస్తరించారు.

ఆధునిక మానవుల పూర్వీకులు 50వేల సంవత్సరాల క్రితం మాత్రమే భారతదేశంలోకి విస్తరించారు. ఆ తర్వాత కాలంలో కూడా మన మూలాలతో, ఆధునిక మానవుల్లా కన్పించే వారు పెద్ద సంఖ్యలో విస్తరించారని శరీర నిర్మాణశాస్త్రం తెలియజేస్తున్నది. నేటి మానవుల శరీర నిర్మాణానికి, వారి పూర్వీకుల శరీర నిర్మాణానికి దగ్గర పోలికలున్నాయి. ఈ వలసలు ఆఫ్రికా నుండే ప్రారంభమయ్యాయి. ఆ వలసలే మొత్తం యూరేషియా, యూరప్, తూర్పు ఆసియా, దక్షిణ ఆసియాల్లోని మూలవాసులను మరోచోటుకు తరలిపోయేలా చేశాయి. అయినప్పటికీ మూలవాసులలో కొద్దిమంది నూతనంగా వచ్చినవారితో కలసిపోయారు.

ఆధునిక మానవుల శరీర నిర్మాణానికి, పూర్వీకుల అస్థిపంజర నిర్మాణానికి దగ్గర పోలికలు వున్నాయి. ఈ వలసలు యూరేషియాకు, భారత్‌లకు 50వేల సంవత్సరాల తర్వాతే వచ్చాయని చాలా ఖచ్చితంగా చెప్పవచ్చు. కానీ వీరు ఆఫ్రికా నుండి మొదట ఎక్కడికి వచ్చారో, వారి ప్రయాణమార్గం ఎలా విస్తరించిందో చెప్పలేము. యూరేషియా, న్యూగినియా, ఆస్ట్రేలియాలోని మూలవాసుల వలె సంకరం చెందని వారి వారసులు ఇప్పటికీ అండమాన్ దీవుల్లో వున్నారు. అండమాన్ దీవులకు వలసలు నిరంతరం కొనసాగాయా? లేదా? ఈ విషయం స్పష్టంగా చెప్పలేను. అండమాన్ ప్రజల పూర్వీకులు ఆగ్నేయాసియా, లేక దక్షిణాసియా ప్రధాన భూభాగాల్లో నివసించి వుండవచ్చు. ఆ ప్రాంత భూభాగాలు చాలా విశాలంగాను, మంచి వాతావరణం కల్గి వుండేవి. కనుక అండమాన్ ప్రజల పూర్వీకులు ఇక్కడకు వలస వచ్చివుండవచ్చు. ఈ విషయంలో స్పష్టత లేదు, అయినప్పటికీ ఆ వలసలు భారత ఉపఖండం నుంచి కాదని, ఇండోనేషియా నుండి వచ్చివుంటాయని భావించవచ్చు. బహుశా సుమిత్రా దీవులు, మయన్మార్ నుండి ఆ వలసలు సాగి వుండవచ్చు.

కానీ మీ ప్రశ్న ప్రస్తుత దక్షిణాసియా ప్రజల జాతి మూలాల చుట్టూ తిరుగుతున్నది. అది ఎంతో వైవిధ్యంతో కూడిన ప్రాంతం. వందలకొద్దీ భాషలు, మావవ వైవిధ్యం, జన్యు వైవిధ్యంతో కూడిన ప్రాంతమది. ఇంత వైవిధ్యం వున్నప్పటికీ ఇక్కడి ప్రజలు ఇండో యూరోపియన్, ద్రవిడ భాషా కుటుంబాలకు చెందిన భాషలు మాట్లాడతారు. భారతదేశంలోని భిన్న ప్రజా సమూహాల జన్యు క్రమాన్ని, వర్గీకరణను గమనిస్తే ఈ రెండు భాషా కుటుంబాలకు చెందినవారు భిన్నమైనవారని, యూరప్, తూర్పు ఆసియాకు చెందిన వారని అర్థం చేసుకోవచ్చు. ఈ రెండూ జన్యుపరమైన, వారసత్వపరమైన పూర్తిగా భిన్నమైన పరిశోధనల వెలుగులో వివరించబడ్డాయి. గత 11 సంవత్సరాలుగా భారతదేశంలోని ఈ



**దేవిడ్ రీచ్ రాసిన పుస్తకం మనం ఎవరు?, మనం ఇక్కడకు ఎలా చేరాం?**

భిన్నమైన వారసత్వ అంశాలపై పరిశోధనలు చేస్తూ అవగాహన ఏర్పరచుకుంటున్నాము.

సిసియంబి(సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ)కి చెందిన కె.తంగరాజ్‌తో కలసి చేసిన పరిశోధనల ఫలితమిది. గత దబ్దకాలంగా ఇండో–యూరోపియన్ – ద్రవిడ భాష మాట్లాడే సమూహాల పూర్వీకుల వర్గీకరణ, పుట్టుకలను అర్థంచేసుకునే ప్రయత్నం చేస్తూనే వున్నాము. అయితే " ఆస్ట్రో –ఆసియాటిక్ –బర్మీస్ " భాషలు మాట్లాడేవారి పూర్వీకుల గురించిన అధ్యయనాలపై తగిన కేంద్రీకరణ చేయలేదు. గత దశాబ్దకాల పరిశోధనల ద్వారా తెలుసుకున్న విషయాలపట్ల మేము సంతృప్తికరంగా వున్నాం.

**దేవి:** ప్రొఫెసర్ రీచ్, హైదరాబాద్ సిసియంబిలో మీరు ఇప్పటికే 10 వేల నమూనాలను అధ్యయనం చేశారు. ఆ తర్వాత కూడా మరికొన్ని నమూనాలను సేకరించే ప్రయత్నంలో వున్నారు. ఆ నమూనాలు తిరిగి విశ్లేషించబడుతున్నట్లు మీకు సమాచారం వుందా ?


**దేవిడ్:** హైదరాబాద్ కేంద్రంగా ఈ ప్రాజక్టు నడుస్తున్నది. 2000ల తర్వాత అత్యున్నత దశలో నమూనాల సేకరణ జరుగుతున్నది. సిసియంబి ద్వారా కేంద్ర ప్రభుత్వం అనేక మంది విద్యార్థులను, ముఖ్యంగా అధ్యాపకుల స్థాయి విద్యార్థులను సమీకరిస్తున్నది. దేశవ్యాపితంగా భిన్న గ్రామాల నుండి నమూనాలు సేకరించేందుకు వారిని వినియోగించుకుంటున్నది. తద్వారా భారత వుపఖండంలో జాతుల భిన్నత్వాలను సమోదు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం 500 ప్రజా సముదాయాల నుండి 18 వేల నమూనాలు సేకరించారు. భారతదేశంలో కనీసం 4,500 గుర్తింపబడిన జాతులున్నాయి.

ఇంతకు 10 రెట్లు నమూనాలు సేకరించబడని జాతులున్నాయి.

**వలసలు**

**దేవి:** మూల కణాల పరిశోధనలో, చెడిపోని కణాల అధ్యయనం ఎంతో వుపయోగకరంగా వుంటుంది. అది వైద్య పరీక్షలకు కూడా వుపయోగకరం. కానీ కొన్ని స్థానిక జాతులు ఈ పరిశోధనల పట్ల తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయి. జన్యు పరిశోధనలకు సంబందించిన నైతికపరమైన సమస్యలే వారి ఆందోళనకు కారణం. శాస్త్ర పరిశోధనల్లో ఎదురయ్యే ఆ సమస్యలేమిటో మీకు తెలుసు. వలసలకు సంబంధించి మీ అభిప్రాయాల వెనుక శాస్త్రీయ అంశాలున్నాయా? లేదా జన్యు లక్షణాల అధ్యయనం, కాల నిర్ణయ అధ్యయనం ఆధారంగా ఈ అభిప్రాయాలకు వచ్చారా ? ప్రధానమైన రెండు, మూడు వలసలకు సంబంధించి వ్యక్తమైన అభిప్రాయాల్లో స్పష్టత లేదు. అందుకే భారతదేశ చరిత్ర, లిఖిత చరిత్ర గురించి స్పష్టంగా తెల్సుకోలేకపోతున్నారు. ఉత్తరాది నుండి అక్కడి భాషలను, సాహిత్యాన్ని, సంస్కృతులను, పురాణాలను, దేవతలను, ఆహారపు అలవాట్లను తీసుకుని దక్షిణాదికి వలస రావటం అనేది వాస్తవం. కానీ ఇపుడు మనకు సమ్మిళిత లక్షణాలతో కూడిన పురాణాలు మాత్రమే వున్నాయి. అవి వలసలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలనూ అందించజాలవు. పురాతన వలసల్లో పేర్కొన్న 'పడవలు' వంటి రవాణా సాధనాల గురించి మీ గ్రంథంలో ప్రస్తావించారు. అలాంటి రవాణా సాధాలు 6–7వేల సంవత్సరాలకు పూర్వమే 'సుమేరియన్' నాగరికతలోగాని, దక్షిణ భారతదేశంలో గానీ వుండి వుంటాయన్నది సందేహాస్పదమే. మీ వాదనలకు సాక్ష్యాలుగా భారతదేశంలోని సంస్కృతి, వ్యవసాయం, సముద్రయానాల అధ్యయనాలను ఆధారంగా తీసుకున్నారా? భారతదేశంలో రెండు విధాలైన వ్యవసాయం వుంది. ఒకటి గోధుమ ఆధారిత వ్యవసాయం. రెండు వరి ఆధారిత వ్యవసాయం. మేము రెండు రకాల సాగు కాలాలనూ అనుసరిస్తున్నాము. పై అంశాలన్నింటినీ గమనంలో వుంచుకునే మీ అభిప్రాయాలను రూపొందించుకున్నారా ?

**దేవిడ్:** అవును. అనేక పరిశోధనా అంశాలను గమనంలో వుంచుకునే నా అభిప్రాయాలను ఏర్పరచుకున్నాను. కానీ ప్రాచీన చరిత్రపై మనకున్న ఆధారాలు చాలా పరిమితం. లిఖిత చరిత్ర అంతా క్రీ.పూ. 4000–3500ల సంవత్సరాల నుండి , లిపి ముందుగా అమల్లోకి వచ్చిన ప్రాంతాలలో 5000ల సంవత్సరాల నుండి మాత్రమే లభిస్తున్నది. అంతకు పూర్వం రాతపూర్వకమైన లోతైన సమాచారం మనకు లేదు. అంటే సమాచారానికి ప్రత్యేకంగా 'రాత' (రైటింగ్)మాత్రమే ఒక సుసంపన్నమైన వనరుగా వుంది. అది కాకుండా వారసత్వంగా వస్తున్న పురాణాల నుండి లిఖిత చరిత్రను అర్థం చేసుకోటానికి కొంత అవకాశం వుంది. ఇవేగాక ప్రపంచంలోని పరస్పర సంబంధాలు గల భాషలను అధ్యయనం చేయటం ద్వారా కూడా పురాతన పదాలను డీకోడ్ (గూఢ లిపిని అనువాదం) చేయటం ద్వారా కూడా మనం కొంతమేర చరిత్రను అర్థం చేసుకోవచ్చు. మానవజాతి విస్తరణను, సామాజిక, సాంస్కృతిక అంశాలను అధ్యయనం చేయటం ద్వారా చరిత్రలో భారీ వలసలు లేదా కదలికలను, భాషల కలగలుపులను పరిశీలించవచ్చు. ముఖ్యంగా మహిళల వలసల ద్వారా మార్పులు జరిగినట్లు మనం గమ నించవచ్చు. ఆ మార్పులను అర్థం చేసుకోవటం చరిత్ర అధ్యయనానికి వుపయోగపడుతుంది. కాబట్టి ప్రజలు భాషలను పరస్పరం మార్పిడి చేసుకున్న అంశాల ఆధారంగా చరిత్రలో భారీగా



తవ్వకాల్లో బయటపడిన హరప్పా నాగరికతకు చెందిన నగరం

వలసలు జరిగి వుండవచ్చన్న ఆధారం మనకు లభిస్తున్నది.

చివరిగా చరిత్రను అర్థం చేసుకునేందుకు ప్రజలు తమ వెనుక వదిలిన సాంస్కృతిక, పురావస్తు సాక్ష్యాలు కూడా ఉపయోగపడతాయి. వారు ఏ విధంగా ఇటుకరాళ్ళను తయారు చేశారు, ఎటువంటి భవనాలను నిర్మించారు, ఎటువంటి నగలు ధరించారు, ఏ విధమైన ఆహారాన్ని తినేవారన్న అంశాల ఆధారంగా చరిత్రను తెలుసుకోవచ్చు. ఒక ప్రాంతంలోని ప్రజలు తిన్న ఆహారానికి భిన్నమైన ఆహారాన్ని మరోప్రాంతంలోని ప్రజలు తినటం ప్రజల మధ్య ఉన్న సంబంధాలను తెలియజేస్తాయి. గతానికి సంబంధించి చరిత్ర ఒక్కటి మాత్రమే ఆసక్తికరమై అంశం కాదు. ఏ ఒక్క అంశమూ విడివిడిగా ప్రాధాన్యత కల్గివుండదు. అన్ని అంశాలూ గతంతో, భవిష్యత్‌తో సంబంధాలు కల్గివుంటాయి. ఉదాహరణకు మనం అస్థిపంజరాలను పొందగల్గితే, వాటిలోని డిఎన్ఎ( కణంలోని అనువంశిక పదార్థము)లను పొందటం గత దశాబ్దకాలం నుండి సాధ్యమౌతున్నది. ఈ రెండు కాలాలకు సంబంధించిన ప్రజలు సన్నిహిత సంబంధాలను కలిగివున్నారా, లేక ఎటువంటి సంబంధాలు లేకుండా ఉన్నారా అన్న సమస్యను మన పరిష్కరించవచ్చు. మనం ఈ ప్రాంతాలలోని 10 వేల సంవత్సరాలు, 7,000 సంవత్సరాలు, 4,000 సంవత్సరాలు, 2,000 సంవత్సరాల నాటి మానవ అస్థిపంజరాలను పొందగలిగితే అక్కడ ప్రస్తుతం నివసిస్తున్న ప్రజల డిఎన్ఎతో పోల్చి, 10,000 సంవత్సరాలనాటి ప్రజల వారసులే అక్కడ ఉన్నారా, లేక ఆ ప్రాంతానికి బయటి నుండి ప్రజలు వలస వచ్చి అక్కడ నివసిస్తున్న వారితో కలగలిసి పోవటం జరిగిందా అన్న విషయాలను చెప్పవచ్చు.

భారతదేశంలో మాత్రమే కాక ప్రపంచమంతటా గత దశాబ్దకాలంలో వివిధ ప్రాంతాలలోని పురాతత్వ ఆధారాలును పొందటం, తర్వాత కాలంలోని పురాతన సాక్ష్యాలను సంపాదించటం వాటిని ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న ప్రజలతో పోల్చిచూడటం సాధ్యమౌతున్నది. వీటిని పరిశీలించినపుడు 10,000 సంవత్సరాల క్రితం ఒకప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు ఇపుడు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలతో కలవకుండా, వలసలు పోకుండా, ఇతర ప్రజలతో మిళితం కాకుండా ఉన్నప్రాంతం ప్రపంచంలో ఎక్కడా లేదు. గతానికి సంబంధించిన ఆధారాలు అత్యధికంగా లభిస్తున్న యూరప్‌ను పరిశీలించినపుడు ఇది మరింతగా స్పష్టమౌతున్నది.

ఇపుడు బ్రిటన్‌లో ఉన్న ప్రజలు 10వేల సంవత్సరాలకు పూర్వం

అక్కడ జీవించిన ప్రజల నుండి వారసత్వంగా పొందిన లక్షణాలేవీ వునికిలో లేవు. జన్యు పరిశోధనల ద్వారా ఈ విషయాన్ని మనం గ్రహించాం. ఈ జన్యు ఆధారాల ద్వారా వారందరూ కూడా ఉప సహారా ప్రాంతపు లణాలైన నీలి కళ్లు, నల్లటి చర్మమూ కల్గివుండవచ్చు. 6000 సంవత్సరాలకు పూర్వం బ్రిటన్‌లోనికి విభిన్న ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు అక్కడ వ్యవసాయాన్ని ప్రవేశపెట్టి వుండవచ్చు. అపుడు బ్రిటన్‌కు 99 శాతం మంది బయటి నుండి వలస వచ్చారు. 4,500 సంవత్సరాల క్రితం తిరిగి 90 శాతం మంది వలసలు రావటం జరిగింది. కాబట్టి ఇపుడు బ్రిటన్‌లోని ప్రజలెవరూ తమ పూర్వీకులు బ్రిటన్ వాసులని చెప్పలేరు. అందుకు భిన్నంగా భారీస్థాయిలో భిన్న ప్రజల కలయిక బ్రిటన్ ప్రజల పూర్వీకులది.

భారతదేశంలో కూడా ఇలాంటి పరిస్థితులనే మనం గమనించవచ్చు. ఇపుడు దేశంలో అతికొద్ది మంది మాత్రమే తమ పూర్వీకుల నివాస ప్రాంతాల్లో నివశిస్తూ వుండవచ్చు. కానీ ఎక్కువ మంది ప్రతి 500 నుండి 1000కి.మీ.ల పరిధిలో ఉన్న ప్రజలకు బిన్నమైన మూలాలలతో ఉన్నారని అర్థం చేసుకోవాలి. నేడు మనం అందరమూ మానవ వారసత్వ గొలుసులో కలసిపోయి వున్నాము. భిన్న ప్రాంతాల ప్రజల మూలాలు మనలో ఉన్నాయి. భారత్‌లో గత దశాబ్ద కాలపు పరిశోధనలు ద్వారా పూర్వీకుల మూలాలను గురించి పలు అంశాలు తెలుసుకోగలిగాం. నేను తూర్పు ఆసియా మరియు యూరపు వాసుల గురించి నీకు వివరించి వున్నాను. అవి రెండూ ఒకదానికొకటి విభిన్నమైనవి. షుమారు 4వేల సంవత్సరాలకు పూర్వం హరప్పా నాగరికత కాలంలో, పతనానికి ముందు, తర్వాత ఆ రెండు గ్రూపుల జనాభాల వేగవంతమైన మార్పులు, మిశ్రమ లక్షణాలను సంతరించుకున్న తీరును గమనించాము. ఆ కాలంలోనే ఈ కలయికలు జరిగాయి.

### జాతి– వర్ణము


**దేవి:** మీ పుస్తకంలో తెలంగాణాలోని 'వ్యాస' సంతతి (కమ్యూనిటీ) గురించి చర్చించారు. ఈ సంతతిపై పలు అసాధారణ మైన ఉదాహరణలను ఆ చర్చలో వుటంకించారు. మీ పరిశీలనను అనుసరించి వ్యాస సంతతి జన సమూహం బాహ్యంగా ఎలాంటి జన్యుపరమైన సంబంధాలు సోకకుండా కొనసాగుతున్నది. ప్రస్తుతం భారతదేశంలో నాలుగు వేలకు పైగా జాతుల జన సమూహాలు వున్నాయి. ప్రతి సమూహమూ తనది ఒక "ప్రత్యేకమైన జాతి"గా భావిస్తున్నది. మరి కొన్ని సమూహాలు, తమకు తామే '' ప్రత్యేకమైన తెగలు''గా స్వయంగా ప్రకటించుకుంటున్నాయి. చారిత్రకంగా చూస్తే వర్ణవ్యవస్థ ముఖ్యంగా స్త్రీలకు తీవ్రమైన అన్యాయం చేసింది. జాతి, వర్ణ వ్యవస్థల్లో స్త్రీని అధమస్థాయికి నెట్టేశారు. పరాధీనతను పెంచిపోషించారు. అయితే ప్రజలే ఈ పనిచేసినందువల్ల ఈ చరిత్ర గురించి సైన్స్ అంతగా ఆందోళన చెందవలసిన అవసరం లేదు. కొన్ని జాతులు జన్యు సంకరాలకు లోనుకాకుండా కొనసాగుతున్నాయన్న భావనకు సైన్స్ యొక్క అతి విశ్వాసమే కారణమా? వాస్తవానికి కులం, వర్ణం బంధనాల నుండి బైటపడి అందరూ సమానులేనన్న భావన అభివృద్ధి చెందాలన్నది భారతీయుల స్వప్నం. కానీ దురదృష్టవశాత్తూ అత్యధిక భారతీయుల్లో కులం, వర్ణం అభిమానాలు జీర్ణించుకుపోయాయి. అందువల్ల మీ పుస్తకంలో పేర్కొన్నట్లు "ప్రాథమికంగా మనమంతా మిశ్రమ మానవులమే. కానీ కొన్ని తెగలు మాత్రం స్వచ్ఛమైన రూపంలో నే వున్నాయి." అని నిర్ధారిస్తున్నది. ఈ అంశం నన్ను అసహనానికి గురి చేస్తున్నది. మీ నిర్ధారణలను నేను తప్పు పట్టటం లేదు. కానీ జాతి భావనను సమర్థిస్తున్నట్లు మీ నిర్ధారణలను అపార్థం చేసుకునే అవకాశం ఉంది. మరి మీ పరిశోధనను ఎలా వినియోగించుకోవాలి? గతంలో తెలియని సత్యాన్ని వ్యక్తీకరించేదే సైన్స్. ముఖ్యంగా నేడున్న ప్రత్యేక పరిస్థితుల్లో ఆలోచనలన్నింటినీ సిద్ధాంతం పేర ఒకే కట్టకడితే అది సులువుగా సత్యానికి శతృవుగా ముద్ర వేయబడుతుంది. ఈ అంశాలపై మీరు స్పందించండి.

**డేవిడ్:** ఎంత అద్భుతమైన ప్రశ్న! సైన్సు అనేది సత్యాన్ని తెల్సుకునే ప్రయత్నం. కానీ సైన్సును సద్వినియోగం చేస్తున్నామా, దుర్వినియోగం చేస్తున్నామా అనేది ప్రధాన సమస్య.. భారత ప్రజల జన్యువిశ్లేషణ "మిశ్రమం కాని జన్యువుకు –మిశ్రమ జన్యువు " కాలాల మధ్య ప్రత్యామ్నాయాన్ని చూపిస్తుంది. దక్షిణ ఆసియాలో కూడా ఇదే విధమైన "కాల వ్యత్యాసాన్ని " మనం చూడగలం. ప్రజలు తరచుగా మిశ్రమం కాని జన్యువు కాలాన్ని మాత్రమే గుర్తుంచుకుంటారు. నిరంతరంగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని వారు ఆలోచిస్తారు. కొన్ని వందలు లేదా కొన్ని వేల సంవత్సరాలకు ఒకసారి గ్రూపులు ఏర్పడతాయి. ఇతర గ్రూపులతో నాటకీయంగా కలసిపోతాయి. ఆ విషయాన్ని విస్మరించినపుడు వలసలు, మిశ్రమ జన్యువులు ముఖ్యం కాదన్న పొరపాటు భావనలకు ప్రజలు గురౌతారు. గత రెండు వేల సంత్సరాల్లో ప్రతి తరంలోనూ ఒక శాతానికి మించి నూతన జనం కలిసిపోవటం లేదు. గత 1000–2000 సంవత్సరాల్లో జన్యుపరంగా ఒకటి, రెండు ప్రధానమైన మిశ్రమ ఘటనలు జరిగి వుండవచ్చు.

భారతదేశంలో జాతుల పరంగా అనేక మిశ్రమాలు జరుగుతున్నాయన్నది వాస్తవం. ఇక్కడి ప్రజలు తమతో లీనమౌతున్న దిగువ కులాలు, సామాజికంగా దిగువ స్థాయి జాతుల ప్రజా సమూహాలతో తరచూ కూటములు ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాంటి సందర్భాల్లో తమ ప్రాథమిక (ఒరిజినల్) గ్రూపుకు చెందిన పూర్వీకుల స్థాయిలో ప్రభావితం చేయటాన్ని మనం చూడలేము.

నా పుస్తకంలో పేర్కొన్నట్లు, నా వ్యక్తిగత నేపథ్యాన్ని గమనంలో వుంచుకున్నపుడు ఒక సన్నిహితమైన సారూప్యత కన్పిస్తున్నది. నేను పుట్టుకతో 'యూదు' జాతీయుడను. 'యూదు' అనేది ఒక జాతి లేదా కుల సమూహం వంటిది. కానీ యూరపులో కులాలు లేవు. చారిత్రకంగా మా ప్రజలు 'కులాన్ని' పోలి పనిచేస్తుంటారు. సమాజంలో ఆర్థికరంగంలో తమ వంతు పాత్రను నిర్వహిస్తున్నారు. సామాజికంగా వేరుబడి వున్నారు. వేలాది సంవత్సరాలుగా మా ప్రజా సమూహం విపరీతమైన స్థాయిలో ఒంటరితనంతో జీవిస్తున్నారు. మా ప్రజల జన్యుపరమైన పరిస్థితుల పట్ల నాకు అవగాహన వుంది. ఉదాహరణకు యూదుల్లో మేము ' అష్కెనాజీ ' తెగకు చెందిన వారము. మా తెగలో ఇతరులకు చెందిన మూలాలు ఉన్నాయి. గత 1500ల సంవత్సరాలుగా మా పూర్వీకుల్లో సగంమంది యూరోపియన్‌లతో జన్యుపరమైన మిశ్రమంగా ఆవిర్భవించారు. అది నా గ్రూపు పూర్వీకుల్లో ఒక ముఖ్యమైన భాగంగా వుంది.

ఏదైనా ఒక గ్రూపు జన్యుపరంగా పరమ పవిత్రంగా వున్నామని ఆలోచించటం జన్యుశాస్త్ర పరంగా తప్పని చెప్పేందుకే పై సమాచారం ఇవ్వవలసి వచ్చింది. మానవాళి పూర్వీకుల నమూనాల నుండి అనేక అంశాలను ఇపుడు మనం నేర్చుకుంటున్నాము. మన చరిత్రకు, మన పూర్వీకుల జీవితాలు గురించి మనం చెప్పుకునే అనేక పురాణాలు, కథలు, గాథలు... ఆ కల్పితాలన్నీ ఇపుడు పనిచేయవు. ప్రతిసారీ ఆ కల్పిత కథలు, గాథలను, వాటిని నమ్మబలకటం కోసం



**హరప్పా శిధిలాల ఆధారంగా నాటి నగరం ఎలా ఉండేదో తెలిపే చిత్రం**

గుప్పించిన గణాంకాల సమాచారాలను లోతుగా పరీక్షించాలి. ఒక నిర్దిష్ట గ్రూపు డియన్ఎ సమాచారం అందక పోవచ్చు. కానీ " మా వంశ వృక్షం మిశ్రమం కాదు, అంతా పవిత్రమే" వంటి కితాబులు ఆపాదించు కోవటం తప్పు. జన్యుపరమైన కల్పిత సమాచారాలను గుప్పించటం ద్వారా పుంఖాను పుంఖాలుగా గతకాలపు అనేక కథనాలతో తప్పుడు ప్రచారానికి పూనుకుంటారు. వాస్తవానికి శాస్త్ర విజ్ఞానం నైతిక అంశాపై ఆధారపడి వుండదు. ఎలాంటి నియంత్రణలకూ లొంగని శక్తి అది. దీర్ఘకాలంలో దాని ప్రభావంతో కల్పిత కథనాలు పేలి పోతాయి. మూఢ విశ్వాసాలు కూలిపోతాయి. జన్యు సంబంధిత ఒంటరి గాధల బండారం బట్టబయలౌతుంది.

### దృశ్య సంస్కృతి

భారతీయ భాషలపై 3వేల మంది వాలంటీర్ల సాయంతో పరిశోన చేస్తున్నాను. 700లకు పైగా భాషలను గ్రంథస్థం చేశాం. రాజస్థాన్, గుజరాత్‌కు దగ్గరలోని కచ్ ప్రాంతాల్లోని మూలవాసులు అంటే ఆదివాసీలతో కలసి పని చేశాను. అది సింధు నాగరికిత విలసిల్లిన ప్రాంతం. అక్కడి ఆదివాసీ ప్రజల భాషలను, దృశ్య సంస్కృతిని పరిశీలించాను. ఇక్కడి భాషల్లోని సంజ్ఞలు ఇండో ఆర్యన్ భాషల నుండి వచ్చినవి కాదు. అవి ప్రాకృతిక భాషల నుండి ఏర్పడినాయి. కానీ సంస్కృతం నుండి మాత్రం కాదు. విద్యావంతులు కాని ఆదివాసీలకు సింధు నాగరికత నాటి సంజ్ఞలను చూపాము. వారు వాటిని గుర్తించారు. అవి తమకు పరిచయమున్నవిగా వారు తెల్పారు. దాన్ని బట్టి క్రీ.పూ. 4500ల నాటి ప్రజలతో ఈ ప్రాంత ప్రజలకు సంబంధాలున్నాయని అర్థమౌతున్నది.

**దేవి:** విస్తృత పరిశోధనల సారాంశంగా మంచి గ్రంథాన్ని మాకు అందించారు. హరప్పా సంస్కృతిని, దాని విచ్ఛిన్నాన్ని, కొనసాగుతున్న ఆనవాళ్లను, మీ పరిశోధనలను జోడించి లోతుగా పరిశీలించేందుకు అవకాశం వుందని మీరు భావిస్తున్నారా ? అవి చారిత్రక దృష్టికోణం నుండి అదృశ్యమైనప్పటికీ అక్కడి మానవులలో (బయోలాజికల్ కంటిన్యుటీ) ఆనవాళ్లు తప్పక వుంటాయి. ఎందుకంటే అక్కడి ప్రజలు ఆకాశంలోకి ఆవిరై పోలేదు. అనేక వస్తువులను, కొన్ని ఎముకలను, గడచిన అనేక తరాల ప్రజలను వారు వదలి వెళ్లివుంటారు. ఈ నిర్దిష్ట ప్రాంతాన్ని ప్రాచీన గాధలు, లిపి తెల్సిన పురావస్తు పరిశోధకులతో కలసి పరిశీలిస్తే మంచి ఫలితాలు వస్తాయని మీరు భావిస్తున్నారా ?

ఒక స్థిరమైన అభిప్రాయానికి రావటానికి అవసరమైనన్ని లిపి నమూనాలు లభించటం లేదు. దొరికిన వాటిలో కొన్ని అసంపూర్ణంగా వున్నాయి. సింధు ప్రాంత ప్రజల గురించి తెల్పే నమూనాలు లేవు. భారత చరిత్ర, భారత సమాజాన్ని ఆవిష్కరించేందుకు జన్యు శాస్త్రం, ఇతర శాస్త్రాలతో కలిపి పరిశోధనలు చేస్తే అనేక విషయాలు వెల్లడౌతాయి. అసలు వాస్తవాలు బైటకు రాకుంటే సంస్కృత భాషావాదులు, ఫాసిస్టులు, ఆధిపత్య శక్తులూ భారతదేశ ప్రజల ఆలోచనా విధానాన్ని, చరిత్రను వక్రీకరించేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే వుంటారు.

**డేవిడ్:** అవునవును. భారతదేశంతో పాటు, ప్రపంచ వ్యాపితంగా లిఖిత భాష లేనపుడు గత కాలపు అంశాలు చాలా స్వల్పంగానే లభిస్తాయి. రాత ప్రారంభానికి ముందు, ఆ తర్వాత కూడా కొద్దిమంది మాత్రమే రాయగలవారు వుండి వుంటారు. అత్యధికులు తమ గాధలను రాయలేరు. పురాణాలు, ఇతిహాస గాధలు(మైథాలజీ), సంగీతశాస్త్రం(మ్యూజికాలజీ), భాషా అధ్యయనం, పలు ప్రాంతాల మధ్య ఒకే విధంగా వుండే మాటలూ, మాటలను వుచ్ఛరించే తీరు, నిర్మాణ పరికరాలు, పంటలు, ఆహారం వగైరాలు

అన్నీ గతంలో ఏం జరిగిందో తెల్సుకునేందుకు సహాయపడతాయి. ఇలాంటి సాక్ష్యాధారాలన్నింటినీ కలిపి పరిశీలిస్తే అర్థవంతమైన సమాచారం లభిస్తుంది. ఈ పుస్తక ప్రచురణ తర్వాత దక్షిణాసియా ప్రజల చరిత్రను అర్థం చేసుకోవటంలోఎంతో అభివృద్ధిని సాధించాము. భారత్‌లో హరప్పా నాగరికతకు సంబంధించిన 'ఒక వ్యక్తి' డిఎన్ఎ (కణంలోని అనువంశిక పదార్థం) మాత్రమే హర్యానాలోని 'రాఖీ గర్హీ' లో సేకరించగల్గాము. మరో 12 మంది దక్షిణాసియా వాసుల నుండి కూడా డియన్ఎల నమూనాలు సేకరించాము. అలాంటి వారందరూ తప్పనిసరిగా హరప్పా నుండి వలసవచ్చిన వారే. వారు టర్క్‌మెనిస్తాన్, ఇరాన్ ప్రాంతాల్లో నివశించారు. ఆ నివాస ప్రాంతాలన్నీ వ్యాపార కేంద్రాలే. ఈ కేంద్రాలన్నింటా హరప్పా పురాతన వస్తువులు ఎక్కువగా వుండేవి. ఈ కేంద్రాల నుండే ఉత్తరం, పడమర ప్రాంతాల్లోని నాగరిక సమాజాలతో వ్యాపారం చేసేవారు. అక్కడి ప్రజలు ఆ సమాజాల్లో లీనమై ఎక్కువ కాలంగా నివశిస్తున్నవారే. జన్యుపరంగా వీరు ఆపాటికే అక్కడ నివాసమున్న జన సమూహాల కన్నా భిన్నంగా వుండేవారు. వీరు జన్యుపరంగా ఎక్కువగా ఇరానీయులకు దగ్గరగా వుండేవారు. నేటి దక్షిణాది భారతీయులతో మిశ్రమంగా ఉండేవారు. జన్యుపరంగా ఒకేవిధంగా వున్న ప్రజలందరూ 'రాఖీ గర్హీ ' ప్రాంత వాసులకు దగ్గరగా వుండేవారు. కాని నేటి ప్రజలకు కొంత భిన్నంగా ఉండేవారు.

హరప్పా నాగరికత పతనం తర్వాతే ఇప్పటి దక్షిణాసియా జనాభా జన్యుపరంగా ఆవిర్భవించిందని మనకు తెలుస్తున్నది. వీరు ఇంకా దక్షిణంగావున్న అండమాన్ వాసుల మూలాలున్న ఆగ్నేయఆసియా వాసులతోను, ఆస్ట్రో –ఆసియా భాషలు మాట్లాడే 'ఖాసీ' ప్రజలతోనూ కలసిపోయారు. అదేవిధంగా దక్షిణాది పూర్వీకుల మూలాలున్న ఉత్తరప్రాంత ప్రజలతోనూ కలసిపోయారు. ఈ మిశ్రమ ప్రజలతో పాటు, పురాతన ప్రజల వారసత్వ డియన్ఎ ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రజల పునాదిగా మారింది. కాని రెండు గ్రూపుల ప్రజల మూలాలు హరప్పా నాగరికత, ప్రజల నుండే వున్నాయి. ప్రస్తుత భారత ప్రజల వారసత్వానికి ఏకైక వనరుగా వున్నది హరప్పా గ్రూపు ప్రజలు మాత్రమే. ఈ గ్రూపు ప్రజలు బహుశా దక్షిణ భారతీయులు, ఆగ్నేయాసియా వాసులు, ఉత్తర భారత సమూహాలతో కూడా కలసి వుండవచ్చు. వీరిలో ప్రధాన సమూహం ఉత్తరభారత వారసత్వ గ్రూపులు, హరప్పా వారసత్వ సమూహాలతో కలసి వుండవచ్చు. ప్రస్తుతం ఈ వారసత్వ సమూహం ఎటువైపు వెదజల్లబడిందో తెలియదు. అది హరప్పా నాగరికత పరిధిలోనే వుండక పోవచ్చు.హరప్పా నాగరికత పతనావస్థలో వున్నపుడు ఏర్పడిన వలసలు, సాంస్కృతిక భిన్నత్వాల వల్ల విస్తృత ప్రాంతాలకు వ్యాపించి వుండవచ్చు. కాలం గడిచేకొద్దీ మరింతగా విస్తరించి ప్రస్తుత ప్రజా సమూహాల వారసత్వ క్రమం (గ్రేడియంట్ ) 2000 సంవత్సరం క్రితం పూర్తిగా ఏర్పడింది.

**దేవి:** మంచిది. మీ పుస్తకం కోసం మేం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాం.

**(అనువాదం : సి.గోపాలకృష్ణ)**

# బడా పెట్టుబడిదారుల కోసమే వ్యవసాయ చట్ట సవరణలు

(21వ పేజీతరువాయి)

సంప్రదాయక మితవాద ఆలోచనా ధోరణి, ప్రాముఖ్యం పొందిన వామపక్ష ఆలోచన (స్టాలిన్ సమష్టివాద ఆలలోచనా ధోరణి) – ఈ రెండు ధోరణులతో అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు కృషిచేయాలి. వ్యవసాయం నుంచి పరిశ్రమలకు ఆపై సేవలకు పయనించేందుకు ప్రయత్నించాలి. సంప్రదాయ ఆర్థిక అభివృద్ధి మార్గాల అనుసరణతో పర్యావరణ మార్పులతో సంభవించిన పరిణా మాలతో భూగ్రహం వేడెక్కి విధ్వంసమవుతున్న పరిస్థితులలో మితవాద సంప్రదాయ విధా నాలా లేక వామపక్ష సంప్రదాయ పద్దతులా లేక మధ్యేమార్గ వ్యవసాయ పద్ధతులా, ఇందు లో ఏది పర్యావరణ సమతుల్యాన్ని పరిరక్షించ గలిగేదో చూడాలి. ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్లను అధిగ మించేందుకు సంప్రదాయక మితవాదం, వామపక్ష పద్దతులు రెండింటినీ పర్యావరణ, సామాజిక కోణం నుంచి విమర్శనాత్మక ధోరణితో పరిశీలించాలి.

**ముగింపు**

సన్నకారు, చిన్న, మధ్యతరహా రైతుల ప్రయోజనాలను ప్రతిబింబించే సంస్థలు ఈ వ్యవసాయ చట్టాలతో బహుముఖంగా విధ్వంసానికి పాల్పడుతున్న ఆర్థిక విధానాలను తిప్పికొట్టేందుకు సమష్టి బాధ్యతతో కార్యాచరణకు సిద్ధం కావాలి. ఈ చర్యను వ్యతిరేకించేందుకు, ఆర్థిక ప్రగతితో పాటు ఫెడరలిజాన్ని, పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న ప్రయత్నా లకు నైతిక బాధ్యతతో అన్ని రాజకీయ పక్షాలు, రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుకు సాగాలి. ఫెదరలిజం కోసం, భిన్నత్వం కోసం పోరాటం సాగించడమంటే ప్రజాస్వామ్యం కోసం పోరాటం చేయడమే. ఫెదరలిజాన్ని బలహీన పరచడమంటే ఆర్థిక, రాజకీయ కేంద్రీకరణను పెంచి పోషించేందుకు, పర్యావరణాన్ని విధ్వం సం చేసేందుకు దోహదపడడమే అవుతుంది.

ఈ వ్యవసాయ చట్టాలను తిప్పికొట్టేందుకు సమన్వయంతో, చిత్తశుద్ధితో చేసే కృషి ఏ విధంగా ఉండాలంటే కేంద్రంలో రాబోయే ప్రభుత్వాలు ఇటువంటి మార్పులు చేసేందుకు వెనుకంజ వేయడమే కాకుండా వ్యవసాయ నిర్వహణలో రాష్ట్రాల శక్తిని మరింత ఇనుమ డింపజేసే విధంగా రాజ్యాంగంలో పొందు పరిచేలా చర్యలు తీసుకొనేలా ఉండాలి. ఇతర అంశాలైన పరిశ్రమలు, ఆర్థిక వ్యవహారాలు, విద్యకు సంబంధించి ఫెడరల్ స్ఫూర్తికి భంగం కలుగకుండా చూడాలి. వ్యవసాయం, ఆహారవనరుల విషయంలో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి హక్కును కాపాడాలి. అమెరికా, చైనా, యూరప్, బ్రిటన్, కెనడా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి దేశాలన్నీ తమ వ్యవసాయాన్ని పరిరక్షించు కునేందుకు కృషి చేస్తున్నా, పర్యావరణ సమ తుల్యత లక్ష్యాన్ని సాధించలేకపోతున్నాయి.

వ్యవసాయాన్ని పరిరక్షించుకోవడంతో పాటు వ్యవసాయరంగంలోకి వ్యాపార పెట్టు బడిదారీ విధానం అడుగిడకుండా రాబోయే సంవత్సరాలలో భారతదేశంలో కీలక ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పోరాటాలు చేయాలి. వికేంద్రీకరణను బలోపేతం చేసి భిన్నత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని, వ్యవసాయాన్ని, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకొనే విధంగా పోరాటాలు చేయాలి.

**(అనువాదం: జి ఆంజనేయులు)**

సిద్ధాంతం

# కమ్యూనిస్టు ఉద్యమం: మహిళల్లో వర్గ చైతన్యం


రచయిత జెఎన్‌యు ప్రొఫెసర్

**ప్రొ. అర్చనా ప్రసాద్**

మహిళలు వర్గదోపిడికి, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా తమ స్వేచ్ఛకోసం చేసే పోరాటాల క్రమంలో కమ్యూనిస్టు ఉద్యమం ఎలా మమేకమై అభివృద్ధి చెందిందో ఈ వ్యాసంలో చర్చించబడుతుంది. అయితే చాలామంది మేధావులు, ఉద్యమాలలో క్రియాశీలంగా పనిచేసేవారు సూచించినట్టు పితృస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలు వాటంతట అవే వర్గ పోరాటాలుగా మారిపోవు. చైతన్యవంతంగా వాటిని మలచాలి. నిజానికి మహిళలు తమ హక్కులకోసం చేసే పోరాటాలు పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ఉండకపోవచ్చు. మహిళల సామాజిక, రాజకీయ హక్కులు సాధించుకునే పరిమితమైన లక్ష్యాలు కూడా ఉండి ఉండవచ్చు. అందువలన మహిళా ఉద్యమాలు వర్గ పోరాటాలుగా మారాలంటే పెట్టుబడిదారీ విధానానికి, పితృస్వామ్యానికి ఉన్న సంబంధంపై సైద్ధాంతిక అవగాహన కలిగి ఉండాలి.

మహిళలు తమ స్వేచ్ఛకోసం చేసే పోరాటాలలో కమ్యూనిస్టు పార్టీ ప్రారంభించబడడం ఒక ప్రముఖమైన అంశం ఎలా అయిందో ఈ వ్యాసంలో వివరించదలుచుకున్నాను. కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొన్న మహిళలు ముందు నుండి లైంగిక వివక్ష, లింగ ప్రాతిపదికన ఉన్న శ్రమ విభజనను వ్యతిరేకించారు. ఉద్యమ ఎత్తుగడల క్రమం పితృస్వామ్యానికి, వర్గ చైతన్యానికి ఉన్న సంబంధాలను అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పించింది. భారతదేశంలో మహిళల స్వేచ్ఛకోసం జరిగే పోరాటాలపై ఇక్కడి కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం ఎలావుందో పరిశీలిద్దాం. ఇది తెలుసుకోవాలంటే మహిళల విముక్తికి కమ్యూనిస్టు ఉద్యమం చేసిన సుదీర్ఘమైన కృషి ఏమిటి, పితృస్వామిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే పోరాటం దానికదే పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేక పోరాటంగా కూడా ఉంటుందా, అలా ఐతే భారత కమ్యూనిస్టు ఉద్యమం చేస్తున్న విముక్తి పోరాటంలో మహిళల స్థానం ఎక్కడ? మార్క్సిస్టు ఫెమినిజానికి, 'స్వతంత్ర' మహిళా ఉద్యమాలకు మధ్య ప్రస్తుతం జరుగుతున్న సైద్ధాంతిక, భావజాల పోరాటాలను పరిష్కరించటానికి ఈ అంశాలకు సమాధానాలను అన్వేషించటం కీలకంగా ఉంటుంది. ఈ వ్యాసంలోని మొదటి భాగంలో పెట్టుబడి సంచయన క్రమంలో ఉత్పత్తికి, సామాజిక పునరుత్పత్తికి ఉన్న సంబంధాల క్రమంలో ఈ అంశాలను గురించి కొంతమేరకు మూల్యాంకనం చేస్తాను. రెండవ భాగంలో తొలినాళ్ళలో కమ్యూనిస్టు ఉద్యమంలో మహిళల పాత్ర గురించి చర్చిస్తాను. మూడో భాగంలో వర్గ ఆధారిత ఉద్యమాలకు, పితృస్వామ్య వ్యతిరేక చైతన్యవంతమైన ఉద్యమాలు నిర్మించడానికి ఉన్న సంబంధాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తాను.

(1)

పెట్టుబడిదారీ విధానంలో దోపిడీ రేటును పెంచుకోడానికి పితృస్వామ్య అధికారం, అందుకు సంబంధించిన సంస్థల అవసరం తప్పనిసరి అన్న విషయం అందరికి తెలిసినదే. పితృస్వామ్య వ్యవస్థ సామాజిక సంబంధాలను సాంప్రదాయంగా వస్తున్న లింగ ఆధారిత పని విభజన మీద ఆధారపడి నిర్మిస్తుంది. ఇది మహిళల పనికి గుర్తింపు ఇవ్వదు. లెక్కలోకి తీసుకోదు. కానీ అదనపు విలువని వెలికితీసే ఉత్పత్తి చట్రంలో మహిళల శ్రమ భాగమవుతుంది. అదనపు విలువను పెంచడానికి దోహద పడుతుంది. మొత్తంగా సమాజంలో జరిగే ఉత్పత్తి నుండి పొందే అదనపు విలువను పెంచదానికి మహిళల శ్రమశక్తి తోడ్పడుతుంది గాని అందుకుగాను ఏ మాత్రం ప్రతిఫలం తీసుకోదు. అంటే సమాజంలో జరిగే ఉత్పత్తి చట్రంలో ఆమెకు పాత్ర ఉందిగానీ దాని నుండి పొందే ప్రతిఫలంలో భాగం లేదు. అంటే అదనపు విలువ పొందే మొత్తం వ్యవస్థలో పితృస్వామ్య అధికారానికి, కార్మికవర్గ దోపిడికి ప్రత్యక్ష సంబంధం ఉంది. అందువలన వర్గ విభజనే లింగ విభజన మీద ఆధారపడింది. అంటే పరిహారం చెల్లించని మహిళల పనిపై పెట్టుబడిదారీ, కార్మికవర్గ సంబంధాలు ఆధారపడి ఉన్నాయి. పెట్టుబడిదారీ విధానం ఎంతవరకు కుటుంబ వ్యవస్థలోకి చొచ్చుకుని పోయింది అనే దానిపై చెల్లింపులు చేయాల్సి వచ్చే పనిలో మహిళల భాగస్వామ్యం ఎంత ఉంటుందనేది ఆధారపడి ఉంటుంది. మహిళలు 'గృహిణులు'గా మారడంపై జరిగిన చర్చలో మహిళలు ప్రైవేటు ఆస్తులుగా మారడాన్ని నిశితంగా ఎత్తిచూపారు. ఈ అర్థంలో చూసుకుంటే మహిళలపై అదనంగా పడుతున్న పని భారం–పరిహారం లేని పనిగాని, సామాజికంగా పునరుత్పత్తి భారంగానీ, వేతనాలలో వివక్షగాని– అదనపు విలువను వెలికితీసే పెట్టుబడిదారీ సమాజం యొక్క విస్తృత పరిధిలోని భాగంగా కనపడుతుంది. అంటే సామాజిక సంబంధాలైన పునరుత్పత్తిలోని పితృస్వామ్య వ్యవస్థ ప్రముఖ భాగమని, అది లేకుండా ఆర్థికదోపిడీ కొనసాగించడం గాని, పెంచుకోవడం గాని అసాధ్యమని అర్థం అవుతుంది. సంచయనం నిరంతరం కొనసాగే విస్తృత విధానంలో, మహిళలు అత్యధికంగా అణచివేయబడుతున్న ప్రత్యేక విభాగాలకు ఎందుకు పరిమితమవుతున్నారో, ఎందుకు నిరంతరం వివక్షకు గురవుతున్నారో ఈ దృక్పథం తెలియచేస్తుంది.

ఈ అవగాహన ఫెమినిస్టుల అవగాహనకు పూర్తిగా భిన్నమైనది. ఈ అంశానికి సంబంధించిన ఒక ప్రముఖ

పుస్తకంలో ప్రపంచంలో లింగ ఆధారితంగా కేంద్రీకరించబడి వంశపారంపర్య సామాజిక వ్యవస్థను ఫెమినిస్టు దృక్పథం గలవారు గుర్తిస్తారని పేర్కొన్నారు. సామాజిక జీవితాన్ని కొనసాగించటానికి లింగ విభజనను ఒక సాధనంగా వినియోగిస్తున్నారని చెబుతారు. అదేసమయంలో ప్రపంచంలోని ప్రతి ప్రధానమైన స్థానానికి మహిళలు దూరంగా ఉంచబడతారని ఫెమినిస్టులు భావిస్తుంటారు. లింగ ('మగవారు', 'మహిళ'గా విభజించబడిన సామాజిక ఉత్పత్తి) విభజన, వ్యవస్థ నిర్మాణ స్వరూపంలోనే 'మహిళ, మగవారు' అనే అసమానతలు ఉన్నట్టు, మహిళలు అణచివేతకు గురవుతున్నట్టు అటువంటి విశ్లేషణ ఉంటుంది. అందువలన లింగవిభజన, అణచివేత పెట్టుబడిదారీ సమాజం పరిధికి ఆవల ఉంటుందని భావించటంతో అన్నిరకాల అణచివేతలు లింగ విభజనకు ఆపాదించబడతాయి కానీ పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో భాగంగా పరిగణించబడవు. అటువంటి విశ్లేషణ వలన 'వర్గం, పెట్టుబడిదారీ విధానం' అనేవి రెండో స్థానానికి నెట్టబడతాయి. మహిళలు ఒక 'జాతిగా' గుర్తించబడతారు. వారు 'స్వావలంబన' కార్యక్రమాలలోకి మళ్లించబడడానికి సిద్ధంగా ఉన్నట్టు పరిగణించబడతారు. అయితే ఈ కార్యక్రమాల నిర్వహణ కూడా పురుషుల ఆధీనంలోనే జరుగుతున్నాయని మహిళలకు స్థానంలేకుండా పోతున్నదని ఫెమినిస్టు విమర్శకులు వాపోతున్నారు. పితృస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగే ప్రజాస్వామ్య ఉద్యమాలలో మహిళల పాత్రను ఈ దృక్పథం విస్మరిస్తుంది.

ఫెమినిస్టులు సమాజంలో మహిళలను చూసే సైద్ధాంతిక అవగాహనలో మరో లోపం ఉంది. సమాజంలో వారిస్థానం లింగ వివక్ష, మహిళ అనే ముద్ర వలన ఏర్పడుతున్నదని, అంతే కానీ అదనపు విలువ కొల్లగొట్టడానికి కాదనేది వారి అభిప్రాయం. ఇంటి పరిధిలో మాత్రమే కాదు, అస్పృశ్యత, అస్పృస్యుల పనికి సంబంధించి కూడా లింగ విభజనే అసమానతలకు మూలమంటారు ఫెమినిస్టులు. అంతేకాదు, 'అదనపు విలువ సిద్ధాంతం ' వర్ణ విభజనపై ఆధారపడిన సమాజానికి వ్యతిరేకంగా ఉంటుందన్న అభిప్రాయం ఉంది. మహిళ శ్రమ ఏ మాత్రం 'విలువ లేనిదిగా' పరిగణించబడుతున్నదని జాన్ వాదించారు. అనేక రంగాలలో మహిళలు అణచివేయబడుతున్నారని,

" ఇప్పుడున్న సైద్ధాంతిక పరిమితులలో వర్గాల ఏర్పాటు, సామాజిక వివక్ష మధ్య ఉన్న సంబంధాన్ని మార్క్సిస్టు ఫెమినిస్టులు విశ్లేషించవలసిన అవసరం ఉంది. ఈ విశ్లేషణ చేయాలంటే సామాజిక పునరుత్పత్తి క్రమాన్ని వీలయినంత విస్తృతంగా పరిశీలించాలి. సామాజిక పునరుత్పత్తి కేవలం పరిహారంలేని పనిమీదే ఆధారపడిలేదు. ఏదయినా ఒక సామాజిక తరగతికి మాత్రమే ఆపాదించలేని సామాజిక విధానాలు, సాంప్రదాయాలు, నీతినియమాలుపై కూడా ఆధారపడి ఉంటాయి. "




పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా న్యూఢిల్లీలో మహిళల ప్రదర్శన

అణచివేతకు గురవుతున్న మహిళలను ప్రత్యేకమైన పనులకు పరిమితం చేయడం జరుగుతున్నదని జాన్, ఇతర ఫెమినిస్టులు ఉపయోగించిన 'విలువ'కి పరిమితులున్నాయి. ఎందుకంటే ఇది సామాజిక ఉత్పత్తి/ పునరుత్పత్తులను, అదనపు విలువను వెలికితీయడం నుండి వేరుచేస్తుంది. ఇది శ్రమ సిద్ధాంతాన్ని 'ఆర్థిక కుదింపు'గాను, ఉపరితల నిర్మాణాన్ని శ్రమ విలువ గాను పరిగణిస్తుంది. పెట్టుబడిదారీ విధానం పెట్టుబడి సంచయనంలో శ్రమను అగౌరవపరచడాన్ని చూడదు. పెట్టుబడిదారీ విధాన ఫలితంగా ఏర్పడే 'పరిహారం లేని పనికి ఉండే' కళంకాన్ని' విశ్లేషించదు. గృహశ్రమకి, గృహ వెలుపలి శ్రమకి ఉండే తేడాని విస్మరిస్తుంది. ఈ వాస్తవాలను విస్మరించడం వలన ఇది పబ్లిక్/ ప్రైవేట్ స్వేచ్ఛ అనే ఉచ్చులో ఇరుక్కుపోయింది. అందువలనే పెట్టుబడిదారీ విధానంలో వ్యవస్థాపరంగా అసమానతలను పెంచే పితృస్వామ్య భావజాల పాత్రను, సామాజిక వ్యవస్థలో పెరుగుతున్న ప్రభావాన్ని పూర్తిగా విస్మరించింది.

ఇప్పుడున్న సైద్ధాంతిక పరిమితులలో వర్గాల ఏర్పాటు, సామాజిక వివక్ష మధ్య ఉన్న సంబంధాన్ని మార్క్సిస్టు ఫెమినిస్టులు విశ్లేషించవలసిన అవసరం ఉంది. ఈ విశ్లేషణ చేయాలంటే సామాజిక పునరుత్పత్తి క్రమాన్ని వీలయినంత విస్తృతంగా పరిశీలించాలి. సామాజిక పునరుత్పత్తి కేవలం పరిహారంలేని పనిమీదే ఆధారపడిలేదు. ఏదయినా ఒక సామాజిక తరగతికి మాత్రమే ఆపాదించలేని సామాజిక విధానాలు, సాంప్రదాయాలు, నీతినియమాలుపై కూడా ఆధారపడి ఉంటాయి. మహా అయితే పితృస్వామ్య వ్యవస్థ, కులం, జాతి, వంశ పారంపర్యానికి సంబంధించిన తరగతులు ఏర్పాటు చేసినట్టే,

**"విస్తృతమైన కార్మికోద్యమ నిర్మాణానికి స్త్రీ, పురుషుల ఐక్యత అవసరమని పై ఉటంకింపు సూచిస్తున్నది. ఈ ఐక్యత సాధ్యపడాలంటే మహిళలు ఇళ్లలో అనుభవిస్తున్న బానిసత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఒక సైద్ధాంతిక విధానాన్ని ఆమోదించవలసి ఉంది. 'కమ్యూనిస్టు మహిళలు' ఇతర ఫెమినిస్టు గ్రూపుల నుండి తమని తాము స్పష్టంగా వేరుచేసి చూపించుకున్నారు."**

సమాజంలో సామాజిక, ఆర్థిక ఆధిపత్యం కొనసాగించడానికి వాటిని మరింత బలోపేతంచేసి ఉండవచ్చు. అంటే పెట్టుబడిదారీ విధానం కొనసాగించడానికి సామాజిక క్రమం అవసరం ఉంది. అది పెట్టుబడిదారీ సంచయనం వేర్వేరు స్థాయిలలో జరగడానికి అనుకూలంగా మార్పులు చెందుతూ ఉంటుంది. అందువలనే సామాజిక వ్యవస్థ, పితృస్వామ్య వ్యవస్థలో మారుతూ ఉంటుంది. ఉదాహరణకి మహిళలు పరిహారం గల పనికి వెళ్ళడానికి ఎన్నో సామాజిక, సాంస్కృతిక అవరోధాలు కుటుంబంలోనే ఉన్నాయని ఎంతోమంది ఫెమినిస్టులు అంటుంటారు. కానీ చారిత్రికంగా చూస్తే, దళిత ఆదివాసీ మహిళలు ఎటువంటి అవరోధాలను ఎదుర్కోలేదు. వారు పనిలోకి ఎప్పుడూ వెళుతూనే ఉన్నారు. మరే ఇతర సామాజిక తరగతి కన్నా మొత్తం పనిలో వారి పాత్ర ఎక్కువగానే ఉంది. కానీ ఇందువలన పితృస్వామ్య వ్యవస్థకు ఎటువంటి భంగం కలగలేదు, సరికదా పురుషాధిక్యత, అధికారం బాహాటంగా కనిపిస్తూనే ఉన్నాయి. లైంగిక దోపిడీ, పరిహారం లేని పని పెరుగుతూనే ఉంది. ఉత్పత్తి సాధనాలపై ఆధిపత్యం, వాటిని అదుపు చేయటం కోసం సామాజిక ఆధిపత్యం ఉన్న తరగతులు వ్యక్తిగత నీతినియమాలను బద్దలుకొట్టాయి. ఈ నేపథ్యంలో అక్కడున్న భౌతిక పరిస్థితులు, సామాజిక ఆధిపత్యం వలన కొన్ని కులాలు, సామాజిక తరగతులు పెట్టుబడి సంచయనంలో ముందున్నాయి. ఈ క్రమాన్ని మార్క్స్ తన భాషాశాస్త్ర నోట్ పుస్తకాలలో పేర్కొన్నాడు. ''పాత వ్యవస్థలోని వాస్తవాలు ధ్వంసం అవుతుంటాయి. నాశనమైపోతూ తిరిగి నిర్మించబడుతుంటాయి" అని మార్క్స్ రాశారు. మోర్గాన్‌ని విమర్శిస్తూ మార్క్స్ ఈ విధంగా వాదించారు: "వెనకటి రోజుల్లో కుటుంబం సమాజం యొక్క సూక్ష్మ రూపం. అది ఏకపత్నీత్వం మీద, సంబంధిత బాహ్య సామాజిక సంస్థల మీద ఆధారపడి ఉంటుంది" అందువలన కుటుంబం ఆవలి శక్తులు, బాహ్య సంబంధాల వలన 'కుటుంబంలో వైరుధ్యాలు' ఏర్పడుతుంటాయి. చారిత్రికంగా వర్గ వైరుధ్యాలు అభివృద్ధి చెందిన క్రమంలోనే పితృస్వామిక వ్యవస్థ ఏర్పడిందని మనం అర్థం చేసుకోవాలి. మార్క్స్ స్వయంగా ఈ భావనను విస్తృతపరిచారు. ఆస్తులు కలిగి ఉండడం 'కుటుంబంలో నిగూఢమైన బానిసత్వానికి దారితీస్తున్నదని గుర్తించారు. (మార్క్స్ 1845). ఈ అర్థంలో వర్గ సమస్య కేంద్ర బిందువుగా (యాజమాన్యంతో అనుబంధంగా ఉండడం వలన) సోషలిస్టు, మార్క్సిస్టు ఫెమినిస్టుల చేత పితృస్వామ్యం చారిత్రీకరించబడింది. ఇక్కడే మహిళా స్వేచ్ఛ కోరుకునే మార్క్సిస్టు సిద్ధాంత వేత్తలకు, ఇతర ఫెమినిస్టులకు మధ్య బేధం ఉంది.

× × ×

కమ్యూనిస్టు ఉద్యమ ప్రాచీన చరిత్ర పరిశీలిస్తే, భారత కమ్యూనిస్టు పార్టీ పితృస్వామ్య వ్యవస్థకి వ్యతిరేకంగా పోరాటాలను నిర్మించడంలో ప్రముఖమైన పాత్రను పోషించినట్టు గ్రహిస్తాం. ఆ క్రమంలో అది ఒక వైపు అంతర్జాతీయ సోషలిస్టు మహిళా సదస్సుతో, మరో వైపు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లోని ప్రముఖ మహిళా నాయకులతో ప్రభావితమైంది. 20వ శతాబ్దం ప్రారంభం నుండి కమ్యూనిస్టు ఉద్యమ మహిళా నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్మికులపై పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రభావాన్ని విశ్లేషిస్తున్నపుడు, వర్గ చైతన్యం ఏ మేరకు అభివృద్ధి చెందిందో కూడా పరిగణనలోనికి తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. మొదటి అంతర్జాతీయ సోషలిస్టు సదస్సులో అలెగ్జాండర్ కొల్లంతాయి తన ప్రసంగంలో ఈ విధంగా పేర్కొన్నారు.

"మొత్తం బూర్జువా ప్రపంచమంతా ఆలకించింది... శ్రామిక మహిళల బలమైన గళం విని అందులో చాలామంది కోపోద్రిక్తులయ్యారు. పురుషులు ఎంత తీవ్రమైన ప్రసంగాలు చేసినా, ఎంత పిచ్చి తీర్మానాలు ఆమోదించినా వాటిని భంగపరిచేందుకు తమ వద్ద ఖచ్చితమైన ఆయుధం ఉందని బూర్జువావర్గం గట్టిగా నమ్మేది: తల తిరిగిన పొగరుబోతుల పొగరణచడానికి అణగివుండే మహిళలను వారిస్థానంలో నియమించుకోవచ్చని వారి అభిప్రాయం. కానీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉండే శ్రామిక మహిళల ప్రతినిధులు ఒకచోట చేరి, ఐక్యమై, ఒక కొత్త ఆయుధాన్ని కార్మికుల శత్రువులపై ప్రయోగించడానికి సిద్ధమవడం వారిని నివ్వెరపరచింది. ధైర్యవంతులైన మహిళలు అందరి అంచనాలను తలక్రిందులు చేసారు. నిన్నటి వరకు అన్నింటిని మౌనంగా భరించిన బానిస నేడు కార్మికవర్గ స్వేచ్ఛకోసం ధైర్యంగా పోరాడుతున్నది"(కొల్లంతయి 1907).

విస్తృతమైన కార్మికోద్యమ నిర్మాణానికి స్త్రీ, పురుషుల ఐక్యత అవసరమని పై ఉటంకింపు సూచిస్తున్నది. ఈ ఐక్యత సాధ్యపడాలంటే మహిళలు ఇళ్లలో అనుభవిస్తున్న బానిసత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఒక సైద్ధాంతిక విధానాన్ని ఆమోదించవలసి ఉంది. 'కమ్యూనిస్టు మహిళలు' ఇతర ఫెమినిస్టు గ్రూపుల నుండి తమని తాము స్పష్టంగా వేరుచేసి చూపించుకున్నారు. వారు మహిళల రాజకీయ, ఆర్థిక హక్కుల కోసం పోరాడారు. 1922లో క్లారా జెట్కిన్ రాసినట్టు కమ్యూనిస్టులు మహిళలలో రెండు లక్ష్యాలతో పనిచేయాలి. మొదటిది, మహిళలను నిర్మాణంలోనూ, సిద్ధాంతంలోను కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో మమేకం చేయడం. రెండు, సాధారణ మహిళలందరిని శ్రామికవర్గ పోరాటాలలో పాల్గొనేటట్టు ప్రోత్సహించడం. అంతే కాదు, ఆమె ఇలా రాశారు:

''ఒక విషయం స్పష్టంగా ధృవీకరించబడింది. సైద్ధాంతికంగా కమ్యూనిస్టులు మహిళలతో ఎంతగట్టిగా సంబంధాలు కలిగి ఉండేటట్టు పని చేసినప్పటికీ, ఆ పని చేయడానికి ప్రత్యేకమైన సంస్థల అవసరం ఉంది. కమ్యూనిస్టులు మహిళలలో పని చేయడమంటే అది కేవలం మహిళలకు సంబంధించిన పని మాత్రమే కాదు. ఆయా దేశాలలోని కమ్యూనిస్టు పార్టీల, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్, మొత్తం కమ్యూనిస్టు ఉద్యమం

> **"కమ్యూనిస్ట్ పార్టీ నెలకొల్పిన కమ్యూన్లు కొత్త కుటుంబ సంబంధాలను ఏర్పరిచాయి. మహిళా కార్యకర్తలు స్వతంత్ర భావాలు పెంచుకోవటానికి సహకరించాయి. కార్య కర్తల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడేందుకు తోడ్పడ్డాయి. వీటిలో కూడా మహిళా కార్యకర్తలు చాలాసార్లు సాంప్రదాయంగా వస్తున్న లింగ ప్రాతి పదికన జరిగే పని విభజనను ఎదుర్కోవలసి వచ్చినది నిజమే అయినా విస్తృత ఉద్యమం, దాని సిద్ధాంతం మహిళా కార్య కర్తలకు తమను తాము నాయకులుగా ఎదిగేందుకు ఒక వేదికను కల్పించింది."**

చేయాల్సిన పని. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే ఐక్యంగా, ఒక క్రమపద్ధతిలో కమ్యూనిస్టు సమాజం ఏర్పడాలనే లక్ష్యంతో మహిళలతో మనం పనిచేయాలి.

అంటే జెట్కిన్ ఇతర ఫెమినిస్టు నాయకులలా కాకుండా కమ్యూనిస్టు మహిళ తనకు తానే ఒక నాయకురాలిగా, కార్యకర్తగా భావించి సమసమాజం సాధించడం కోసం జరిగే పోరాటంలో భాగస్వామి కావాలని కోరుకుంది. అదే సమయంలో కమ్యూనిస్టు కార్యకర్తలు, నాయకులూ పితృస్వామ్య సిద్ధాంతాలకు వ్యతిరేకంగా కార్మికవర్గంలోని అన్ని రంగాలలో వీలయినంత ఎక్కువమందిని ఐక్యపరిచి, విశాల వేదికను నిర్మించేందుకు కృషిచేయాలి. అన్నిరంగాలలో మహిళలను కలవాలి. అన్ని అవరోధాలను తొలగించాలి.

భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ సమయంలోనే ఇటువంటి దృక్పథం ఉండడం వలన ఇక్కడి కమ్యూనిస్టులు కూడా ప్రారంభ దినాలలో క్రమబద్ధమైన ప్రకటన చేయకపోయినా ఇటువంటి రాజకీయ అవగాహనతోనే పనిచేశారు. జాతీయ పోరాటమనే విశాలవేదికలో కార్మికులను సంఘటితపరిచి, వారి ఆశలు నెరవేర్చడానికి కృషి చేశారు. పట్టణాలు, పల్లెలలోని శ్రామిక మహిళలు కూడా సమ్మెలలో చురుకుగా పాల్గొన్నారు. వర్గ, ప్రజాసంఘాలలో మహిళా కమిటీలు ఏర్పాటు చేయడం వలన కమ్యూనిస్టులు 1940ల మొదటిలోనే కార్మికవర్గ కుటుంబాలను చేరుకోగలిగారు. వీటిలో మొదట్లో మహిళా ఆత్మ రక్షా సమితి(బెంగాల్) సెల్ఫ్ డిఫెన్స్ లీగ్(పంజాబ్) మహిళా సంఘం (ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర), అల్ కేరళ ఉమెన్స్ అసోసియేషన్, అటువంటివే మరికొన్ని ఏర్పడ్డవి. ఈ సంఘాలన్నీ విద్యార్థినుల సమస్యలపై పనిచేశాయి. కమ్యూనిస్టులు మారుమూల గ్రామీణ ప్రాంతాలతో సంబంధాలను ఏర్పరచుకోవడానికి, తమ ప్రభావాన్ని పెంచుకోడానికి ఇవన్నీ పునాదులుగా పనిచేశాయి. మహిళలపై సాంప్రదాయ జాతీయవాద ప్రభావం ఉన్న ప్రాంతాలలో కూడా విస్తరించటానికి ఉపయోగపడ్డాయి. కమ్యూనిస్టు మహిళలు తమ సోదరిల కోసం పనిచేసినట్లే తమ తోటివారితోను, శ్రామిక మహిళలతోను కూడా కలిసి పనిచేశారు. "ఆ రోజుల్లో కమ్యూనిస్టు పార్టీకి మమ్మల్ని ఇంటి నుంచి బయటికి పిలిచే ధైర్యం ఉండేది. ఇంట్లో కూచోడం ఇష్టం లేనివారు బయటికి రండని పిలుపునిచ్చింది. కమిటీ సభ్యత్వం ఒక్కసారిగా ఏడింతలు పెరిగింది. మహిళలకు ఒక నమ్మదగిన స్థానం దొరికింది... కమ్యూనిస్టు పార్టీ నన్ను నా కాళ్ళ మీద నిలబడేటట్టు చేసిందన్న విషయాన్నీ నేనెన్నడూ మరచిపోను" అని ఒకానొక ముఖాముఖిలో వాణిదాస్‌గుప్తా పేర్కొన్నారు.

కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేసిన కమ్యూన్లు కొత్త కుటుంబ సంబంధాలను ఏర్పరిచాయి. మహిళా కార్యకర్తలు తమ స్వతంత్ర భావాలను పెంచుకోవటానికి ఇవి సహకరించాయి. కార్యకర్తల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడేందుకు తోడ్పడ్డాయి. ఈ కమ్యూన్స్‌లో కూడా మహిళా కార్యకర్తలు చాలాసార్లు సాంప్రదాయంగా వస్తున్న లింగ ప్రాతిపదికన జరిగే పని విభజనను ఎదుర్కోవలసి వచ్చినది నిజమే అయినా విస్తృత ఉద్యమం, దాని సిద్ధాంతం మహిళా కార్యకర్తలకు తమను తాము నాయకులుగా ఎదిగేందుకు ఒక వేదికను కల్పించింది. కమ్యూన్లు బూర్జువా నీతికి భిన్నమైన 'కొత్త నీతి'గల తాత్విక చింతన కూడా ఏర్పరించేందుకు సహకరించాయి. సుందరయ్య వివరించినట్టు పార్టీ కమిటీలకు మహిళలు మగవారు సమానమన్న సూత్రం మార్గదర్శకంగా ఉండేది. మహిళలకు తమ జీవిత భాగస్వామిని ఎన్నుకునే హక్కు ఇష్టం లేకపోతే విడాకులు తీసుకునే హక్కు, మళ్ళీ పెళ్లి చేసుకునే హక్కు ఉండేవి... ఇది ప్రజా ఉద్యమం, సామాజిక సంబంధాలు అభివృద్ధి చెందడానికి ఎంతగానో తోడ్పడింది(సుందరయ్య 1972. పేజీ 263). ఈ నీతి కమ్యూన్లలోని సభ్యులు వ్యక్తిగత ఆస్తులు కలిగి ఉండకూడదన్న సూత్రంపై ఆధారపడి ఉండేది. కమ్యూన్‌లలో పిల్లల బాధ్యత కమ్యూన్ మొత్తానిది. అలా పిల్లల బాధ్యత ఒక్క తల్లికే లేకపోవడం వలన మాతృత్వ ఆలోచనలోనే పెద్ద మార్పు వచ్చింది. అలెగ్జాండర్ కొల్లంతాయి రష్యా అనుభవాలను వివరించారు.

"**శ్రామిక వర్గ విముక్తి కోసం పోరాడే మహిళలు పాత భావాలకు తావు లేదని తెలుసుకోవాలి.** తన పిల్లలు తనకు మాత్రమే స్వంతమని, వారికి మాత్రమే తన ప్రేమ దక్కుతుందని, మిగిలిన పిల్లలు ఇతరుల పిల్లలని, వారితో తన కెటువంటి సంబంధం లేదని, వారిని లక్ష్య పెట్టనవసరం లేదని, వారు ఆకలితో ఉన్నా, చలితో బాధపడుతున్నా పట్టించుకోనక్కరలేదని అనుకునేందుకు వీలులేదు. శ్రామిక మహిళ తల్లిగా తన పిల్లలకు ఎదుటివారి పిల్లలకు మధ్య తేడాను మరిచిపోవాలి. అందరిని రష్యా కమ్యూనిస్టు, కార్మికుల పిల్లలుగా భావించాలి"(కొల్లంతయి 1977).

కమ్యూన్లలో ఈ అవగాహన ప్రతిఫలించిందని, అది కమ్యూనిస్టు మహిళలు వర్గ పోరాటాల్లో పాల్గొనేందుకు ఎంతగానో సహకరించిందని, అనేకమంది రచయితలు రాశారు. అన్నిటిలో ఉషాతాయి డాంగే కథ హృద్యమైనది(ఆమె ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కార్మికసంఘ నాయకురాలు). ఆమె 1929 మేలో రోజా అనే కూతురికి జన్మనిచ్చింది. 1929లో బొంబాయి మిల్లు కార్మికుల సమ్మె జరుగుతున్న సందర్భంగా ఆమె కూతురిని వదిలి రావలసి వచ్చింది. సమ్మెలో ఉన్న ఎంతోమంది అమ్మల పెంపకంలో పెరగడం వలన తన కూతురుకు ఎంతోమంది అమ్మలు ఏర్పడ్డారని, అందువలన ఆమెకు పెద్ద కుటుంబం ఏర్పడిందని అన్నారామె. ఈ ఉదాహరణ సాంప్రదాయ కుటుంబ వ్యవస్థ సంకెళ్లు తెంపడం వలన కమ్యూనిస్టు అలవాట్లు ఏర్పడతాయని, కమ్యూనిస్టు ఉద్యమానికి ఇటువంటి పునాదులు లేకుండా ఉద్యమ లక్ష్యం నెరవేరదని తెలియచేస్తుంది. ఎంతోమంది కమ్యూనిస్టు మహిళలు ఉద్యమంలో చురుకుగా

> **" ఈ చర్చ సందర్భంలో ఒక ప్రశ్న ముందు కొస్తుంది: కమ్యూనిస్టుల లక్ష్యం అంతిమంగా సోషలిస్టు సమాజ స్థాపన, సంపద పంపిణీ అయినపుడు అది అంతర్గతంగా పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకం కాదా? ఈ ప్రశ్నకు సమాధానం, మరియా మిస్ విశ్లేషణలో కనిపిస్తుంది. "**

పనిచేసేందుకు వీలు కలగమే ఈ వ్యూహం సఫలమయిందనడానికి నిదర్శనం. బొంబాయి మిల్లు కార్మికుల సమ్మెకు ఆమె నాయకత్వం వహించగా 1938 లో సి.ఓ. పొన్నమ్మ నాయకత్వంలో ట్రావెన్‌కూర్ లేబర్ అసోసియేషన్ 'సాధారణ సమ్మెకు' పిలుపునిచ్చింది. మహిళలలో నాయకత్వ లక్షణాలు ఉన్నాయనడానికి అహల్య రగ్నేకర్‌లాంటి మహిళామణులే నిదర్శనం. ఆమె ముంబైలో శ్రామిక మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశారు. 1940లలో గోదావరి పరులేకర్ నాయకత్వంలో జరిగిన వర్లి తిరుగుబాటు మరో ఉదాహరణ. ఆమె తదనంతర కాలంలో అఖిల భారత కిసాన్ సభకు అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. చిట్టగాంగ్ ఆయుధాగారం కొల్లగొట్టడంలో తెగువ చూపిన కల్పనాదత్త, ప్రీతిలత, తెభాగా పోరాటకాలంలో ఉత్తర బెంగాల్‌లోని నాచోళిలో ఆయుధాగారంలో తిరుగుబాటుకి నాయకత్వం వహించిన ఇలా మిత్ర మరికొన్ని ఉదాహరణలు. ఇంకా ఎన్నో సంఘటనల మధ్య ఇవి కొన్ని ఎన్నదగ్గవి. ఇవి రైతాంగ, కార్మికవర్గ కుటుంబాల నుండి వచ్చిన మహిళలు వర్గ పోరాటాలను ఎలా ప్రభావితం చేయగలరో చూపించాయి.

పితృస్వామ్య వ్యవస్థని ఎదిరించడమనే సామాజిక సమస్యను ఎప్పుడూ విస్మరించలేదన్నది ఇక్కడ గుర్తించవలసిన ఒక ముఖ్యమైన అంశం. ఉదాహరణకి ఆంధ్ర మహిళా సభలో చురుకుగా పనిచేసే కార్యకర్తలు (తెలంగాణ పోరాటానికి ముందు) బాలికల విద్య గురించి, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా చురుకుగా ప్రచారం చేశారు. అలాగే అలెప్పిలో బాలురు, బాలికలు కలిసి కుల అడ్డుగోడలు భగ్నం చేసే ప్రచారంలో కలిసి పనిచేశారు. పితృస్వామ్య వ్యవస్థకి వ్యతిరేకంగా పనిచేసారు. సామాజిక సంస్కరణలలో భాగంగా పితృస్వామ్య విధానాలను ఎదిరిస్తూనే, మహిళలు భూస్వాముల 'ఉంపుడు కత్తెలను' విముక్తి చేసారు. అత్యాచారాలు, ఎత్తుకుపోవడాలు మొదలయిన లైంగిక హింసలకు వ్యతిరేకంగా పనిచేశారు. మహిళా కామ్రేడ్స్‌ని, మహిళలను రక్షించడానికి మహిళలు నాయకత్వం వహించిన అన్ని మిలిటెంట్ పోరాటాలలోను ఇటువంటి ఘటనలు కనిపిస్తాయి. కొన్నిసార్లు భూస్వాముల భూములను ఆక్రమించుకొనే పోరాటాలకు, అటవీ భూములు ఆక్రమించుకోడానికి జరిగిన పోరాటాలకు కూడా మహిళలు నాయకత్వం వహించారు. వర్లి పోరాటం ఇందుకు ఉదాహరణ. అందువలన మహిళా కామ్రేడ్లు విభిన్నమైన కర్తవ్యాలు నిర్వహించి కమ్యూనిస్టు ఉద్యమంలోని పితృస్వామ్య వ్యతిరేక పోరాట బలాన్ని పెంచుతూ, అందులో తమ ప్రభావాన్ని కూడా పెంచుకున్నారు.

× × ×

**పైన చర్చ సందర్భంలో ఒక ప్రశ్న ముందుకొస్తుంది:** కమ్యూనిస్టుల లక్ష్యం అంతిమంగా సోషలిస్టు సమాజ స్థాపన, సంపద పంపిణీ అయినపుడు అది అంతర్గతంగా పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంకాదా? ఈ ప్రశ్నకు సమాధానం, మరియా మిస్ విశ్లేషణలో కనిపిస్తుంది:

లింగ ప్రాతిపదికన పని విభజనను మనం ఇంకెంత మాత్రం కుటుంబ సమస్యగా మాత్రమే చూడకూడదు. ఇది మొత్తం సమాజ నిర్మాణానికి సంబంధించిన సమస్య. పురుషులు, మహిళల మధ్య క్రమానుగతంగా జరిగిన పని విభజన, దాని గతి అప్పుడున్న ప్రధాన ఉత్పత్తి సంబంధాలలో ఒక అంతర్గత భాగమవుతుంది. అంటే ఆ కాలంలో సమాజంలోని ఒక ప్రత్యేకవర్గ సంబంధం అవుతుంది. అదే సమయంలో విస్తృత జాతీయ, అంతర్జాతీయ శ్రమ విభజనలో భాగమవుతుంది.

పితృస్వామ్యం, వర్గ దోపిడి అంతర్గతంగా ఇమిడి ఉన్న ఒక సామాజిక నమూనా ఈ విశ్లేషణలో ఉంది. ఈ వాస్తవాన్ని మార్క్స్, ఎంగెల్స్‌లు కూడా తమ రచనలలో విశ్లేషించారు. ఎంగెల్స్ విశదపరిచినట్టుగా వ్యక్తిగత ఆస్థి పెట్టుబడిదారీ విధానానికి ముందు ఉంది. అందువలన వ్యక్తిగత ఆస్థిపై ఆధిపత్యం అన్నది కూడా పితృస్వామ్య విధానంలో ఒక భాగం అవుతుంది.

భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం తొలి దినాలలోనే పితృస్వామ్య వ్యవస్థ నిజ స్వరూపాన్ని తమ పోరాటాలతో బట్టబయలు చేసింది. ఇందుకు థానే జిల్లాలోని 'లగ్నగడి' ఉద్యమం ఒక మంచి ఉదాహరణ. కొంతమంది వృద్ధ కమ్యూనిస్టు నాయకులు చెప్పినట్లు లగ్నగడి సంప్రదాయం ఉన్నత వర్గ భూస్వాముల దోపిడీకి నిదర్శమైన పరమ నీచ సంప్రదాయం. రైతు పెళ్లినాటికి భూస్వాములకు బకాయిపడితే రైతుల భార్యలను బానిసలుగా తెచ్చుకునే సంప్రదాయమిది. ఈ ఉద్యమ ప్రధాన లక్ష్యం మహిళలకు స్వేచ్ఛనివ్వడమే. భూస్వాముల ఇళ్లలోకి జొరబడి భౌతికంగా మహిళలను విడిపించారు. గడచిన వంద సంవత్సరాలలో ఇది ఎన్నదగిన ఉద్యమం. వర్గ పోరాటానికి మూలమైన ఒక అన్యాయమైన సామాజిక సంప్రదాయాన్ని విచ్ఛిన్నం చేయడం చాలా గొప్ప విషయం. వర్గ సంబంధాలలో ఇమిడి ఉన్న పితృస్వామ్య సంబంధాలను గురించి గోదావరి పరులేకర్ ఇలా రాశారు:

"భూస్వాములు తమవద్ద పనిచేస్తున్న కౌలుదారుల భార్యలను, తమకు బకాయిలున్న రైతుల భార్యలను తమ స్వంత ఆస్తిగా భావించేవారు. తమకు ఇష్టమైనప్పుడు వారిని అనుభవించే హక్కు తమకున్నదని తరతరాలుగా దృఢంగా నమ్ముతున్నారు. తమ కింద పనిచేస్తున్న స్త్రీలతో అసభ్యంగా మాట్లాడడం, ఎక్కడపడితే అక్కడ గిల్లడం, తోయడం, వారిని సందులోకి గొందుల్లోకి తీసుకెళ్లి చెరచడం సర్వసాధారణం... భూస్వాములు, అటవీ అధికారులు మహిళలను వారి లైంగిక కోరికలు తీర్చుకోవడానికి వాడుకునే వారు. ఇదెంత సాధారణమంటే భూస్వాములకు ఆదివాసీ మహిళలకు ఈ సంబంధాలతో పుట్టిన వారికి ఒక పేరు కూడా స్థిరపడింది. వారిని 'వాట్ల'లుగా పిలిచేవారు. వారికి ఒక ప్రత్యేక కులం కూడా ఏర్పడింది. ఈ పేరు కేవలం హిందూ భూస్వాములకే కాదు హిందూయేతర

భూస్వాముల పిల్లలకు కూడా వర్తించేది. వీరందరూ కలిసి వాట్లలను వృద్ధి చేయడంలో తమ పాత్ర పోషించారు".

ఈ రకమైన వర్గ అణచివేతలో ఆసక్తికరమైన అంశం ఏకంగా ఒక కులాన్ని సృష్టించడం. దీనివలన పితృస్వామ్య వ్యవస్థలో ఎన్ని రకాల వర్గ అణచివేతలనుండి కుల నిర్మాణం ఏర్పడిందో ఈ ఉదాహరణ తెలియచేస్తున్నది. పితృస్వామ్య సంస్థల వర్గ ఆధిపత్యాన్ని తెలియచేసే ఇటువంటి అనేక ఉదాహరణాలను చెప్పుకోవచ్చు. దీనర్థం అణగారిన తరగతికి చెందిన మహిళా శ్రామికురాలు ఇంట్లోనూ, ఇంటి బయట కూడా దోపిడీకి గురయ్యేది. అందువలననే మార్క్సిస్టు రచనలలో మహిళల సమస్య 'శ్రామికుల సమస్య'లతో ముడిపడి ఉంటుంది.

బూర్జువా రాజ్యం ప్రతిఘటనను అణచివేసే సందర్భంలో కూడా వర్గానికి, పితృస్వామ్యానికి ఉన్న సంబంధాన్ని చూడవచ్చు. ప్రతిఘటనని అణచివేసే వ్యూహంలో అత్యాచారాలు, మహిళల పట్ల హింస సాధనాలుగా పని చేస్తుంటాయి. మహిళా కార్యకర్తలు ఈ దాడులను ఎదిరించి, రాజ్య అణచివేతకు వ్యతిరేకంగా నిలిచారు, ఎదిరించారు. ఇందుకు ఒక ఉదాహరణను సుందరయ్యగారు ఇలా రాశారు:

గార్లలో ఒక పదిహేనేళ్ల బాలిక పట్టుబడి ప్రశ్నించబడింది. ఆ పరిగెడుతున్న మనిషి ఎవరు? (అతను ఆశ్రయం తీసుకుంటున్న ఒక ముఖ్యమైన కామ్రేడ్.) ఆమె వెంటనే అతను నా భర్త, పోలీసులను చూసి భయపడి పారిపోయాడు అని చెప్పింది. పోలీసులు సహజంగానే ఈ కథను నమ్మలేదు. ఆమెను చితకబాదారు. అత్యాచారం చేశారు. కానీ ఆమె ఎటువంటి రహస్యాలను చెప్పలేదు. ఆమె ముందు చెప్పిన కథకే కట్టుబడి ఉంది.

మరో ఉదాహరణలో ఇలా మైత్ర జైలులో ఉన్నప్పుడు తానొక 'సంతాల్ ఆదివాసి అని, మహిళ అని నిరంతరం తనకి గుర్తుచేసిన' సంఘటనని గుర్తు చేసుకున్నారు. 1940లలో వర్లి తిరుగుబాటు సందర్భంలో కూడా ఇటువంటి అనేక సంఘటనలు ఉన్నాయి. మహిళలు రక్షక దళాలుగా మారి మగవారిని రక్షించిన సంఘటనలు అనేకం. మగవారు పోలీసులనుండి తప్పించుకోడానికి అడవులలో దాక్కుంటే మహిళలే పోలీసులను ఎదిరించారు, వారితో కలబడ్డారు. వారి వేధింపులను ఎదుర్కొన్నారు. పోలీసుల ఆనుపానులు

**" కమ్యూనిస్టుల విముక్తి ఉద్యమాలను పితృస్వామ్య దృక్పథంగా విమర్శిస్తున్న ఫెమినిస్టులు పైన పేర్కొన్న చారిత్రిక కథనాల పర్యవసానాలను విస్మరించారు. మహిళలలో చైతన్యం పెరగడానికి, 'వ్యక్తిగతం' అన్నది 'రాజకీయం'గా మారడం, 'వ్యక్తిగత' 'ప్రజా' పరిధుల మధ్య హద్దులు చెరిగిపోవడానికి కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలు కారణం. ఈ పోరాటాలు ఇంకా కొనసాగుతున్నప్పటికీ ఇవి మహిళల పరిధులు విస్తృత పడడానికి, వాటిని అధిగమించడానికి దోహదపడ్డాయి. "**

పురుషులకు తెలపడమే కాక అనేకసార్లు పోలీసులను తప్పుదోవ పట్టించారు. ముఖ్యంగా భూస్వాముల, పోలీసుల దౌర్జన్యాలను ఎదుర్కొన్నారు. ఈ రకమైన భయంకరమైన వర్గ అణచివేత పితృస్వామ్య అధిపత్యానికి ప్రతీకగా ఉంటూ, తొలిదినాల వర్గ పోరాటాల స్వరూపాన్ని ప్రభావితం చేశాయి.

కమ్యూనిస్టుల విముక్తి ఉద్యమాలను పితృస్వామ్య దృక్పథంగా విమర్శిస్తున్న ఫెమినిస్టులు పైన పేర్కొన్న చారిత్రిక కథనాల పర్యవసానాలను విస్మరించారు. మహిళలలో చైతన్యం పెరగడానికి, 'వ్యక్తిగతం' అన్నది 'రాజకీయం'గా మారడం, 'వ్యక్తిగత' 'ప్రజా' పరిధుల మధ్య హద్దులు చెరిగిపోవడానికి కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలు కారణం. ఈ పోరాటాలు ఇంకా కొనసాగుతున్నప్పటికీ ఇవి మహిళల పరిధులు విస్తృతపడడానికి, వాటిని అధిగమించడానికి దోహదపడ్డాయి. కమ్యూనిస్టు మహిళలు తమ జీవిత గాథలలో కూడా వారికున్న సాంప్రదాయ కుటుంబ బంధనాలు తెంచుకొంటున్నపుడు వారిపై విధించిన ఆంక్షలను, సాంప్రదాయక కుటుంబ బంధాలను తాము తెంచుకున్న క్రమాన్ని వివరించారు. ఇటువంటి వారు కమ్యూన్లలో వారికి కావలసిన స్వేచ్ఛ పొందారు. 1940ల తరువాత కమ్యూనిస్టు మహిళలు చైతన్యవంతంగా ఉద్యమాలలో పాల్గొనడం, 1953లో నేషనల్ ఫెడరేషన్ అఫ్ ఇండియన్ విమెన్ ఏర్పడంలో మహిళా ఉద్యమాలలో పెరుగుతున్న కమ్యూనిస్టుల ప్రభావాల ప్రతిబింబం కనిపిస్తుంది. ఇవి పార్టీ నాయకులు మహిళల సమస్యలకు ప్రాధాన్యతనివ్వవలసిన అవసరాన్ని పెంచాయి. అందువలనే వర్గ పోరాటాలలో మహిళల డిమాండ్లయిన సమాన వేతనాలు, పిల్లల రక్షణ కేంద్రాలు, ప్రసూతి సెలవులు చేర్చబడ్డాయి. ఈ నాటికీ మహిళల వేదికలు ఈ కర్తవ్యాలపై తమ పోరాటాలు కొనసాగిస్తూనే ఉన్నాయి.

అయితే దీని ఉద్దేశం కమ్యూనిస్టు సంఘాలలో ఏ సవాళ్లూ లేవనికాదు. కమ్యూనిస్టు సిద్ధాంతవేత్తలు సమకాలీన మార్క్సిస్టు సిద్ధాంతంలోని వివిధ భావాలను ఉపయోగించుకుని ప్రస్తుత పెట్టుబడిదారీ నిర్మాణంలో వర్గవ్యవస్థకి సమాంతరంగా ఉన్న పితృస్వామ్యం, కులం లాంటి వ్యవస్థలకు మధ్య నున్న గతితార్కిక సంబంధాలను అధ్యయనం చేయాలి. ఇక్కడ సామాజిక పునరుత్పత్తిని కూడా మరింతగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఆదరణతో ఉన్న 'అంతర్గత విభజన' వర్గాల ఏర్పాటులో వ్యవస్థీకృతంగా ఎదురౌతున్న సమస్యలను అర్థం చేసుకోడానికి సరిపోదు. ఎందుకంటే ఇది పితృస్వామ్యాన్ని సామాజిక ఉత్పత్తి వెలుపల ఉన్నట్టు చూపుతుంది. ఇందుకు భిన్నంగా ఈ కాలంలో అభివృద్ధిచెందిన మార్క్సిస్టు సిద్ధాంతం భౌతిక, ఉపరితల వాస్తవాలకు మధ్యనున్న మరింత సంక్లిష్టమైన సంబంధాలను పరిశీలించేందుకు అవసరమైన అభివృద్ధిని సాధించింది. దానిని ఉపయోగించుకొని సమస్యల మూలలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. ఈ విధమైన సైద్ధాంతిక విశ్లేషణ, వర్గాల ఏర్పాటు, పునరుత్పత్తి వంటి విషయాలు మరింత విపులంగా వివరించే ఆస్కారం కల్పించి, అవి పితృస్వామ్యం, ఇతర సామాజిక సంస్థలు ఏర్పడేందుకు ఎలా దోహదపడ్డాయో తెలుసుకునేటట్టు చేస్తాయి. ఈ అధ్యయనాలు 'తీవ్ర', 'సోషలిస్టు/మార్క్సిస్టు' ఫెమినిస్టుల మధ్య విబేధాలను కూడా తగ్గిస్తాయి. అందువలన పెట్టుబడిదారీ విధానంపై కలిసి పోరాడే అవకాశాలు మెరుగుపడతాయి.

**(అనువాదం: కె ఉషారాణి)**

# మోడి విధానాలకు వ్యతిరేకంగా నవంబరు 26న సార్వత్రిక సమ్మె

(11వ పేజీతరువాయి)

రైతుల ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చడానికి తీసుకొచ్చినట్లు చెబుతున్న మూడు వ్యవసాయ రంగ సంస్కరణల బిల్లులు రైతుల మెడకు ఉరితాడులా వేలాడుతున్నాయి. ఈ బిల్లులు వ్యవసాయరంగంలో ప్రవేశించిన రిలయన్స్, అదానీతో సహా స్వదేశీ, విదేశీ బడా కంపెనీల లాభాలకు మరింత గ్యారంటీ కల్పించడానికి ఉద్దేశించబడ్డాయి. చట్టవిరుద్ధమైన బ్లాక్ మార్కెటింగ్‌ను చట్టబద్ధం చేసింది. వ్యవసాయ మార్కెట్ కమిటీలను నిర్వీర్యం చేసి బడా కంపెనీలకు ఇష్టమొచ్చిన ధరకు వ్యవసాయోత్పత్తులను కొనుగోలుచేసుకొనే వెసులుబాటు కల్పించింది. వ్యవసాయోత్ప త్తులను తక్కువ ధరకుకొని నిల్వచేసుకొని, వినియోగదారులకు అధిక ధరలకు అమ్ముకొనే అవకాశాన్ని చట్టబద్ధం చేసింది. చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, ఉల్లిపాయలు వంటివి నిత్యావసర సరుకుల చట్టం పరిధిలోకి రానందున ఇష్టమొచ్చిన ధరలకు విక్రయించుకొనే అధికారం కంపెనీలకు వరప్రసాదమవుతుంది. దేశంలో అతి తక్కువ భూమి కల్గిన చిన్న, సన్నకారు రైతులు 86 శాతం మంది వున్నారు. కనీస మద్దతు ధర కంటే కంపెనీలు తక్కువకు కొనడానికి వీల్లేదని బిల్లులో పెట్టలేదు. పెద్దపెద్ద కంపెనీలకు స్టోరేజ్, ప్రాసెసింగ్ సదుపాయాలు కల్పించి మార్కెట్‌పై పూర్తి ఆధిపత్యం కల్పించే ప్రయత్నంలో భాగమే నూతన వ్యవసాయరంగ సంస్కరణ బిల్లు తప్ప రైతులను ఉద్ధరించేదికాదు. తెల్లారితే తిట్టుకొనే అధికార, ప్రతిపక్ష పార్టీలు వైసిపి, టిడిపి రెండూ మోడీ ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక బిల్లులను సమర్థిస్తూ ఓటేశాయి. 2006లో బీహార్ ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేసిన తరువాత ఆ రాష్ట్రంలో వ్యవసాయోత్ప త్తుల ధరలు ఘోరంగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయరంగ బిల్లులతో దేశం లోని రైతాంగమంతా ఇప్పుడు నష్టపోనున్నారు. ప్రధాని మోడీ అన్నట్లు వ్యవసాయ బిల్లులు కోట్లాదిమంది రైతులకు సాధికారతను ఇవ్వవు. కార్పొరేట్ సంస్థలు, బడా వ్యాపారవేత్తలు, అగ్రిబిజినెస్ సంస్థలు పెద్దఎత్తున దోపిడీ చేయటానికి బిల్లులు తోడ్పడతాయి.

గత ఎన్నికల్లో సామినాథన్ కమిటీ సిఫార్సులను అమలుచేస్తామని బిజెపి ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసింది. దాన్ని అమలు చేస్తామని బిల్లులో ఎందుకు పేర్కొనలేదు? స్వామినాథన్ కమిటీ సిఫార్సు అమలుచేస్తే పంట ఉత్పత్తికి అయ్యే ఖర్చుకు ఒకటిన్నర రెట్లు చెల్లించాలి. దానిద్వారా రైతుకు కనీస గిట్టుబాటుధర అందుతుంది.

ఇప్పటికే ఎరువుల ధరల నియంత్రణ ఎత్తివేసింది. ఎరువుల సబ్సిడీ 75వేల కోట్ల నుంచి 45వేల కోట్లకు తగ్గించింది. ఇదిచాలదన్నట్లు విద్యుత్ వినియోగదారునికి సరఫరాచేసే యూనిట్‌కు అయ్యే ఖర్చులో 20శాతానికి మించి రాయితీ ఇవ్వకూడదని నూతన విద్యుత్ సంస్కరణలలో కేంద్రం నిబంధన విధించింది. ఆ నిబంధనలో భాగంగానే వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగంపై తీవ్రదాడికి పూనుకున్నాయి.

భారతదేశంలో ఫాసిస్టు పంథాను మోడీ అమలుచేస్తున్నారు. కార్మిక, రైతాంగ బిల్లులు ఆమోదం పొందడానికి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. మోడీకి, హిట్లర్‌కు ఫాసిస్టు పంథాలో తేడాలేదు. ద్వేషాన్ని రెచ్చగొట్టి మోడీ పాలన సాగిస్తున్నాడు. నియంతృత్వం ఒకేరోజు రాదు. సంపదను సృష్టించే కార్మికవర్గం, పంటలు పండించి తిండిపెట్టే నూరు కోట్లమందికి పైగా కష్టజీవుల హక్కులను కాలరాసే నియంతృత్వపాలనకు గట్టిగా బుద్ధి చెప్పాలి. అడుగడుగునా పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు అడ్డుతగలాలి. అదే నేడు కష్టజీవుల కర్తవ్యం. 'నౌ ఆర్ నెవర్' ఇప్పుడు కాకుంటే మరెప్పుడూ సాధ్యంకాదనే పట్టుదలతో పోరాడాలి. నవంబరు 26 సమ్మెతో కేంద్ర ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలి. ❋

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం, డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# తెలంగాణా సాయుధ ప్రజా పోరాటం-2

(2వ పేజీ తరువాయి)

విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలా? పాక్షిక సైనిక చర్యలను నిలిపివేసి, కాంగ్రెస్ ప్రభుత్వం మిలిటరీ పాలనలో చట్టపరమైన విధానాలను అనుసరించాలా? సైనిక జోక్యం జరిగిన వెంటనే, ఏ విధమైన షరతులు లేకుండా పోరాటాన్ని గనక నిలిపి వేస్తె పోరాటంలో పాల్గన్నవేలాది గొరిల్లా దళాలకు, కార్యకర్తలకు, పార్టీ సభ్యులకు భారత ప్రభుత్వం క్షమా బిక్ష ప్రకటిస్తుందా? ఈ ప్రశ్నలపై పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఒక వర్గం భారత సైనిక శక్తికి వ్యతిరేకంగా పాక్షిక సాయుధ ప్రతిఘటన విలిపివేయాలని, చట్టపరమైన బహిరంగ పోరాటాలు చేయాలని ప్రతిపాదించింది. విశాలాంధ్ర పార్టీ కమిటీ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. తెలంగాణా రైతాంగం సాధిం చిన విజయాలను రక్షించుకోడానికి యూనియన్ సైన్యం చేస్తున్న దాడులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చింది. పోరాటం విరమించడం అంటే పోరాడిన రైతాంగానికి ద్రోహం చేయడమే అని, అది తెలంగాణా ప్రజా ఉద్యమానికి తీరని నష్టాన్ని కలిగిస్తుందని వాదించింది.

భూస్వాములు వారి తాబేదారులు తిరిగి గ్రామాలకు చేరుకోవడం, రైతులపై దాడులు రైతులు పొందిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం, పార్టీ కార్యకర్తలలో అవమానాన్ని నింపాయి. ఆఖరికి గొరిల్లా పోరాట ప్రతిఘటన కొనసాగించాలనే వారి మాటే చెల్లింది, పార్టీ కార్యకర్తలు తిరిగి దళాలుగా ఏర్పడి భారత యూనియన్ సైనికులను, పోలీసులను సాహసోపేతంగా ప్రతిఘటించడం మొదలుపెట్టారు. తమకంటే ఎన్నోరెట్లు బలం కలిగిన యూనియన్ సైన్యాన్ని ఎదుర్కోడానికి పార్టీ కార్యకర్తలు, తమ దళాలను పునర్ నిర్మించుకున్నారు. అయినా అత్యంత బలం కలిగిన సైన్యాన్ని ఎదిరించడంలో ఎంతో రక్తం చిందించవలసి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం 50000 సైనాయన్ని దింపి ఏడాదిలో దాదాపు 10 నుండి 15కోట్లు ఖర్చు పెట్టింది. అయినా ప్రతిఘటన ఆపలేకవ దానికి పార్టీ కార్యకర్తల అసాధారణ ప్రతిఘటన, చావుకు వెరవక పోవడమే కారణం. తెలంగాణా నాయకుల ఒత్తిడి వలన, పక్కనున్న ఆంధ్రా ప్రాంతంలో పాశవిక అణచివేత కారణంగా, పోరాటంలో పాల్గంటున్న కార్యకర్తల నుండి ఒత్తిడి వలన గొరిల్లా ప్రతిఘటన మరిన్ని ప్రాంతాలకు విస్తరించడం జరిగింది. అయితే అది విజయం సాధించలేదు. సాయుధ పోలీసులు, భూస్వాముల గుండాలు కమ్యూనిస్టు కార్యకర్తలను పాశవికంగా హత్యలు చేసారు. అందువలన పార్టీలోని చాలామంది మిలిటెంట్ కార్యకర్తలను అడవులకు పంపించవలసి వచ్చింది. నాయకత్వానికి, 'తరవాత ఏం చేయాలనే' ప్రశ్న ఉదయించింది. 1948 లో జరిగిన రెండో పార్టీ మహాసభ 'తెలంగాణ మార్గమే మన మార్గం' అని పిలుపునిచ్చింది. అది తెలంగాణ సాయుధ పోరాటానికి సంపూర్ణ మద్దత్తు ప్రకటించింది. అటువంటి పోరాటాలే దేశమంతటా వ్యాపింపచేయాలని, దానికి కార్మిక వర్గం మద్దత్తు పొందాలని, ఆ పోరాటాలన్నీ చివరకు సాయుధ తిరుగుబాటుగా పరిణామం చెందాలని పిలుపునిచ్చింది.

నిజాంకి వ్యతిరేకంగా మొదలయిన తెలంగాణ సాయుధ పోరాటం, భారత సైన్యం జోక్యంతో ఇంకెంతమాత్రం స్వేచ్ఛకోసం జరిగే పోరాటంగా లేదు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో కలిసి పోయింది. అదిప్పుడు రైతులు తమవద్ద ఉన్న భూమిని కాపాడు కోడానికి చేసే సాయుధ పోరాటంగా మారిపోయింది. అంటే పాక్షిక, ఒక తరగతి ప్రయోజనాలు మాత్రమే కాపాడే పోరాటం. భూమి కోసం జరిగే పాక్షిక పోరాటానికి బదులుగా, కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా జరిగే స్వేచ్ఛా పోరాటంగా రూపు దాల్చింది. అయితే కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒంటరిపాటు కాలేదు. కార్మిక వర్గం రైతాంగ పోరాటానికి సంఘీభవంగా, 1948 సెప్టెంబర్‌లో సైనిక జోక్యానికి ముందు గాని 1951 అక్టోబర్ వరకు తెలంగాణ సాయుధ ప్రతిఘటన జరుగుతున్నప్పుడుగాని, ఏ రకమైన పోరాటాలు చేయలేదు, సమ్మెలు చేయలేదు. ఆ పరిస్థితులలో ఇంకెంత మాత్రం పోరాటాన్ని కొనసాగించలేమని, పోరాటం విరమించే సమయం వచ్చిందని నిర్ణయించడం జరిగింది. ఇందుకు కారణాలు.

మొదటిది, ముఖ్యమైనది, పోరాటం చేస్తున్న గోరిల్లా దళాల పట్ల ప్రజలలో సానుభూతి ఉన్నప్పటికీ తెలంగాణా ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన ప్రజల భాగస్వామ్యం తగ్గడం.

రెండోది, ఒకవైపు సైనిక వలయాలు, పోలీసుల కాంపులు పెరగగా, రెండోవైపు ప్రజలు పోరాటాలలో పాల్గనడం తగ్గింది. అంతేకాదు సమర్ధవంతంగా సాయుధులైన శత్రువులను ఎదిరించడంలో విఫలమయ్యారు. సైన్యానికి వ్యతిరేకంగా జరిగే దాడులు తగ్గుతూ వచ్చాయి. వ్యక్తిగతంగా భూస్వాములపైనా, వారి శత్రువులైన ఏజెంట్ల పైనా దాడులు జరగడం మొదలయింది. పోరాటం గనక కొనసాగితే వ్యక్తిగత తీవ్రవాదంగా మారే ప్రమాదం ఉందన్నది స్పష్టంగా తెలుస్తున్నది.

మూడోది, రైతులు తాము ఆక్రమించుకున్న వఅథా భూములు సాగులోకి తెచుకున్నవి, ఉంచుకోగలిగినా ఆక్రమించుకున్న అదనపు భూమిని వదులుకోవలసి వచ్చింది. వారి ఆక్రమణలో ఉన్న భూమికి కూడా చాలా చోట్ల ఏంతో కొంత కౌలు చెల్లించవలసి వచ్చింది. వాటిని సాయుధులైన ప్రజలు ప్రతిఘటించే లేదా తిరిగి పొందే పరిస్థితి లేదు.

నాలుగు, దేశవ్యాప్తంగా పాలకులు తమ పట్టు పెంచుకున్నారు. పైగా తెలంగాణ పోరాటానికి మద్దతుగా ఏ రకమైన సంఘీభావం గాని, ప్రచారం గాని దేశంలోని ఇతర ప్రాంతాలలో జరగలేదు.

ఐదో అంశం, భవిష్యత్తు కార్యాచరణ పై నాయకుల మధ్య తీవ్రమైన విభేధాలు.

ఆరు, పోరాటాలు చేస్తున్న గొరిల్లా నాయకుల మధ్యకూడా విభేధాలు పెరుగుతూ వచ్చాయి. కేంద్రంలో ఉన్న నాయకులు, పోరాట దళాలలో ఉన్నవారు కూడా పోరాటాలను వదిలి వెళ్లడం మొదలయింది. ఇవి ప్రమాద ఘంటికలు.


చివరిగా, పాక్షిక ప్రయోజన పోరాటాలకు, స్వేచ్ఛ కోసం జరిగే పోరాటంలో భాగంగా జరిగే పాక్షిక ప్రయోజనాలకు ఉన్న బేధం స్పష్టంగా తెలుసుకోవలసిన అవసరం ఉంది. అలా తెలుసుకోవడం వలన భవిష్యత్తు ఎత్తుగడలను రూపొందించు కోవడం సులభం అవుతుంది. తెలంగాణ ఉద్యమ నాయకులు అడవులలో సుదూర ప్రాంతాలు పర్యటించి ఈ అవగాహనను దళాలకు వివరించారు. తెలంగాణ పోరాటాలలో పాల్గంటున్న వారికి కనీస రక్షణ హామీ లేకుండా, రైతుల అధీనంలో ఉన్న భూమికి హామీ లేకుండా ప్రభుత్వం నుండి భూమి పొంద గలమన్న హామీ లేకుండా పోరాటం కొనసాగించ గలరా అని అడిగి తెలుసుకున్నారు.

అమరాబాద్ ప్రాంతీయ కమ్యూనిస్టుల, గొరిల్లాల మహాసభలో తిరోగమన వ్యూహ తీర్మానం వివరించబడింది. అయితే పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని శపథం చేసారు: "ఉద్యమం పురోగమిస్తున్నప్పుడు ఎంత నైపుణ్యంతో ఎలా ముందుకు సాగుతుందో అలాగే అననుకూల పరిస్థితులలో తిరోగమించ వలసి వచ్చినప్పుడు అంతే ధైర్యంగా చొరవ తీసుకుని, అవసరమైన అడుగులు వెనక్కు కూడా వేయాల్సి ఉంటుంది. ఇలా వెనకడుగు వేయాల్సి వచ్చినందుకు నిరాశ చెందాల్సిన పని లేదు. ఉద్యమంలో సంపాదించిన అనుభవంతో, కొత్త కార్యక్రమం ఆధారంగా, కొత్త ఎత్తుగడల పంథా ఆధారంగా మనం తెలంగాణ ఉద్యమంలో బలహీనతలను అధిగమిస్తాం. జాతి ఐక్యతను, స్వేచ్ఛను సాధించడం ద్వారా ఇంతకన్నా ఎన్నో రెట్లు బలమైన ఉద్యమాన్ని నిర్మించుకుంటాం. భారత దేశ ప్రజల ప్రజాతంత్ర ఉద్యమంలో మన వంతు పాత్రను మనం నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాము"!

1951 అక్టోబర్ 2వ తేదీ తెలంగాణ సాయుధ పోరాటం విరమించుకుంటున్న నిర్ణయాన్ని ప్రకటించాము. ❇

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-11-2020 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# పోరాడడం నేర్పే పాఠశాల.. సమ్మె



**– వి.ఐ. లెనిన్**

"....తమను తీవ్రమైన ఈతిబాధలకు గురిచేసే పీడననుండి రక్షించుకునేందుకు కార్మికులు తాడోపేడో అనే రీతిలో పోరాటానికి దిగుతారు. ఒక్కొక్కరుగా ఉంటే తాము శక్తిహీనులమని, పెట్టుబడిదారీ పీడన తమను అణగదొక్కేస్తుందని గుర్తించే కొద్దీ వారు తమ యజమానులపై ఐక్యంగా తిరగబడతారు. ఆ విధంగా కార్మికుల సమ్మెలు ప్రారంభమవుతాయి...

"అన్ని దేశాల్లోనూ కార్మికుల ఆగ్రహం తొలుత విడివిడి తిరుగుబాట్లుగా ప్రారంభమవుతుంది. రష్యాలో పోలీసులు, ఫ్యాక్టరీ యజమానులు వీటిని "మ్యుటినీలు" అన్నారు. అన్ని దేశాల్లోనూ ఈ విడివిడి తిరుగుబాట్లు ఒకవైపు శాంతియుత సమ్మెలకూ, మరోవైపు కార్మికవర్గం తన విముక్తికోసం చేసే సర్వతోముఖ పోరాటాలకూ దారితీస్తాయి....

"అయితే, పెట్టుబడిదారీ వ్యవస్థ సహజ లక్షణం నుండి ఉద్భవించే సమ్మెలు, ఆ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికవర్గం సాగించే పోరాటానికి నాంది అవుతాయి. ధనిక పెట్టుబడిదారులతో ఆస్తిపాస్తుల్లేని కార్మికులు వ్యక్తిగతంగా తలపడితే కార్మికులు బానిసలుగా మారిపోతారు. కాని ఆస్తిపాస్తుల్లేని ఆ కార్మికులే ఐక్యమైతే పరిస్థితి మారిపోతుంది.....

"...ప్రతి సమ్మె పెట్టుబడిదారులకు – నిజమైన యజమానులు కార్మికులేగాని తాము కాదన్న విషయాన్ని గుర్తుచేస్తుంది. కార్మికులు రానురాను తమ హక్కులగురించి గొంతెత్తుతారు. ప్రతి సమ్మె కార్మికులకు – తమ పరిస్థితి నిరాశాజనకంగా లేదని, తాము ఒంటరి వాళ్లం కాదన్న విషయాన్ని గుర్తుచేస్తుంది.....

"సమ్మె కార్మికులకు – యజమానుల బలాన్ని, కార్మికుల్లో ఉన్న బలాన్ని అర్థంచేసుకోవడమెలాగో నేర్పుతుంది. తమ యజమానులగురించి మాత్రమే కాక, తమచెంతనున్న కార్మికులను గురించి మాత్రమే కాక మొత్తం యజమానులగురించి, మొత్తం పెట్టుబడిదారీ వర్గం గురించి, మొత్తం కార్మికవర్గం గురించి ఆలోచించడం నేర్పుతుంది. అనేక తరాల కార్మికుల శ్రమను దోచుకుని కోట్లు గడించిన ఫ్యాక్టరీ యజమాని కొంచెం వేతనం పెంచడానికి నిరాకరిస్తే, వేతనాన్ని ఇంకా తగ్గించేయడానికి ప్రయత్నిస్తే, దానికి కార్మికులు అడ్డం తిరిగినప్పుడు ఆకలిగొన్న వేలాదిమంది కార్మికుల కుటుంబాలను రోడ్లపాలు చేస్తే, అప్పుడు మొత్తం పెట్టుబడిదారీ వర్గం మొత్తం కార్మిక వర్గానికి శత్రువని కార్మికులకు స్పష్టమైపోతుంది. కార్మికులు తమ కాళ్లమీద, తమ సంఘటిత శక్తిమీద తాము నిలబడాలన్న విషయం కూడా వారికి స్పష్టమైపోతుంది. ఫ్యాక్టరీ యజమాని కార్మికులను తరచు మోసగిస్తుంటాడు. తాను వారిని ఉద్ధరించేవాడిలా పోజుపెడుతుంటాడు, చిన్న చిన్న రాయితీలు, పనికిరాని వాగ్దానాలతో తన దోపిడీని కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నిస్తుంటాడు. ఒక్క సమ్మె ఈ మోసాన్ని ఒక్క దెబ్బతో బట్టబయలు చేస్తుంది. తమను ఉద్ధరించేవారు మేకతోలుకప్పుకున్న పులులన్న విషయాన్ని కార్మికులకు స్పష్టం చేస్తుంది.

"అంతేకాదు, సమ్మె పెట్టుబడిదారుల సహజలక్షణం పట్లనే కాకుండా ప్రభుత్వ, దాని చట్టాల లక్షణాలపట్ల కూడా కార్మికుల కళ్లు తెరిపిస్తుంది....ప్రతి సమ్మె – ప్రభుత్వం తమ శత్రువన్న అవగాహనను, కార్మికవర్గం ప్రజల హక్కులకోసం పోరాడ్డానికి సిద్ధపడాలన్న అవగాహనను కార్మికుల్లో అభివృద్ధిచేసి, పటిష్ట పరుస్తుంది.

"అందువల్ల సమ్మెలు, కార్మికులకు ఐక్యం కావడాన్ని నేర్పుతాయి. తాము ఐక్యంగా ఉంటేనే పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడగలమని వారికి తెలియజెప్పుతాయి. మొత్తం ఫ్యాక్టరీ యజమానుల వర్గానికి వ్యతిరేకంగా, ఏకపక్ష పోలీసు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొత్తం కార్మిక వర్గం పోరాడాలన్న ఆలోచనను సమ్మెలు కార్మికులకు నేర్పుతాయి. ఈ కారణం చేతనే సోషలిస్టులు సమ్మెలను "యుద్ధ పాఠశాల"గా పేర్కొంటున్నారు. మొత్తం ప్రజానీకాన్ని, శ్రమజీవులందరినీ ప్రభుత్వాధికారుల కబంధ హస్తాలనుండి, పెట్టుబడి పీడననుండి విముక్తి చేయడానికి శత్రువుపై పోరాడ్డం ఎలాగో కార్మికులు నేర్చుకునే పాఠశాల సమ్మె."

**(వి.ఐ. లెనిన్ కలెక్టెడ్ వర్క్ ప్రోగ్రెస్ పబ్లిషర్స్,1964, మాస్కో, వాల్యూమ్ 4, పేజీ 310–319 నుండి)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.15, No.6. Published on November 1, 2020